ప్రజలే ప్రభువులు

# జనబలం

ఫిబ్రవరి 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-



Annual Status of Education Report

असर ASER 2022 RURAL

Facilitated by PRATHAM

## నమోదు పెరిగింది .. నాణ్యత తగ్గింది

రాష్ట్రాలూ ఇదే తరహా బాధ్యతాయుత

## బడ్జెట్‌లు ప్రవేశపెట్టాలి







## భూ సేకరణ చట్టం అమలులో వైఫల్యం




కొత్త రీతిలో ఆలోచించండి..

## 'ఉత్తరాంధ్ర' ప్రాంతీయ బోర్డు కోసం పోరాడండి


విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత, ఎంటర్ ప్రెన్యూర్లు,
మహిళలు, మార్పు కోరుకుంటున్న పౌరులు..
జయప్రకాశ్ నారాయణ్ గారిని మీరే ప్రశ్నలు అడిగే అవకాశం
YouTube
www.youtube.com/@JPLoksattaOfficial
#Ask JP
వారం వారం ప్రతి శనివారం 4.00 P.M.
JP LOKSATTA YOUTUBE లో ప్రతి ఎపిసోడ్ చూడండి
JP ని మీ ప్రశ్నలు అడగటానికి ఈ QR CODE ద్వారా
రిజిస్టర్ అవ్వండి

ప్రజలే ప్రభువులు

# జనబలం


లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 25 | 2 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| ఫిబ్రవరి 2023 | | శిరమని నరేష్ | సోమసుందర్ |


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# విద్యారంగంలో అవ్యవస్థ.. అసర్ హెచ్చరిక!

**సంపాదకీయం**

విద్యారంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోలేక అవస్థపడుతున్నామన్న వాస్తవాన్ని అసర్ 2022 నివేదిక మరోసారి గుర్తు చేసింది. పిల్లల్ని చదివించుకోవాలన్న తల్లిదండ్రుల తపనను కరోనా మహమ్మారి ఏమాత్రం అడ్డుకోలేకపోయింది. ఆర్థిక ఇబ్బందులున్నా పిల్లల చదువు కోసం తల్లిదండ్రులు డబ్బు ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. పిల్లలు కూడా బడికి వస్తున్నారు. అయితే బడికి వచ్చిన పిల్లలకు చదువు చెప్పడంలో మన వ్యవస్థ ఘోరంగా విఫలం అవుతోంది. కరోనా కాలంలో డిజిటల్ స్థానాల ద్వారా చదువు చెప్పే ప్రయత్నం చేసినా అంతగా  విజయవంతం కాలేదు. కరోనా అనంతరం పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్నా జరిగిన అభ్యసనా నష్టాన్ని పూడ్చడానికి తగిన ప్రయత్నం జరగలేదు. ఫలితంగా పిల్లల నమోదు గణనీయంగా పెరిగినా అభ్యసనా సామర్థ్యాలు మాత్రం దిగజారిపోయాయి.

కరోనా కాలంలోనే నూతన విద్యావిధానం అమలులోకి వచ్చింది. బాల విద్యకు, పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలన్న నూతన విధానం ఇంకా పూర్తిగా పాదుకోలేదు. వరుసగా మూడేళ్లుగా బడ్జెట్‌లో విద్యారంగపు కేటాయింపులు తగ్గుతూ వస్తున్న నేపథ్యంలో విద్యారంగంలో అవ్యవస్థను చక్కదిద్దడంపై పౌరసమాజం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అసర్-2022 నివేదిక హెచ్చరించింది.

'అసర్-2022' నివేదిక జనవరి 18వ తేదీన న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో విడుదల అయ్యింది. నాలుగేళ్ల వ్యవధి తర్వాత పూర్తి స్థాయిలో అసర్ సర్వే జరిగింది 2022లోనే.  అసర్ నివేదికల వరుస క్రమంలో అసర్-2022 నివేదిక 17వది. దేశంలోని 616 గ్రామీణ జిల్లాల్లో,  19060 గ్రామాల్లో 3,74,554 కుటుంబాలకు 27,536 మంది వలంటీర్లు వెళ్లి సర్వే నిర్వహించారు. మొత్తం 6,69,597 మంది 3-16 వయోవర్గం పిల్లల అభ్యసనా సామర్థ్యాలను వారు పరీక్షించారు.

అదే సమయంలో 17,002 ప్రభుత్వ పాఠశాలలను వలంటీర్లు సందర్శించారు. పిల్లల నమోదును, హాజరును, ఉపాధ్యాయుల సంఖ్యను వారి హాజరును, బడిలో ఉన్న మౌలిక సదుపాయాల వివరాలను వలంటీర్లు సేకరించారు. కరోనా అనంతర కాలపు విద్యాస్థితిగతులను తెలుసుకోవడానికి అసర్-2022 నివేదిక తగినంత సమాచారాన్ని అందచేసింది.

కరోనా తెచ్చిపెట్టిన ఆర్థికభారం ఉన్నప్పటికీ తల్లిదండ్రులు పిల్లల్ని బడికి పంపించడానికి ఏమాత్రం వెనుకంజవేయలేదని అసర్ గణాంకాలు వెల్లడించాయి. 6-14 వయోవర్గపు బడి నమోదు 98.4 శాతానికి చేరుకోవడం పెద్ద విశేషం. గత పదేళ్లలో జాతీయ స్థాయిలో బడి నమోదు 97శాతానికి దిగువనే ఉంటూ వచ్చింది. బడిబైటి బాలల సంఖ్య పెరుగుతుందన్న ఆందోళనను పటాపంచలు చేస్తూ 2018లో వారి సంఖ్య 2.8శాతంగా ఉండగా, 2022లో 1.6 శాతానికి తగ్గింది. అయితే ఆర్థిక భారాన్ని తట్టుకోవడానికి తల్లిదండ్రులు ప్రైవేటు బడుల బదులు ప్రభుత్వ బడులను ఆశ్రయించిన వైనం గోచరించింది. జాతీయ స్థాయిలో ప్రైవేటు బడుల నమోదు 2018 నాటికి 30.9 శాతం ఉండగా 2022లో 25.1 శాతానికి తగ్గింది. మొత్తం నమోదులో 5.8 శాతంగా కన్పించే ఈ సంఖ్య ప్రైవేటు బడుల నమోదులో చూస్తే 19 శాతం తగ్గుదల కన్పించింది. అయితే ఇది ఒక తాత్కాలిక అంశం మాత్రమేనని, ప్రభుత్వ బడుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెరగపోతే మరోసారి ప్రైవేటుకు మొగ్గు తప్పదని విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వ బడులకు కొత్తగా మరలిన 80 లక్షల మంది పిల్లలను నిలుపుకోవడం పెద్ద సవాలని వారు అంటున్నారు. అయితే తమ పిల్లలకు బడిలో చదువు రాదన్న భయంతోనే తల్లిదండ్రులు ప్రైవేటు ట్యూషన్ల వైపు ఎదురుచూస్తున్నారని అసర్-2022 నివేదిక వెల్లడించింది. ట్యూటర్లను ఆశ్రయించే విద్యార్థుల సంఖ్య గతంలో 26.4 శాతంగా ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 30శాతానికి పెరిగింది. ప్రైవేటు బడుల నమోదు బాగా తక్కువ ఉన్న పశ్చిమబెంగాల్, బీహార్ రాష్ట్రాలలో ప్రైవేటు ట్యూషన్లకు వెళ్లే విద్యార్థులు 70 శాతంగా ఉండటం కూడా గమనించాల్సిన అంశం.

కరోనా కాలంలో డిజిటల్ విద్యను ఒక ప్రత్యామ్నాయంగా భావించారు. అయితే ఆ ప్రయత్నం పెద్దగా విజయవంతం కాకపోయినా డిజిటల్ అవకాశాలు మాత్రం అపారంగా ఉన్నాయని అసర్-2022 వెల్లడించింది. గ్రామీణ భారతదేశంలో సెల్‌ఫోన్ ఉన్న కుటుంబాలు 2018లో 90.2 శాతం కాగా 2022లో 95.8 శాతం గృహాలకు సెల్‌ఫోన్ ఉన్నది. అదే కాలంలో స్మార్ట్‌ఫోన్ ఉన్న కుటుంబాలు 36శాతం నుంచి 74.8శాతానికి పెరిగాయి. అయితే సాంకేతిక కారణాల వల్ల, సిగ్నల్ లేక, విద్యుత్ లేక 26శాతం పిల్లలు ఆన్‌లైన్ విద్యను అందుకోలేకపోగా మరో 47శాతం పిల్లలు అరకొరగా మాత్రమే అందుకోగలిగారు. రెండేళ్లపాటు ఆన్‌లైన్ విద్యా ప్రయత్నం జరిగినా కేవలం 27శాతం పిల్లలు మాత్రమే సంపూర్ణంగా అందుకోగలిగారు. కరోనా అనంతరం బడులు తెరిచినా పిల్లలు బడికి వస్తున్నా ముందు జరిగిన నష్టం నుండి పిల్లలు పూర్తిగా కోలుకోలేక పోయారని అసర్-2022 నివేదిక తేటతెల్లం చేసింది. టీవీ మాధ్యమం ద్వారా పాఠాలు చెప్పాలన్న ప్రయత్నం కూడా పెద్దగా ఫలితాలు సాధించలేదు. అయితే బడి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చి చదివించాలన్న ప్రయత్నం ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రారంభం అయ్యింది. వినడం ద్వారా, చదవడం ద్వారా, చూడటం ద్వారా అభ్యసనా సామర్థ్యాలు మెరుగు అవుతాయని తెలిసిందే. అయితే బడి కుటుంబం కలిసి పనిచేస్తేనే ఫలితాలు వస్తాయి.

కరోనా అనంతరం అభ్యసనా సామర్థ్యాలు నాసిగా ఉన్నాయని అసర్-2022 సర్వే తెలిపింది. కరోనా కాలంలో పరిమిత స్థాయిలో జరిగిన అసర్ సర్వే నాటి అభ్యసనా స్థాయిల్లోనే కరోనా అనంతరం కూడా విద్యార్థులు కొనసాగుతున్నారు. కరోనా రోజుల్లో సైతం ఎంతో కొంత స్థాయిని అంటే నాసిగా అయినా సరే పిల్లలు సాధించడానికి కారణం ఏమై ఉంటుంది? పిల్లలకు ఇంటి దగ్గర అందిన తోడ్పాటు దానికి కారణం కావచ్చు.

బడిలో అందిందే విద్యకు తోడుగా బడి బైటకూడా అదనపు తోడ్పాటు అందించే ప్రయత్నం చేస్తే అభ్యసనా స్థాయిలు పెరుగుతాయని స్పష్టంగాచెప్పవచ్చు. గతంలో ప్రథమ్ సంస్థ చేపట్టిన 'లాఖోమ్ మే ఏక్' ప్రయత్నం కొన్ని ఫలితాలను చూపించింది. కుటుంబమూ, సమాజమూ కలిసి ప్రయత్నం చేస్తే అభ్యసనా సామర్థ్యాల కొరతను అధిగమించడం సాధ్యమేనని చెప్పవచ్చు. జాతీయ విద్యావిధానం-2022 ప్రకారం బాల విద్యపై, పూర్వ ప్రాథమిక విద్యపై దృష్టి సారిస్తున్న క్రమంలో పిల్లల అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు అవసరమైన 'సరళ నమూనా'లను కనుగొనాల్సి ఉంది. కరిక్యులం, పరీక్షల విధానంలో ఉన్న కాఠిన్యాన్ని, తొలగించి అభ్యసనా స్థాయిల వారీ బృందాలను ఏర్పాటు చేసి, బడిలోనూ, బడిబైటా కూడా వారు నేర్చుకునే అవకాశాలను రూపొందించాల్సి ఉంది. ప్రభుత్వమూ, సమాజమూ, కుటుంబమూ కలిసికట్టుగా కృషి చేస్తేనే విద్యారంగంలోని అవ్యవస్థ చక్కబడుతుంది.

డి. సోమ సుందర్

# భూసేకరణ చట్టం అమలులో వైఫల్యం..

## నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించాలి




ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన వారికి పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని ప్రజా స్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం అంటే చట్టాలను సక్రమంగా అమలు చేయటమని, అధికార యంత్రాంగం 2013 భూసేకరణ చట్టం అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వం భూనిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా వారిని నక్సలైట్లుగా తయారు చేస్తోందన్నారు. ప్రభుత్వానికి ఎకరం కావాల్సి ఉంటే రెండెకరాలు సేకరించి, అవసరానికిపోను మిగతా ఎకరాన్ని అభివృద్ధి చేసి నిర్వాసితులకు అందచేయాలని, అన్ని వసతులతో పునరావాసం కల్పించాలన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయం దొడ్డి కొమురయ్య హాల్‌లో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ ప్రాజెక్టుల భూనిర్వాసితులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో జేపీ మాట్లాడారు. పార్టీ తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసు అధ్యక్షత వహించారు.

ప్రాజెక్టుల పేరుతో తమను సొంత గ్రామాల నుంచి బయటికి పంపించిన తర్వాత ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోయామని భూనిర్వాసితులు వాపోయారు. పొట్ట పోసుకోవటానికి అడ్డమైన పనులూ చేయాల్సి వస్తోందన్నారు. ఏళ్లు గడిచినా ప్రభుత్వం నుంచి పరిహారం, పునరావాసం, పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) ప్యాకేజీలు అందనివారు వేల సంఖ్యలో ఉన్నారన్నారు.

రైతుల ఘోషపై జేపీ స్పందిస్తూ, తాను అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ గ్రామాల కన్నీటి గాథలు కదిలించి వేస్తున్నాయన్నారు. అనవసరమైన, అసంబద్ధమైన ప్రాజెక్టులు చేపట్టి విలువైన ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయవద్దని గత ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డికి, ప్రస్తుత ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకి నచ్చచెప్పేందుకు తాను ఎంతో ప్రయత్నించానని గుర్తుచేశారు.

అసంబద్ధ ప్రాజెక్టులు చేపట్టటం, వాటికి భూసేకరణ పేరిట రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా భూములు లాక్కోవటం దుర్మార్గమని, భూములిచ్చిన రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని జేపీ అన్నారు. భూనిర్వాసితులకు తగిన పరిహారం అందించకుండా ఇబ్బందిపెట్టటం సరికాదన్నారు. భూసేకరణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయని అధికారులు నేరస్తులతో సమానమన్నారు.

ఏ ప్రాజెక్టు కోసం భూమిని సేకరిస్తారో.. ఆ ప్రయోజనం కోసం భూమిని వినియోగించకపోతే రైతులకే భూమిని తిరిగి ఇవ్వాలని జేపీ స్పష్టం చేశారు. అధికారులు చట్టాలను ఉల్లంఘించకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టుల కింద భూములు, ఇళ్లు, ఉపాధి కోల్పోయిన నిర్వాసితుల ప్రాతినిధ్యంతో కమిటీని ఏర్పాటు చేసి ప్రతి గ్రామం నుండి సమగ్ర వివరాలను నమోదు చేసి భూనిర్వాసితుల సమస్యలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సమావేశం నిర్ణయించింది. ఈ కమిటీలో హయాతుద్దీన్, నర్సింహారెడ్డి, బద్దం రాజిరెడ్డి, మారుతిరావు, రాజగోపాలరావు తదితరులు ఉన్నట్టు తుమ్మనపల్లి తెలిపారు.

కార్యక్రమంలో మల్లన్నసాగర్, అనంతగిరి, గౌరవెల్లి, రంగనాయకసాగర్, కొండపోచమ్మ, దేవాదుల, డిండి, జాతీయ రహదారి ప్రాజెక్టుల బాధిత నిర్వాసితులు, లోక్‌సత్తా పార్టీ ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్, తీగాలపల్లి రంగాచారి, కారుమంచి గణేష్, శివరామకృష్ణ, వంగాల రంగాచారి, వీరేష్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూములిచ్చినవాళ్ల గోడు వినిపించుకోవట్లే

"ప్రాజెక్టుల కోసం భూములిచ్చిన గ్రామస్తులు అందరి కంటే ఎక్కువ నష్టపోయారు. సరైన పరిహారం అందించకుండా వారిని గాలికి వదిలేశారు. వారిలో కొందరు తీవ్ర స్థాయి నిర్ణయాలు తీసుకుంటున్నారు. గత రెండేళ్లుగా కొన్ని కేసులు ఇంకా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇద్దరు న్యాయవాదులు రైతులకు న్యాయం జరిగేందుకు పోరాడారు గానీ, కొంతమంది లాయర్లు రైతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని దోపిడీకి పాల్పడ్డారు" అని వేములఘాట్, మల్లన్నసాగర్ నిర్వాసితుడు హయతుద్దీన్ అన్నారు. ఓ సందర్భంలో పోలీసు అధికారొకరు తమను తుపాకితో బెదిరించాడన్నారు. జహీరాబాద్‌కు చెందిన తుక్కమ్మ దాఖలు చేసిన పిటిషన్‌తో జీవో 123ను కోర్టు కొట్టివేసినా, ఈటిగడ్డకిష్టాపూర్‌కి చెందిన నాయిని సరిత దాఖలు చేసిన కేసు గెలిచాకే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని ప్రకటించారన్నారు.

## రెండుసార్లు భూమిని కోల్పోయాం

తాము రెండుసార్లు భూమిని ఎలా కోల్పోయారో కొండపోచమ్మకు చెందిన గ్రామస్తుడు మహేందర్ వివరించారు. ఒకటి రిజర్వాయర్ కోసం, రెండోసారి.. పరిహారం డబ్బుతో కొనుకున్న భూమిని రైల్వే ట్రాక్ కోసం. "తానేదార్‌పల్లికి చెందిన దాదాపు 22 కుటుంబాలు కొండపోచమ్మ ప్రాజెక్టు భూపరిహార డబ్బుతో కొనుక్కున్న ప్లాట్లను కోల్పోయాయి. మాకు ఇంకా న్యాయం జరగలేదు" అని తెలిపారు.

## మూడు ప్రాజెక్టులకు భూములు తీసుకున్నారు

మూడు వేర్వేరు ప్రాజెక్టులను తాను భూమిని ఎలా కోల్పోయిందీ వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన రాజగోపాల రావు ఆవేదనతో వివరించారు. ఒకసారి సాగునీటి ప్రాజెక్టు, ఇంకోసారి టెక్స్‌టైల్ పార్కు, ఆ తర్వాత గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు తీసుకున్నారన్నారు.

## మార్కెట్ రేటు ఇయ్యలే

అనంతగిరి ప్రాజెక్టు కింద భూమి కోల్పోయినం. అప్పుడు బోరు, బావి, చెట్లు, పైపులైన్ల పనులను అధికారులు రికార్డు చేయలేదు. దీంతో నష్టపోయాం. అంతేకాకుండా భూమికి మార్కెట్ ధర ఇవ్వకుండా పాత రేటు ఇచ్చిన్రు. లీడర్లు ఇచ్చిన హామీ ఇంకా నెరవేరలేదు.

- నర్సింహారెడ్డి, అల్లీపూర్, జహీరాబాద్

## ఇప్పటికైనా పరిహారం ఇవ్వండి

ఎప్పుడో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కింద గౌరల్లి ప్రాజెక్టు ఖరారైంది. అప్పుడు ఎకరానికి రెండు లక్షలు ఇచ్చిన్రు. ప్రభుత్వం మరలా రీడిజైన్ కింద 1900 ఎకరాలు సేకరించింది. మాకు పాత రేటే ఇచ్చిన్రు. ఇప్పటికీ మార్కెట్ ధర కట్టలే. ఇకనైనా భూసేకరణ చట్టం ప్రకారం మాకు పరిహారం అందించాలి. నిర్వాసితులకు కాలనీ ఏర్పాటు చేయాలి.

-బద్దం రాజిరెడ్డి, హుస్నాబాద్

# కొత్త రీతిలో ఆలోచించండి..

## 'ఉత్తరాంధ్ర' ప్రాంతీయ బోర్డు కోసం పోరాడండి




సారవంతమైన భూమి, 1000 మిల్లీ మీటర్ల వర్షపాతం, సముద్రతీరం, ఖనిజ సంపద ఉన్నా ఉత్తరాంధ్ర ప్రాంతం వెనుకబడటానికి కారణం మానవ తప్పిదం తప్ప ప్రకృతి శాపం కాదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రభుత్వం అంటే దేవుడు, సర్వాంతర్యామి, అన్నీ చేయగలదు అనే భ్రమలో ఉన్న మనందరిదీ ఈ తప్పు అని స్పష్టం చేశారు. సంపద సృష్టించేది ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు కాదని.. నైపుణ్యంతో ఉపాధి ద్వారా నిర్వహించే కార్యకలాపాల నుంచి, ధైర్యంగా పెట్టుబడులు పెట్టి పోటీపడే ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నుంచి ప్రజలు సంపద సృష్టిస్తారన్నారు. ప్రభుత్వాలు ఉమ్మడిగా మనకు అవసరమైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, సత్వర న్యాయం మొదలైన పనులకు పరిమితం కావాలన్నారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు తప్ప మిగతా ఏ పనిలో జోక్యం చేసుకున్నా సమస్యలో భాగమవుతాయి తప్ప పరిష్కారం కాజాలవన్నారు. మనం పాత వాసనల్ని వదిలించుకుని ముందు ఈ స్పష్టత తెచ్చుకోవాలని, ప్రభుత్వం చేయాల్సిన పనులు సమర్థంగా చేసేలా ఒత్తిడి తేవటం, మిగతా పనులు మనం ఎప్పటికప్పుడు సామర్థ్యాన్ని పెంచుకుంటూ నిర్వహించుకోవటం జరగాలన్నారు. ఈ పనిచేయకుండా, అంతా ప్రభుత్వమే అన్నట్లు వ్యవహరించటం వల్లే ప్రకృతి కరుణించినా ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసుకోలేకపోయామన్నారు. ప్రభుత్వాలు ఓట్ల వేటలో మన పన్నుల డబ్బును తగలేయటంతోపాటు అప్పులు తెచ్చిన డబ్బును కూడా తాత్కాలిక పథకాలు వంటి రోజువారీ ఖర్చులకే వాడుతుండటంతో ఉత్తరాంధ్ర సమస్యలు అలాగే కొనసాగుతున్నాయన్నారు. యూనియన్ ప్రభుత్వం ఏటా రూ.10 లక్షల కోట్ల పైన అప్పులు తీసుకుంటోందని, పలు రాష్ట్రాల ప్రభుత్వాలు దివాలా తీసే స్థాయిలో అప్పుల్లో కూరుకుపోయాయన్నారు. కేవలం వడ్డీలకే మన దేశంలో ప్రభుత్వాలు ఏటా రూ.16 లక్షల దాకా ప్రజాధనం ఖర్చు చేస్తున్నాయన్నారు. ఈ పరిస్థితి మారాలంటే పాత ధోరణుల్ని వీడి కొత్తరీతిలో ఆలోచించాలన్నారు.

'ఉత్తరాంధ్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారు?' అంశంపై ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన సదస్సులో జేపీ పాల్గొన్నారు. తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్న పాత్రుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, ఏయూ విశ్రాంత ఆచార్యుడు కె.ఎస్ చలం, టీచర్స్ ఎమ్మెల్సీ రఘువర్మ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ ఉపాధ్యక్షుడు ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, చర్చా వేదిక కో కన్వీనర్ భీశెట్టి బాబ్జీ తదితరులు కూడా హాజరైన ఈ కార్యక్రమానికి.. ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అధ్యక్షత వహించారు.

జేపీ మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర నుంచి వచ్చే పన్నుల ఆదాయంలో కొంత వాటాను ఇక్కడే ఖర్చు చేసే ఏర్పాటు ఉంటే, ఇక్కడి ప్రజల అవసరాలు, ఆకాంక్షలకనుగుణంగా ఆ డబ్బు వినియోగించుకోవచ్చన్నారు. ఇందుకోసం అధికారాలు,

జవాబుదారీతనమున్న ప్రాంతీయ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ బోర్డులో ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలే ఉంటారని, వారే నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఇలా బోర్డును ఏర్పాటు చేసి ఇక్కడి పన్నుల ఆదాయం నుంచే ఏటా రూ.25,000 కోట్లు కేటాయించి ఉంటే, ఉత్తరాంధ్రలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులు ఈపాటికే పూర్తయి ఉండేవన్నారు. రాజ్యాంగంలో 371 (డి) ద్వారా ఏర్పడిన ప్రాంతీయ బోర్డులను ఆరు సూత్రాల ప్రణాళిక పేరుతో తొలగించకుండా ఉంటే రాష్ట్ర విభజన కూడా జరిగి ఉండేది కాదన్నారు. తాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా ఎకరాకు కేవలం 2,000 రూపాయల ఖర్చుతో దాదాపు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పథకాలు అమలు చేశానని, ఈవేళ తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందించే నీటికి ఎకరాకు రూ.30-40,000 దాకా ఖర్చవుతోందని, ప్రాజెక్టు ఖర్చుకు-వచ్చే ఆదాయానికి సంబంధం లేకుండా ప్రజాధనం ఖర్చు చేశారన్నారు. అందుకే ప్రాణహిత-చేవెళ్ల పేరుతో ఉన్నప్పటి నుంచీ ఆ ప్రాజెక్టును తాను వ్యతిరేకించానని, రైతులకు సాగునీరు అందించాలనటంలో సందేహం లేదని, కానీ ప్రాజెక్టులు హేతుబద్ధంగా ఉండాలని పోరాడానన్నారు. సాధికార ప్రాంతీయ బోర్డులు, ఎక్కడికక్కడ అధికార వికేంద్రీకరణ ఉండివుంటే కాళేశ్వరంలాంటి ఏకపక్ష నిర్ణయాలు ఉండేవి కావన్నారు. ఉత్తరాంధ్రకు ప్రాంతీయ బోర్డుతోపాటు జిల్లాల ప్రాతిపదికన సమితులు ఏర్పాటు చేసి అధికారాల్ని బదిలీ చేయాలన్నారు. పైస్థాయి వ్యవహారాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటూ, విశాఖ నగరం మినహా మిగిలిన చోట్ల విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రాజెక్టులు వంటివి ప్రాంతీయ బోర్డు ద్వారా నిర్ణయం చేసుకోవచ్చన్నారు.

**అన్ని వలసలూ ప్రమాదకరం కాదు**

అలాగే వలసల పట్ల విపరీత వాదనలు తగదని జేపీ స్పష్టం చేశారు. అన్ని వలసలూ ప్రమాదకరం కాదని గుర్తించాలన్నారు. ప్రగతిలో వలసలు భాగమని, అయితే గతిలేక పొట్ట చేత పట్టుకుని వలసలు పోవాల్సిన పరిస్థితి ఉండకూడదన్నారు. బాగా నైపుణ్యం ఉన్నవారికి మహానగరాల్లో, విదేశాల్లో అవకాశాలొస్తే వెళ్లటం అభివృద్ధికి దోహదం చేస్తుంది కానీ, చుట్టుపక్కలే ఉపాధి ఏర్పాటుకి అవకాశమున్న నైపుణ్యాలవారు పెద్దనగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. గతిలేక వెళ్లే అలాంటి వలసల వల్ల అరకొర, తాత్కాలిక ఆదాయాలతో వారు దుర్భర జీవితాన్ని గడపాల్సి వస్తుందన్నారు. ఓ ప్లంబర్‌కి, ఓ ఎలక్ట్రీషియన్‌కి చుట్టుపక్కలే ఉపాధి కల్పించే ఏర్పాటు చేయకుండా ఉత్తరాంధ్ర సమస్యను పరిష్కరించలేమన్నారు. సరైన ఆర్థిక అవకాశాలు లేక గ్రామాలు రోజురోజుకూ ఖాళీ అవుతున్నాయన్నది ఈవేళ చేదునిజమన్నారు. వ్యవసాయం అత్యవసరమని, అయితే ఎక్కువ శాతం ప్రజానీకం ఆ రంగం మీద ఆధారపడటం ఆచరణసాధ్యం కాదన్నారు. సాగు పట్ల మనకు ఎంత మమకారమున్నా దేశ ఆదాయంలో ఆ రంగం వాటా 16-17 శాతం మించటం లేదని, వ్యవసాయానికి బయట ఉపాధి అవకాశాల్ని కల్పించాలని, ఆధునికతకు అర్థం ఇదేనన్నారు.




**గ్రామాల్లోనే పట్టణాల సౌకర్యాలను కల్పించాలి**

గ్రామాలలోనే పట్టణాల సౌకర్యాలను కల్పించాలని, ఇందుకు చిన్న పట్టణాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని జేపీ పేర్కొన్నారు. ప్రాంతీయ బోర్డు ఇందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాన్నే నమ్ముకుంటే ఈ పని జరగదని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగంలో ఉన్నంతవరకూ ఒక ఫోన్ కావాలంటే వేల రూపాయల డిపాజిట్ కట్టి మరీ ఏళ్ల తరబడి వేచి చూడాల్సి ఉండేదని, ఇప్పుడు మొబైల్ ఫోన్లు, టీవీలు వచ్చాయంటే అది ప్రయివేటు రంగం, పోటీ వల్లే సాధ్యమైందన్నారు. ప్రతి జిల్లాలో బ్రాండిక్స్‌లాంటి సంస్థ ద్వారా ఉపాధి కల్పించాలన్నారు. ఎక్కడో శ్రీలంక నుంచి వచ్చిన కంపెనీ

ఆ పని చేస్తోందని, దాదాపు 20వేల మందికిపైగా చుట్టుపక్కల మహిళలకు ఉపాధి కల్పిస్తోందన్నారు. అది నిజమైన దేశభక్తి, అలాంటి వాళ్లు మనకు ఆరాధ్యులు కావాలని అన్నారు.

**ఉత్పాదకత, ఆదాయాల కోసం నాణ్యమైన ఆరోగ్యం, విద్య**

ఉత్పాదకత పెంచటానికి, ప్రజలపై ఆర్థిక భారం తగ్గించటానికి సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలని, ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తాయే ఒక పథకాన్ని రూపొందించిందని జేపీ వివరించారు. అతి తక్కువ ఖర్చుతో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించటం మనకు పూర్తిగా సాధ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఆరోగ్య రంగంలో ఖర్చు బాగానే చేస్తున్నా, పాత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోకుండా అమలు చేస్తుండటం వల్ల ఆశించిన ఫలితాలు రావన్నారు. వచ్చే పదేళ్లలో కేవలం ఆరోగ్య రంగంలో మన దేశానికి రూ.10 లక్షల కోట్లు మేర ఆదాయం వచ్చే అవకాశముందన్నారు.

అలాగే యూనివర్సిటీ చదువుల కన్నా ముందు పాఠశాల విద్య మీద దృష్టి పెట్టాలన్నారు. స్కూళ్లలో సరైన చదువు లేకుండా యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థులు ఏం చేయగలరన్నారు. దాదాపు 80 శాతమంది సర్టిఫికెట్లు ఎందుకూ పనికిరావన్నారు. ఏపీలో పాఠశాల విద్యలో ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.80-90,000 దాకా ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, కానీ విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ఇంకా ఎక్కువ ఖర్చు అక్కర్లేదని, జాతీయ విద్యావిధానాన్ని సక్రమంగా, విద్యాప్రమాణాల్ని పెంచేలా అమలు చేయాలన్నారు. ప్రాంతీయ బోర్డు ఏర్పాటు చేసుకుంటే విద్య, ఆరోగ్యం వంటి పలు రంగాల్లో అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయన్నారు.

కొత్తరీతిలో ఆలోచించి ఈ రకంగా వ్యవహరిస్తేనే మార్పు సాధ్యమని జేపీ స్పష్టం చేశారు. రోడ్లు వేయటం చేతకాని ప్రభుత్వం, చట్టబద్ధపాలనని గూండాలకు వదిలేసిన ప్రభుత్వం మన సమస్యలన్నిటీ పరిష్కరించగలదనే భ్రమ నుంచి బయటకు రావాలన్నారు. ప్రభుత్వం తాను చేయాల్సిన పనులు సవ్యంగా చేసేలా వ్యవహరిస్తూనే మిగిలిన అంశాల్లో ప్రజలుగా మనం చొరవ తీసుకునే వ్యవస్థీకృత ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

**పెద్ద ఎత్తిపోతల పథకాల జోలికి పోనక్కర్లే.. తక్కువ ఖర్చుతో సాగునీరందించే వనరులున్నాయి**

ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయకపోవటం అన్యాయమని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. వినసొంపైన పేర్లతో ఇక్కడ అనేక చిన్న నదులున్నాయని, అసంబద్ధమైన పెద్ద ఎత్తిపోతల పథకాల జోలికిపోకుండా తక్కువ ఖర్చుతో రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించవచ్చని, ప్రకాశం జిల్లాలో తాను చేసింది ఇదేనని అన్నారు. పోలవరం ప్రాజెక్టును నలభై ఏళ్లుగా పట్టించుకోకపోవటం దారుణమన్నారు.

**నదుల అనుసంధానం**

ఉత్తరాంధ్రకు కీలకమైన మరో అంశం నదుల అనుసంధానమని జేపీ తెలిపారు. దేశంలో ఆసేతు హిమాచలం నదుల అనుసంధానం సాధ్యం కాదని, ఉత్తరాది కంటే మనం

## రాష్ట్రమంతా అండగా నిలవాలి

ఉత్తరాంధ్ర దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురవుతోంది. ఈ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రజా ఉద్యమమే శరణ్యం. దీనికి రాష్ట్రమంతా అండగా నిలవాలి. ఉత్తరాంధ్ర అభివృద్ధికి నిధులు, ఉద్యోగావకాశాలు కావాలి, రైతులు రెండు పంటలు పండించుకునే పరిస్థితి రావాలి. ఏయూలో 90 శాతం ఆచార్యుల పోస్టులు ఖాళీగా ఉంటే విద్యాబోధన ఎలా జరుగుతుంది? బహుళ అంతస్తుల భవనాల్లో ఎక్కడ చూసినా వాచ్‌మన్లుగా ఉత్తరాంధ్రవారే ఉంటారు. వారిని ఇంకా అలాగే ఉంచే పరిస్థితులు కొనసాగకూడదు. 16 నదులున్నాయి. కానీ 207 టీఎంసీలు అవసరమైతే 100 టీఎంసీల నీళ్లే అందుతున్నాయి. దీంతో 30 లక్షల ఎకరాల్లో రెండు పంటలు పడే అవకాశమున్నా ఉపయోగించుకోలేకపోతున్నాం. 10 లక్షల ఎకరాల్లో ఒక్క పంటే గగనమవుతోంది. 8 లక్షల ఎకరాలకు నీళ్లివ్వగలిగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని నిర్లక్ష్యం చేశారు. 170 ఎంజీడీల తాగునీటికి 120 ఎంజీడీలే అందుబాటులో ఉండటంతో కటకటలాడుతున్నాం. పరిశ్రమలకు నీరిచ్చే పరిస్థితి లేదు. నీరు చాలక ఉక్కు కర్మాగారం ఉత్పత్తిని తగ్గించుకున్న సందర్భాలున్నాయి. విశాఖకు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్, విశాఖ రైల్వే స్టేషన్‌కు అనుబంధంగా శాటిలైట్ రైల్వే స్టేషన్ కావాలి. విమ్స్‌లో సరిపడా వైద్యులు లేరు. మౌలిక వసతులూ కరువే. ఉద్దానంలో కిడ్నీ వ్యాధులతో జనం చనిపోతున్నా పట్టించుకోవటం లేదు. 2011 లెక్కల ప్రకారం ఉత్తరాంధ్రలో 79 శాతం ఇళ్లకు కుళాయిలు, 59 శాతం ఇళ్లకు మరుగుదొడ్లు లేవు. విభజన చట్టంలో చెప్పినట్లు ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు బుందేల్‌ఖండ్ ప్యాకేజీ అమలు చేయకుండా యూనియన్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది (రాష్ట్ర విభజన సమయంలో అసెంబ్లీలో ఈ ప్రతిపాదన చేయటంతోపాటు, పార్లమెంటు ఈ అంశాన్ని విభజన చట్టంలో పొందుపరిచేలా కూడా జేపీ చొరవ తీసుకున్నారు. ఆ తర్వాత ఈ హామీల అమలు స్థితి, ఇతర రాష్ట్రాలకు కూడా ఆమోదయోగ్య రీతిలో వీటి అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై తెలుగేతరుల ప్రాతినిధ్యం కూడా ఉన్న నిపుణుల బృందంతో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆధ్వర్యంలో ప్రామాణిక నివేదికను రూపొందించి ప్రభుత్వాలకు, పార్టీలకు అందచేశారు). రాష్ట్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు 15-20% నిధులు కేటాయిస్తే అన్ని రకాలుగా అభివృద్ధి చేయొచ్చు. కాలుష్య కారక పరిశ్రమలను తెచ్చి విశాఖలో పెడుతున్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి 2012లో ప్రకటించిన 'అరకు డిక్లరేషన్'ను అమలు చేయాలి. పరిశ్రమలతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా కార్యాచరణ ప్రకటించాలి.

**- కొణతాల రామకృష్ణ,**

**ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్**

కొంత ఎత్తున ఉండటం వల్ల గంగా, కావేరి అనుసంధానం వంటివి ఆచరణకు నిలబడవన్నారు. అయితే ఒడిషా నుంచి మహానది నుంచి నీటిని తీసుకుని గోదావరితో అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. దీనివల్ల ఉత్తరాంధ్రకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఒడిషాకు కొన్ని అభ్యంతరాలున్నా వాటిని తెలిగ్గానే అధిగమించవచ్చని, ఒప్పించవచ్చన్నారు.

**ఒడిషా నుంచి నేర్చుకోవాలి**

ఒడిషా మన కంటే ఎంతో పేద రాష్ట్రమైనా గత ఇరవై ఏళ్లుగా కొంతమేర తీసుకున్న మంచి చర్యల వల్ల మనకు కూడా ఆదర్శంగా నిలిచేస్థాయికి ఎదిగిందని ఈ సందర్భంగా జేపీ అన్నారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తనకు బంధువు కాదని, ఇంతవరకూ ఆయన్ని కలవలేదని, అయినా చేసిన మంచి గురించి మాట్లాడుకుంటున్నామని గుర్తించాలన్నారు. కొద్దిపాటి చిత్తశుద్ధి ఉండి, కొంతమేరయినా సరైన విధానాలు అవలంబిస్తే ఎంత మార్పు తేవచ్చో ఒడిషా నిరూపించిందన్నారు. ఒడిషాలోనూ రాజకీయపరమైన కొన్ని సమస్యలు ఉన్నాయని, అయితే ఉన్నంతలో పాలన మెరుగ్గా ఉందన్నారు. ఎన్నికల రాజకీయంలో మార్పు ఇప్పటికిప్పుడు రాకపోవచ్చని, డబ్బు చుట్టూ ఎన్నికల జాఢ్యం తెలుగువారి వల్లే దేశవ్యాప్తమవుతోందన్నారు. ఈ పాపం ఆంధ్రప్రదేశ్‌దైతే, ఆ తర్వాత కర్ణాటక, తమిళనాడు కూడా అందుకున్నాయన్నారు. ఇప్పుడు జమ్మూ కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఎన్నికలంటే డబ్బు ప్రవహిస్తోందని, ఈశాన్యంలో ఒక్కో సీటుకు ప్రధాన పార్టీ అభ్యర్థికి రూ.70 కోట్లు దాకా ఖర్చవుతోందన్నారు. రాష్ట్ర విభజన జరిగాక ఏపీ కంటే తమ వద్ద ఎక్కువ డబ్బు ఉందని తెలంగాణలో కూడా ఎన్నికలకు భారీగా ఖర్చు చేస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికలో 2019 బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీలు, వాటి అభ్యర్థులందరూ కలిసి చేసిన ఖర్చు కంటే ఎక్కువ ఖర్చు పెట్టారని, డబ్బు ప్రభావం మన ఎన్నికల్లో ఇది పరాకాష్టన్నారు. ఎన్నికల సంస్కరణల్ని ముందుచూపుతో అందరినీ ఒప్పించి తేవాల్సి ఉందన్నారు. జవాబుదారీతనంతో సాధికార ప్రాంతీయ బోర్డు ఏర్పాటు, జిల్లాలకు వికేంద్రీకరణ, విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రమాణాలతో ఫలితాలు ఇలాంటి మార్పులతోనే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. పాలకుల పాపం, మన పాతకాలపు ఆలోచనా ధోరణి వల్ల ఉత్తరాంధ్రకు జరిగిన నష్టం, జడత్వం నుంచి బయటపడాలంటే వ్యవస్థీకృత మార్పులే మార్గమని జేపీ స్పష్టం చేశారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై చర్చకు సిద్ధం

జేపీ ప్రసంగం ముగిస్తున్న సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ గురించి మాట్లాడాలని ఉద్యోగ సంఘాల నాయకులు నినాదాలు చేశారు. ప్రభుత్వం పని వ్యాపారం చేయటం కాదని, చేయాల్సిన పనులు సక్రమంగా చేయకుండా దేశాన్ని తరతరాలుగా నష్టపరుస్తున్న ప్రభుత్వాలు వ్యాపారాలు చేయాలన్న వాదన బూజుపట్టిన భావజాలమని, ఇటువంటి వాదనతో సంఘటిత రంగంలో ఉన్న కొద్దిమంది దేశంలోని కోట్లాది మంది ప్రజలకు నష్టం చేస్తున్నారని జేపీ పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రయత్నాన్ని కూడా ఆయన సమర్థించారు. ఏపీలోని దాదాపు అన్ని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాల ఆందోళనను సమర్థిస్తున్నాయి. దీంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు సభలో జేపీ ప్రసంగాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు', 'సేవ్ వైజాగ్ స్టీల్‌ప్లాంట్' అంటూ నినాదాలు చేశారు. దీనిపై జేపీ స్పందిస్తూ, నినాదాలు చేస్తున్నవారిలో చాలామంది పుట్టకముందే తాను విశాఖ స్టీల్‌ప్లాంట్ స్పెషల్ ఆఫీసర్‌గా చేశానని, కర్మాగారం గురించి తనకు స్పష్టమైన అవగాహన ఉందని (స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు అప్పట్లో మెరుగైన భూ పరిహారం అందటం, కర్మాగారమే శిక్షణనిచ్చి దాదాపు 8,000 మందికి ఉద్యోగాలివ్వటం ఆనాడు జేపీ కృషి వల్లే సాధ్యమైంది) అన్నారు.

"నినాదాలు, చప్పట్లకు లొంగను. సత్యానికి, ప్రజా ప్రయోజనాలకి, హేతుబద్ధ వాదనకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు తప్ప సంఘటిత శక్తుల ఒత్తిడులకు లొంగను. సమాజంలో కొందరైనా నిజాన్ని నిజంగా, హేతుబద్ధంగా చెప్పగలిగితే తర్వాత చరిత్ర నిగ్గుతేలుస్తుంది.

"ప్రభుత్వం అన్నీ చేస్తుందనేది భ్రమ అనటానికి టెలిఫోన్లే పెద్ద ఉదాహరణ. ఒకప్పుడు విలాసంగా ఉన్న ఫోన్లు ప్రయివేటీకరణతో అందరికీ అందుబాటులో ఉన్నాయి. నాకు మెరుగైన సేవ అందిందా, ప్రజలకు చౌకగా. నాణ్యమైన సేవలు, ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయా అన్నది తప్ప ఎవరు తయారుచేశారన్నది నాకనవసరం. ఎవరి అభిప్రాయాలు వారికి ఉండవచ్చు. కానీ ఇది సభా మర్యాద కాదు. సంఘటిత వర్గాలు గొంతు చించుకున్నంత మాత్రాన వారు చెప్పేది నిజం అని తలొగ్గను, గొంతు లేనివారు మాట్లాడనంత మాత్రాన అక్కడ నిజం లేదనుకోను. విశాఖ ఉక్కు గురించి చర్చిద్దామంటే మరో వేదికపై నేను సిద్ధం. పారిపోను" అని జేపీ పేర్కొన్నారు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం


ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com




ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## ఓట్ జుగాడ్: ఫిబ్రవరి 2023

## ఓటర్ల కు కనిపించని నిజాలు - 4

ప్రశ్న :“ద్వంద్వార్థరహిత చట్టబద్ధ పాలన” ద్వారా ఎన్నికల వ్యవస్థ సంస్కరణ సాధ్యమా లేక ఎన్నికల వ్యవస్థ సంస్కరణ ద్వారా చట్టబద్ధ పాలన సాధ్యమా?

జుగాడ్ ఓటర్‌గా నా సమాధానం : చట్టబద్ధపాలన, ఎన్నికల వ్యవస్థ అనే రెండు వ్యవస్థలూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. హక్కుగా ఈ రెండిటిని సాధించుకోవాలంటే ముల్లుని ముల్లుతోనే తీయాలి. రాబోయే మొదటి ఎన్నికల్లోనే తక్షణ రాజ్యాధికార స్వీకారానికి ఓటర్ల పరిమితధనంతో “మీరా-మేమా” తరహాలో నిశ్శబ్ధ, శాంతియుత, నైతిక, విప్లవానికి సిద్ధపడాలి.

“అదెలా సాధ్యం” అంటూ ఎవరికి తెలిసిన నీతులు వాళ్ళు వల్లిస్తూ కూచుంటే అందరికీ నష్టం. ముందుగా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యపరిపాలనకు అర్ధంతెలుసుకోవాలి. రాజనీతిని “రాజకీయం” అంటూ ధనిక వర్గాలకు చెందిన ఓటర్లు తమ వ్యక్తిగత ఆశయాలసాధనకై అవినీతిమయచట్టాలను ప్రతిపాదించి, వారికి తోచిన విధంగా పార్టీలను నిర్మించుకుని, పేదవర్గాల ఓటర్లను ప్రలోభాలతో వంచిస్తున్నారు. అధికారవాంఛను త్యజించగలిగిన ఓటర్ల ఉమ్మడినాయకత్వం ద్వారా ఆర్థికవికేంద్రీకరణతో సహా ప్రభుత్వోద్యోగులను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే సహకారోద్యోగులుగా వినిమయించుకోగలిగితే అన్నిసమస్యలకూ పరిష్కారం సాధ్యం. మీరుసిద్ధమైతే 25మంది జుగాడ్ ఓటర్లు + నేను (మహేశ్వరం MLA నియోజకవర్గపు అనుసంధానకర్తగా) సిద్ధం. త్వరగా మారుతున్న సమాజంలో ఓటర్లు కూడా త్వరగా మారాలి. లేకపోతే ఎప్పటికీ యాచకులుగానే మిగిలిపోతాం. ఆలస్యం అమృతం విషం!

ప్రజలయొక్క (ప్రతీ స్త్రీ /పురుష ఓటర్ యొక్క) అస్థిత్వానికీ వారి సుఖసంతోషాలతో కూడిన శాంతియుత జీవనానికీ మూలకారణాలయిన స్వేచ్ఛ, స్వతంత్రం, కులం, ధర్మం, మతం, మద్యం, ధనం, న్యాయం వగైరా ... ఎన్నో అంశాలను సమిష్టిగా శాసించగలిగిన మహావ్యవస్థ పేరు తెలుగులో ప్రజాస్వామ్యం - ఆంగ్లంలో (Democracy). ఇంకోమాటలో చెప్పాలంటే, వ్యక్తియొక్క రాగద్వేషాలతో (ఇష్టాయిష్టాలతో) (likes & dislikes) పెనవేసుకుని ఉన్న ‘భిన్నత్వంలో ఏకత్వం’ ప్రాతిపదికన అవగాహనతో ఓటర్లుగా ఒకరిపైఒకరికి పూర్తివిశ్వాసంతో, మనకుమనమే స్వపరిపాలన ధ్యేయంగా నిర్మించుకున్న జాతీయ రాజనీతి (National Policy for Good Governance) . ఇంత మంచిభావంతో (Ideology) భరోసా (guarantee) ఇవ్వగలిగిన, సనాతనమైన, శాశ్వతమైన “రాజనీతి” అనే సంపూర్ణపదానికి, సంక్షిప్త నిర్వచన గ్రంధమే మన రాజ్యాంగం (Constitution).10లక్షల రూపాయల లోపు వార్షికాదాయమున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు ఎదురుచూస్తున్న “పారదర్శకంగా అవినీతిరహిత” రాజనీతి పార్టీయే (ప్రతిపాదిత) జుగాడ్ ఓటర్ల ఉద్యమపార్టీ.

నమూనా మార్పు (paradigm shift) సంకల్పం ఉన్న జుగాడ్ ఓటర్లే తమ కష్టార్జితమైన 2వేల రూపాయలు, లేదా 5వేల రూపాయలు, గరిష్టంగా 10వేలరూపాయలు ఒకేఒకమారు విరాళమిచ్చి పార్టీని విలువలతోకూడిన “నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం” అనే ప్రాతిపదికపై నిర్మించుకుంటారు. జుగాడ్ (అధినేత రహిత) పార్టీకి పేరు ఓటర్లే నిర్ణయిస్తారు. జుగాడ్ ఓటర్ల “మెజారిటీ-ఓటు” ప్రకారం పార్టీ నిర్వహించబడుతుంది. 10వేలరూపాయిల విరాళదాత “భారతభాగ్య విధాతగా” గుర్తింపబడి, పార్టీ నిర్వహణలో నైనా లేదా క్రియాశీలక ఎన్నికలలో నైనా పాల్గొనవచ్చు. రండి! జుగాడ్ ఓటర్ల రాజనీతికి స్వాగతం పలకండి!

contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:

ADVT

# ఎన్‌జేఏసీ అనివార్యం..

## విజ్ఞత ప్రదర్శిస్తే వేగిరం సాధ్యం

ప్రజలందరికీ వేగంగా, అందుబాటులో న్యాయం అందించటం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మౌలికావసరం. ఈ నేపథ్యంలోనే మన దేశంలో స్వతంత్ర, పటిష్ఠ న్యాయవ్యవస్థ కోసం రాజ్యాంగ నిర్మాతలు తగిన ఏర్పాట్లు చేశారు. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలను సమతుల్య పరుస్తూనే న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించారు. స్వతంత్రానంతర కాలంలో మన న్యాయవ్యవస్థ కూడా ఈ అంచనాలను అందుకునేరీతిలోనే వ్యవహరించింది. అయితే 1970లలో ఎమర్జెన్సీ సమయంలో పరిణామాలు న్యాయవ్యవస్థను కూడా కుదిపేశాయి. మన అపరిపక్వ ప్రభుత్వం విఫలమైందో.. ఆ దుష్పరిపాలన కొనసాగటం న్యాయవ్యవస్థ సవాళ్లను ఇంకా పెంచింది. న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి వ్యతిరేకంగా ఎవరూ నోరు విప్పకున్నా.. చట్టబద్ధపాలన లేకుండా, చట్టాలు చేసేవారే నేరస్తులుగా ఉంటూ, పోలీసులు పాలకుల చేతుల్లో పావులుగా మారిపోయిన పరిస్థితుల్లో అందరు న్యాయమూర్తులూ తమ బాధ్యతల్ని రాజ్యాంగ ప్రమాణాల మేరకు నిర్వర్తించలేకపోయారు. అయినా కూడా న్యాయవ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వసనీయత గణనీయ స్థాయిలోనే కొనసాగింది. చెప్పాలంటే, రాజకీయ నాయకుల పట్ల కోపంతో కొంతకాలం ఎలాగైతే ఐఏఎస్




ప్రజాస్వామ్యంలో అవాంఛనీయ పరిణామాలను ఎదుర్కొని రాజ్యం బారి నుండి ప్రజల ప్రాథమిక హక్కులను పరిరక్షించటంలో, వ్యవస్థల సమతుల్యతను కాపాడటంలో దేశ అత్యున్నత న్యాయస్థానం కూడా తడబడింది. ప్రజలపై ప్రభుత్వ దాష్టీకాలు పెరగటం, న్యాయమూర్తుల నియామకాల్లోనూ రాజకీయ పక్షపాతాలు చోటుచేసుకోవటంతో మన దేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రత, పటిష్ఠతపై చర్చ మొదలైంది. అయితే ఏ దుష్పరిపాలనను సమీక్షించుకోకపోవటం ఎమర్జెన్సీకి దారితీసిందో, ఏ దుష్పరిపాలనను సరిదిద్దకుండా కేవలం ఇందిరాగాంధీని ప్రధాని పదవి నుంచి దింపటం మీదే దృష్టి పెట్టటం వల్ల జనతా అధికారులను ఆరాధించారో, అదే రీతిలో ఆ తర్వాత సివిల్ సర్వెంట్లు కూడా తమ ఆశలను నెరవేర్చకపోవటంతో న్యాయమూర్తుల మీద ప్రజలు ఇంకా ఎక్కువ ఆశలు పెట్టుకోవటం ప్రారంభించారు. మౌలిక మార్పులు తేకుండా తెచ్చిన షార్ట్‌కట్ 'పిల్' (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) ఇందుకు బాగా దోహదం చేసింది. మీడియా కూడా ప్రోత్సాహాన్ని అందించింది. దీంతో మీడియా హెడ్‌లైన్స్‌కు తగ్గ తీర్పులు రావటం మొదలైంది. దేశంలో పెద్ద మార్పులు రాలేదు, ప్రజాస్వామ్యం వికసించలేదు గానీ.. మీడియా రిపోర్టుల ప్రకారం అనేక 'చరిత్రాత్మక తీర్పులు' వెలువడ్డాయి. చివరికి థియేటర్లలో పాప్‌కార్న్ అమ్మాలా వద్దా వంటి

విషయాల్ని కూడా సుప్రీంకోర్టు నిర్దేశించే స్థాయి వచ్చేసింది. జడ్జీలు ప్రయివేటుగా ఏదో దేవస్థానానికి వెళ్లినా వార్తగా ప్రచురించటం ఆనవాయితీగా మారింది. ఈ రకంగా న్యాయవ్యవస్థ పట్ల కూడా క్రమంగా ప్రజల్లో నమ్మకం సడలే ప్రమాదకర పరిస్థితి ప్రస్ఫుటమవసాగింది. ఈ నేపథ్యంలోనే న్యాయ సంస్కరణలు కీలక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఎమర్జెన్సీ ప్రభావంతో రెండో స్వతంత్ర పోరాటాన్ని ప్రారంభించిన డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తాను ప్రారంభించిన వెంటనే న్యాయవ్యవస్థ సంస్కరణల మీద దృష్టి పెట్టారు.

ప్రభుత్వాల అణచివేతల నుంచి ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడటానికి, అయోధ్యలో బాబ్రీ మసీదు-రామమందిరం, నదీ జలాల పంపిణీ, రాష్ట్రాల విభజన, రిజర్వేషన్లు వంటి వివాదాలను విశ్వసనీయతతో పరిష్క రించి మన లాంటి వైవిధ్యభరితమైన, సంక్లిష్ట భిన్నత్వ మున్న దేశ సమగ్రతను కాపాడటానికి మన న్యాయవ్యవస్థ స్వతంత్రంగా, సమర్థంగా, సత్వర న్యాయం అందించేలా పనిచేయగలగాలి. వీటిలో న్యాయవ్యవస్థ బలహీనపడితే, ప్రజల్లో నమ్మకం పలచబడితే ప్రజాస్వామ్య మనుగడే ప్రమాదంలో పడుతుంది. న్యాయవ్యవస్థ ఈ ప్రమాణాల్ని అందుకోవాలంటే.. న్యాయ సంస్కరణల్లో భాగంగా ఉన్నత స్థాయి కోర్టుల్లో న్యాయమూర్తుల నియామకాల్లో నిష్పాక్షికత, పారదర్శకత ఉండేలా ఏర్పాట్లు చేయాలి. సమర్థంగా న్యాయం అందించగలిగేవారిని న్యాయమూర్తులుగా ఎంపిక చేయాలి. దీంతోపాటు న్యాయమూర్తులపై ఆరోపణలు వస్తే, వాటిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకునే ఏర్పాటు ఉండాలి. న్యాయమూర్తులపై నిర్దిష్ట ఆరోపణలు వచ్చినా నిగ్గుతేల్చి చర్యలు తీసుకున్న దాఖలాలు స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇప్పటిదాకా లేదు. ఈ క్రమంలోనే, మొదటి అడుగుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి ప్రస్తుత కొలీజియం వ్యవస్థ స్థానంలో జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) రాజ్యాంగ చట్టం కోసం జేపీ చొరవ తీసుకున్నారు.

న్యాయవ్యవస్థలో ఐదారు దశాబ్దాల మచ్చలేని చరిత్ర కలిగిన, దేశంలో న్యాయవ్యవస్థ గురించి ఏమాత్రం అవగాహన ఉన్నవారైనా గౌరవించే సుప్రసిద్ధులైన ముగ్గురు న్యాయకోవిదులతో కమిటీని ఏర్పాటు చేశారు. వీరిలో జస్టిస్ ఎం.ఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు కాగా, జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. జస్టిస్ వర్మ కొలీజియం ఏర్పాటుకు కారణమైన సెకండ్ జడ్జెస్ తీర్పు (1993) ను వెలువరించినవారు. కొలీజియం స్థానంలో ప్రధాన న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టు నుంచి ముగ్గురి ప్రాతినిధ్యం ఉన్న నియామకాల కమిటీని ఏర్పాటు చేయాలని వీరంతా బిల్లును రూపొందించారు. ఈ బిల్లును జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఆమోదించేలా జేపీ ఏకాభిప్రాయం సాధించారు. పార్లమెంటు ఆమోదించే సమయంలో కమిషన్ కూర్పులో స్వల్పమార్పులు చేసి ఎన్‌జేఏసీ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని చెయిర్‌పర్సన్ చేశారు. న్యాయవ్యవస్థ నుంచి ముగ్గురి ప్రాతినిధ్యం యధాతథంగా కొనసాగింది. 99వ రాజ్యాంగ సవరణగా ఈ బిల్లును పార్లమెంటు ఆమోదించాక సగానికి పైగా రాష్ట్రాల శాసనసభలు ధృవీకరించాయి. ఇంత లోతైన కృషితో, అరుదైన రాజకీయ ఏకాభిప్రాయంతో, చట్టసభల ఏకగ్రీవ ఆమోదంతో వచ్చిన చట్టాన్ని సుప్రీంకోర్టు కనీసం వాదనలు వినిపించే అవకాశం కూడా లేకుండా 2015లో కొట్టివేసింది. గొప్ప అవకాశాన్ని జారవిడిచింది. జడ్జీల పని జడ్జిలను నియమించటం కాదు అనే మౌలిక దృష్టి కూడా కొరవడింది. పక్షపాత రాజకీయ విమర్శలకు ఆస్కారమిచ్చింది.

ఎన్‌జేఏసీని తోసిపుచ్చుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీయే ప్రభుత్వం వెంటనే స్పందించి ఉంటే బాగుండేది. ఆరోజు జేపీ ఢిల్లీ వెళ్లి కోరినా కూడా స్పందించలేదు. దాదాపు ఎనిమిదేళ్లయ్యాక ఇటీవల మౌనం వీడి కొలీజియంను ప్రశ్నించటం ప్రారంభించింది. రాజ్యాంగ వ్యతిరేకమైన కొలీజియంను కొనసాగిస్తూ, ప్రత్యామ్నాయంగా పార్లమెంటు ఆమోదించిన ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేయటాన్ని వివిధ సందర్భాల్లో యూనియన్ న్యాయ శాఖా మంత్రి కిరణ్ రిజిజు ఆక్షేపించారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన వెంటనే జగదీప్ ధన్‌ఖడ్ ఏకంగా రాజ్యసభ చెయిర్ నుంచే విమర్శలు చేశారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని సుప్రీంకోర్టు ఎలా కొట్టివేస్తుందని ప్రశ్నించారు.

కొలీజియంపై ప్రభుత్వ తీరు ముతకగా ఉండవచ్చు, కొందరి భాష అభ్యంతరకరంగా కూడా ఉండవచ్చు. కానీ కొలీజియం రాజ్యాంగ విరుద్ధం అనేది విస్పష్టం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు న్యాయమూర్తులతో సంప్రదించి రాష్ట్రపతి నియామకాలు చేస్తారని రాజ్యాంగం చెప్పిందికానీ, సుప్రీంకోర్టుతో ఏకాభిప్రాయం, న్యాయవ్యవస్థదే తుది నిర్ణయమని చెప్పలేదు. ఇందుకు భిన్నంగా చెప్పటం రాజ్యాంగ నిరక్షరాస్యత అవుతుంది, రాజ్యాంగంలోని 'సైలెన్స్'కి వక్రభాష్యమవుతుంది. కానీ ప్రస్తుతమున్న కొలీజియం వ్యవస్థలో పారదర్శకత లేకపోవటంతోపాటు న్యాయమూర్తులే న్యాయమూర్తుల్ని నియమించు కుంటారు. రాజకీయ నేతలతో సంప్రదింపుల అనంతరం

అని చెబుతారుగానీ, ఒకసారి మాత్రమే ప్రభుత్వం తిరస్కరించగలదు. రెండోసారి కూడా అదే పేరును కొలీజియం పంపిస్తే ప్రభుత్వం ఆమోదించటం తప్ప గత్యంతరం లేదు. ఈ నేపథ్యంలోనే పదవిలో ఉన్నప్పుడు, పదవీ విరమణ తర్వాత పలువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా కొలీజియం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు.

న్యాయమూర్తులకు స్వతంత్ర ప్రతిపత్తి ఉండటమంటే ఎవరికీ జవాబుదారీతనం లేకపోవటం కాదు. కచ్చితంగా వాళ్లు రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి జవాబుదారీగా ఉండాల్సిందే. ప్రజలకు పరిజ్ఞానం లేదు, కాబట్టి వారు ఎన్నుకున్న పార్లమెంటు ద్వారా న్యాయమూర్తుల ఎంపిక జరిగితే దేశం నష్టపోతుంది అనే వాదనతో ఎన్‌జేఏసీని కొట్టివేయటం, న్యాయమూర్తులు రహస్యంగా తమలో తాము నియామకాలు చేసుకుంటేనే న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోగలమని వాక్రుచ్చటం ఏమాత్రం సమర్థనీయం కాదు. ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా అంతిమంగా ప్రజలకు జవాబుదారీగా ఉండటం తప్పనిసరి. న్యాయమూర్తులు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, స్పీకర్, రాజ్యాంగ సంస్థలు.. ఎవరైనా సరే!

అలాగే నియామక ప్రక్రియలో సమాజం నుంచి ఇద్దరు ప్రతినిధులు ఉంటారని ఎన్‌జేఏసీ లో పేర్కొంటే దానికీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ ఇద్దరినీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ఎంపిక చేస్తుంది. ఆషామాషీగా ఏమీ ఉండదు. బ్రిటన్, కెనడా, జాతీయ స్థాయిలో, రాష్ట్రాల్లో అమెరికా, ఫ్రాన్స్, దక్షిణాఫ్రికా ఇలా ఏ దేశంలోనైనా న్యాయమూర్తుల నియామకంలో సమాజం నుంచి ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రపంచంలో మనం మాత్రమే ప్రజాస్వామ్య దేశమని భ్రమపడనక్కర్లేదు. మనం అనేక ప్రజాస్వామ్య పద్ధతుల్ని ఇతర దేశాల నుంచి తీసుకుని అనుసరిస్తున్నాం కూడా. న్యాయమూర్తులు తమను తాము నియమించుకోవటానికి మన దేశం ఇరాన్ తరహా మత, నియంతృత్వ వ్యవస్థ కాదు. ప్రజాస్వామ్యాన్ని మనం ఎంచుకున్నాం.

రాజకీయంపై కోపం వల్ల, పక్షపాత రాజకీయం వల్ల ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేసినా సమాజంలో మథనం కనిపించలేదు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాల్ని కూడా ఇదేదో న్యాయవ్యవస్థ మీద దాడి అనుకుంటున్నారు. ప్రభుత్వంలో రహస్యాలు ఉండకూడదని జేపీ, అరుణా రాయ్ లాంటి వారు కలిసి తీసుకొచ్చిన సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టాన్ని స్వాగతించినవారు, న్యాయవ్యవస్థను ఉపయోగించుకుంటున్నారని కొందరు రాజకీయ నేతలపై ఆరోపణలు చేస్తున్నవారు కూడా ఈవేళ న్యాయవ్యవస్థలో ప్రజాస్వామ్య వ్యతిరేక రహస్య వాతావరణానికి కొమ్ముకాస్తున్నారు. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థగా, పట్టణీకరణ సమాజంగా భారత్‌కి న్యాయ సంస్కరణల అనివార్యతను మనం ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

'కొలీజియం రాజ్యాంగ వ్యతిరేకమైనదే కాదు, పనిచేయని వ్యవస్థ కూడా. ఎన్‌జేఏసీ వచ్చితీరుతుంది. కానీ రాజకీయంగా అది వెంటనే సాధ్యం కాకపోవచ్చు' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జేపీ తెలిపారు. ఎన్‌జేఏసీ ఆమోదానికి ప్రధాన జాతీయ పార్టీలను ఒప్పించటానికి ఆయన సంవత్సరాల తరబడి కృషి చేశారు. ముగ్గురు జస్టిస్‌ల ద్వారా జరుగుతున్న కృషిని ఎప్పటికప్పుడు జాతీయ పార్టీల ముఖ్య నేతలకు తెలియచేస్తూ, డాక్యుమెంట్లను అందచేస్తూ వచ్చారు. ఎన్‌జేఏసీ కోసం ఆయన ప్రయత్నం 1999 ప్రాంతం నుంచి మొదలైంది. పరస్పర అపనమ్మకంతో ఉండే పార్టీలన్నీ అలా చివరికి ఏకతాటిపైకి వచ్చి ఆమోదించినా.. 2015లో సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక పరిస్థితి మారింది. ఎవరి ఎన్నికల అవసరాన్ని బట్టి వాళ్లు మాట్లాడుతున్నారు. మరోవైపు మన దేశంలో సామాన్య ప్రజల్లో ప్రజాస్వామ్య భావం ఇంకా ఇంకలేదు. ప్రజాస్వామ్యం కోసం పోరాడే మధ్యతరగతి సంఖ్య తగినంతగా పెరగలేదు. ఉన్న మధ్యతరగతిలో, మీడియాలో కూడా ప్రజాస్వామ్యం పట్ల ఏవగింపు ఎక్కువగా ఉంది. డబ్బు, వనరులు ఉన్నవారేమో వీలుంటే రాజకీయ ప్రక్రియకు అతీతంగా ఉండాలని, వీలుంటే ప్రజాస్వామ్యాన్ని వదిలించుకోవాలని అనుకుంటున్నారు. రాజకీయంగా ఈ పరిస్థితుల్లో తిరిగి ఎన్‌జేఏసీ లాంటి రాజ్యాంగ సవరణ తేవటం, రాష్ట్రాల చేత ఆమోదింపచేసుకోవటం సాధ్యమయ్యే అవకాశాలు కనిపించటం లేదు. పదిహేను, ఇరవై ఏళ్లు పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదంటున్నారు.

జేపీ చెప్పినట్లు, ఈ సమస్యను వేగంగా పరిష్కరించే అవకాశం సుప్రీంకోర్టు చేతుల్లో ఉంది. ఆధిపత్యం చూపించాలనే ధోరణితో తన విశ్వసనీయతను తానే దెబ్బతీసుకోకుండా, అత్యున్నత న్యాయస్థానం వ్యవహరిస్తే ఇది సాధ్యం. విస్తృత రాజ్యాంగ ధర్మాసనంతో తన తీర్పు పునస్సమీక్షకు సుప్రీంకోర్టు సానుకూల సంకేతాన్నిస్తే, సమష్టి న్యాయ విజ్ఞతను ప్రదర్శిస్తే ఎన్‌జేఏసీ సాకారమవుతుంది.

ప్రభుత్వం వైపు నుంచి కూడా కొన్ని చర్యలు అవసరం. కొలీజియంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఇటీవల లేఖ రాసినట్లు యూనియన్ న్యాయ శాఖా మంత్రి కిరణ్ రిజిజు పార్లమెంటులో ధృవీకరించారు. కొలీజియం సెర్చ్ కమ్ ఎవాల్యుయేషన్ కమిటీ ఏర్పాటు చేసి, అందులో ప్రభుత్వానికి ప్రాతినిధ్యం కల్పించాలని అందులో సూచించారు. హైకోర్టు కొలీజియాల్లో రాష్ట్ర

ప్రభుత్వానికి, సుప్రీంకోర్టు కొలీజియంలో యూనియన్ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. అయితే.. ఇది అంత ఆచరణసాధ్యంగా కనిపించదు, అవాంఛనీయం కూడా. మెమొరాండం ఆఫ్ ప్రొసీజర్ (ఎంఓపీ)ను సాధ్యమైనంత మెరుగుపరిచే ప్రయత్నం అవసరమే. 2015లో ఎన్‌జేఏసీకి వ్యతిరేకంగా తీర్పు రాసిన న్యాయమూర్తుల్లో కూడా ఇద్దరు.. జస్టిస్ కేహార్, జస్టిస్ జోసెఫ్ కురియన్ కూడా ప్రస్తుత కొలీజియంలోని లోపాల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. పారదర్శకతను పెంపొందించేలా ఎంఓపీని మెరుగుపరచాలని సూచించారు. ఈ నేపథ్యంలో అప్పట్లో జేపీ నేతృత్వంలోనే ఎఫ్‌డీఆర్, ఆస్కీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఒక రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దేశ పాలన, న్యాయ రంగాలలో నిష్ణాతులు, మీడియాలో అనుభవజ్ఞులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ప్రామాణికమైన, ఆచరణసాధ్యమైన సూచనల్ని ఈ సమావేశం అందించింది. వీటి ద్వారా కొలీజియంను కొంత మెరుగుపరచవచ్చు. అయితే సమస్య మాత్రం పరిష్కారమవదు. కాబట్టి ఇన్నేళ్లు మౌనం వహించిన ప్రభుత్వం ఇప్పటికైనా విస్తృత రాజ్యాంగ బెంచ్ ద్వారా సుప్రీంకోర్టులో తిరిగి ప్రయత్నం చేయాలి. వ్యవసాయ చట్టాలపై వ్యవహరించినరీతిలో కాకుండా, సంయమనంతో అందరినీ కలుపుకెళ్లి ఎన్‌జేఏసీ సాకారమయ్యేలా కృషి చేయాలి. కూర్చుని ఒక పరిష్కారం సాధించటానికి సుప్రీంకోర్టు, ప్రభుత్వం చొరవ చూపితే ఎన్‌జేఏసీ వేగిరం సాధ్యమవుతుంది.

ఎన్‌జేఏసీ ఏర్పాటుతోపాటు జడ్జీల తీర్పుల్లో నాణ్యత పెంచటానికి జాతీయ జ్యుడీషియల్ సర్వీసు, జడ్జీల జవాబుదారీతనానికి, నేర పరిశోధన, ప్రాసిక్యూషన్‌లో మార్పులు, ప్రొసీజరల్ లా సవరణలు, గ్రామ న్యాయాలయాల చట్టం ద్వారా స్థానిక కోర్టుల ఏర్పాటు కోసం కూడా తగిన చర్యలు వేగంగా తీసుకోవాలి.

**కేశవానంద భారతి కేసు తీర్పు - రాజ్యాంగ మౌలిక స్వరూపం**

రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పార్లమెంటు మార్చటానికి వీల్లేదని 50 ఏళ్ల క్రితం కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఉప రాష్ట్రపతి ఆక్షేపించారు. ఎన్‌జేఏసీని కొట్టివేయటానికి ఈ తీర్పుని సుప్రీంకోర్టు బెంచ్ దుర్వినియోగం చేసిందన్నారు. ఇటీవల రాజస్థాన్‌లో జరిగిన సభాపతుల సమావేశంలో ఉప రాష్ట్రపతితోపాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఈ వాదనకు మద్దతు పలికారు. పార్లమెంటుకున్న చట్టాలు చేసే అధికారాల్లోకి కేశవానంద భారతి కేసు తీర్పు ద్వారా న్యాయవ్యవస్థ చొరబడిందని ఉప రాష్ట్రపతి అన్నారు.

మన దేశం ఉన్న పరిస్థితుల్లో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చటానికి వీల్లేదన్న తీర్పు స్వాగతించదగ్గదే అయినా, ఆ తీర్పుపై విమర్శలను కూడా తోసిపుచ్చలేం. రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని సందర్భానుసారం మారుస్తూ జడ్జీలు తమకు నచ్చిన అంశాలతో నిర్వచిస్తుండటాన్ని ఆమోదించలేం. జేపీ పేర్కొన్నట్లు, రాజ్యాంగాన్ని నిర్వచించటం వేరు, తన వ్యాఖ్యల ద్వారా న్యాయవ్యవస్థ కొత్త రాజ్యాంగాన్ని రాయటం వేరు.

అలాగే ప్రాథమిక హక్కుల్ని తొలగించే, రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం వంటి అంశాలను మార్చే అధికారం పార్లమెంటుకు కూడా లేదు. ఒకవేళ రాజ్యాంగ సభను ఏర్పాటు చేసి కొత్తగా రాజ్యాంగం రాయాలనుకున్నా.. రాజ్యాంగ నిర్మాతల కంటే గొప్ప రాజ్యాంగాన్ని రాయటం, అందరినీ ఒప్పించటం ఈవేళ దేశంలో అసాధ్యం. అంత అవసరం కూడా లేదు. ఇప్పుడున్న రాజ్యాంగం మన దేశానికి అత్యుత్తమంగా సరిపోతుంది. చిన్న చిన్న లోపాలుంటే సరిదిద్దుకోవచ్చు, ఆ వెసులుబాటును కూడా రాజ్యాంగం అందిస్తోంది.

ఈ సందర్భంగా ఓ ఉదంతాన్ని ప్రస్తావించాలి. కొలీజియం ఎంవోపీని మెరుగుపరచటంపై ఆస్కీ, ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాజ్యాంగ మౌలిక నిర్మాణం ప్రస్తావన వచ్చినప్పుడు.. రాజ్యాంగ మౌలిక స్వరూపంపై తీర్పు (కేశవానంద భారతి కేసులో) మంచిదే అయినా, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి నిర్వచనం ప్రామాణికంగా లేదని జేపీ సహా కొందరు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, రాజ్యాంగ రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగంగా ఉండాల్సిన అంశాల ఖరారుకు సంబంధించి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే ఎలా ఉంటుందన్న ప్రతిపాదన వచ్చింది. కానీ ప్రస్తుత మన న్యాయవ్యవస్థ విజ్‌డమ్ రీత్యా ఆ ప్రయత్నం చేస్తే ఇంకా పెద్ద సమస్య రావొచ్చని, తమకు నచ్చిన పదాల్ని సంవిధాన మౌలిక స్వరూపంలో చేరిస్తే, మళ్లీ ఆ తీర్పును మార్చటానికి ఎన్నో ఏళ్లు పట్టొచ్చని కొందరు వారించారు. రాజ్యాంగ మౌలిక స్వరూపంలోని అంశాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించటంపై ప్రస్తుతానికి నిశ్శబ్దం పాటించటం మేలని సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. న్యాయవ్యవస్థ పట్ల ఇలాంటి అభిప్రాయం కలిగి ఉండాల్సిన పరిస్థితుల్ని కాదు మన రాజ్యాంగ నిర్మాతలు ఆశించింది.


రాచరిక, ఫ్యూడల్ ధోరణుల నుంచి బయటపడి దేశం గురించి, దేశ సమస్యల గురించి, యువ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చటం గురించి ఆలోచించటం, ఇందుకోసం తగిన న్యాయ, పాలన, రాజకీయ, ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావటం ఇప్పుడు మనం చేయాల్సిన పని.

✦

# జవాబుదారీతనానికి న్యాయవ్యవస్థా అతీతం కాదు

## -డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

99వ రాజ్యాంగ సవరణపై సుప్రీంకోర్టు తీర్పు మన దేశ వ్యవస్థల మధ్య పరస్పర అపనమ్మకానికి నిలువెత్తు నిదర్శనం. సుప్రీంకోర్టు తీర్పులోని వాదన ప్రజాస్వామ్య ప్రక్రియకి వ్యతిరేకం. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విధానాలను, ప్రమాణాలను కనీసం పరిగణలోకి తీసుకోకుండా ఇచ్చిన తీర్పు న్యాయస్థానం విశ్వసనీయతను, సాధికారతను కూడా దెబ్బతీసింది. అత్యున్నత న్యాయస్థానం వాదనలో మూడు మౌలికమైన సమస్యలు ఉన్నాయి.




మొదటిది, ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రజల నుంచే ఏర్పడాలి. లేకుంటే విశ్వసనీయత, నైతికత ఉండదు. లోక్‌సభ ప్రజల నుంచి నేరుగా ఎన్నికవుతుంటే, రాజ్యసభ రాష్ట్రాల శాసనసభల నుంచి ఎన్నికవుతుంది. చట్టసభల నుంచి ప్రభుత్వం ఎన్నికై ఆ సభకు జవాబుదారీ వహిస్తుంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి చట్టసభల నుంచే ఎన్నికవుతారు. మిగతా అన్ని సంస్థలు కూడా జవాబుదారీతనం గల ప్రభుత్వం నుంచి లేదా ప్రభుత్వం, శాసన వ్యవస్థల ద్వారా చట్టబద్ధ ప్రక్రియతో ఎంపికవుతాయి. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా ప్రక్రియలు ఉంటాయి. ఎన్నికవ్వని వ్యవస్థ ఎంత గొప్పదైనా కావచ్చు, కానీ తన నియామకాలను, వారసుల్ని తానే నిర్ణయించుకునే అధికారాలుండవు. అటువంటి ప్రక్రియకు ప్రజాస్వామిక జవాబుదారీతనం, ప్రజల ప్రత్యక్ష లేదా పరోక్ష ఆమోద ముద్ర ఉండదు.

న్యాయ వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి అంటే, పదవుల్లో ఉన్న జడ్జీలే కొత్త జడ్జీల నియామకాలను చేసేసుకోవటం అని మనం అంగీకరిస్తే, ఇక స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషనర్లు, పబ్లిక్ సర్వీసు కమిషన్లు, కాగ్ (సీఏజీ), సీవీసీ, లోక్‌పాల్, లోకాయుక్తలు, సీబీఐ అధికారులు తమ సహచరుల్ని, వారసుల్ని తామే నియమించేసుకునేలా అధికారాల్ని అప్పగించే వ్యవస్థను ఇక మనం ఏర్పరుచుకోవాలన్న మాట! అటువంటి వ్యవస్థ స్వయంభులుగా సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకునే ఫ్యూడల్ కూటమి, పీఠాధిపతుల వ్యవస్థలాగా ఉంటుంది. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకి, పార్లమెంటు సార్వభౌమాధికారానికి మధ్య ఘర్షణ తలెత్తకూడదు. ప్రజాస్వామ్య ప్రక్రియతో, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దైవాంశసంభూత అధికారాలు తమకున్నాయని ఏ విభాగం లేదా సంస్థయినా భావించటం మన ప్రజాస్వామ్య భవిష్యత్తుకి ప్రమాదకర ఘంటిక.

రెండోది, న్యాయవ్యవస్థ తనను తానే నియమించుకోవటమనేది ప్రపంచంలోని ఏ క్రియాశీల ప్రజాస్వామ్యంలోనూ లేదు. ఇంగ్లండ్, వేల్స్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రజలు (పారదర్శక బహిరంగ పోటీ, జ్యుడీషియల్ కౌన్సిల్ ద్వారా సమాజం నుంచి ఈ సభ్యుల్ని కమిటీలోకి ఎంపిక చేస్తారు) నియామకాలను సిఫార్సు చేస్తారు. ప్రభుత్వం (క్రౌన్) ఆ సిఫార్సును ఒకసారి తిరస్కరించగలదు. ఐర్లాండ్‌లో ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయేతర రంగాల సభ్యులతో కూడిన 10మంది సభ్యుల కమిటీ (న్యాయశాఖా మంత్రి నియమిస్తారు) సిఫార్సుల్ని చేస్తుంది. ఫ్రాన్స్‌లో అధ్యక్షుడు, న్యాయశాఖా మంత్రి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, ప్రాసిక్యూటర్లు, ముగ్గురు సాధారణ పౌరుల (కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థ- మూడూ ఎంపిక చేస్తాయి) తో కూడిన 12మంది సభ్యుల కమిటీ అధ్యక్షుడికి సిఫార్సులు చేస్తుంది. అయితే వీటికి అధ్యక్షుడు కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. కెనడాలో న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, సాధారణ పౌరులతో కూడిన 8మంది సభ్యుల బృందం విధిగా అమలుచేయనక్కర్లేని సిఫార్సుల్ని చేస్తుంది. ఆస్ట్రేలియాలో నియామకాలను కార్యనిర్వాహక వ్యవస్థే చేస్తుంది. జర్మనీలో రాష్ట్రాల న్యాయశాఖ మంత్రులు, ఫెడరల్ (జాతీయ) సభ నియమించిన వారితో కూడిన 32 మంది సభ్యుల కమిటీ విధిగా అమలుచేయనక్కర్లేని సిఫార్సుల్ని చేస్తుంది.

అమెరికాలో సెనేట్ సలహా, ఆమోదంతో అధ్యక్షుడు నియామకాలు చేస్తారు. దక్షిణాఫ్రికా, డెన్మార్క్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర ప్రజాస్వామిక దేశాలలో ఇదే తరహాలో కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల్ని, న్యాయమూర్తుల్ని, బార్ సభ్యుల్ని, సాధారణ పౌరుల్ని ఎంపిక ప్రక్రియలో భాగస్వాముల్ని చేసే పద్ధతులున్నాయి. ఫలానా జడ్జీలనే నియమించాలంటూ తప్పనిసరిగా ఆమోదించాల్సిన సిఫార్సుల్ని కొలీజియం జడ్జీలే చేసే మనదేశ విధానం ప్రజాస్వామ్య ప్రపంచంలోనే

న్యాయనియామకాలలో ఎక్కడాలేని పెడధోరణి. 1993 నుంచి భారత్‌లో ఈ కొలీజియం విధానాన్ని ఏకపక్షంగా కొనసాగిస్తున్నారు. జడ్జీల నియామకం కేవలం జడ్జీలకే వదిలేసేటంత సాదాసీదా విషయం కాదనేది ప్రపంచమంతా అంగీకరించిన విషయం.

మూడవది, ప్రజాప్రయోజనాల రీత్యా, ఉన్నత న్యాయవ్యవస్థ విశ్వసనీయతను పరిరక్షించటం అవసరం. ముఖ్యంగా, కులం, మతం, ప్రాంతం, భాష వంటి అంశాల చుట్టూ ఆటవిక భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజలను చీల్చే మన సమాజంలో ఈ అవసరం మరీ ఎక్కువ. విద్య, ప్రభుత్వోద్యోగాలలో రిజర్వేషన్లకు అనుకూలంగా, వ్యతిరేకంగా తరచూ జరిగే ఆందోళనలు, బాబ్రీ మసీదు-రామ జన్మభూమి వివాదం వంటి భావోద్వేగ అంశాలు, నదీజలాల పంపకాలు, తీవ్ర ఘర్షణకారకాలైన ఇతర వివాదాలను భారత్ వంటి సంక్లిష్ట భిన్నత్వ సమాజంలో పార్టీ రాజకీయాలకు అతీతంగా తర్కం, రాజ్యాంగం, చట్టం ప్రాతిపదికన లోతైన పరిశీలనతో పరిష్కరించాల్సిన అవసరముంది. విశ్వసనీయత ఉండి ప్రజల గౌరవాన్ని పొందే సుప్రీంకోర్టు మాత్రమే రాజ్యాంగాన్ని, దేశాన్ని అటువంటి పరిస్థితుల నుంచి రక్షించి, న్యాయం, రాజ్యాంగం, చట్టం, సామరస్యం, ప్రజాప్రయోజనాలను ప్రభావశీలంగా సమన్వయం చేయగలుగుతుంది. రాజ్యాంగం ఇవ్వని అధికారాలని కూడా కైవశం చేసుకోవటం ద్వారా కోర్టు విశ్వసనీయతను కోల్పోతే, అది న్యాయస్థానాన్నే కాకుండా రాజ్యాంగాన్ని, మన ప్రజాస్వామ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది.

ఈ కారణాలతోనే, ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం (ఎఫ్‌డీఆర్) మనదేశంలోనే అత్యంత సామర్థ్యం, విశ్వసనీయతకు పేరొందిన న్యాయకోవిదులు - సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, (దివంగత) జస్టిస్ జేఎస్ వర్మ, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి (దివంగత) జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్‌లను ఒకచోట చేర్చింది. గత నాలుగు దశాబ్దాల కాలంలో అత్యుత్తమ న్యాయమూర్తులు వీరు. వీరి నిజాయతీని, స్వతంత్ర ప్రతిపత్తిని ఎవరూ ప్రశ్నించలేరు. ఈ విశిష్ట న్యాయకోవిదులు న్యాయనియామకాల అంశాన్ని జాగ్రత్తగా, నిశితంగా పరిశీలించి పలు దఫాల చర్చల అనంతరం ఉన్నత న్యాయనియామకాలను సిఫార్సు చేయటానికి జాతీయ జ్యుడీషియల్ కమిషన్ (ఎన్‌జేసీ)ని సిఫార్సు చేశారు. ఈ కృషికి సంబంధించి వివరాలను ప్రతి దశలోనూ ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు ఎఫ్‌డీఆర్ తెలియజేస్తూ వచ్చింది. ఈ అంశంపైన పరిశోధనా పత్రాలను, ముగ్గురు సుప్రసిద్ధ న్యాయకోవిదుల అభిప్రాయాలనూ రాజకీయ వ్యవస్థకు అందించింది. ఆ ఎన్‌జేసీకి మెరుగులు దిద్ది రూపొందించిందే ఎన్‌జేఏసీ.

ఎన్‌జేఏసీ కేసులో సుప్రీంకోర్టు జడ్జీల నియామకాన్ని పరిశీలిస్తున్నప్పుడు, కోర్టు న్యాయ నియంత్రణ పాటించి, ప్రపంచవ్యాప్తంగా పాటిస్తున్న అత్యుత్తమ పద్ధతుల్ని, ప్రజాస్వామిక సూత్రాలను పరిశీలించాల్సింది. పార్లమెంటుకి, సుప్రీంకోర్టుకి మధ్య ప్రత్యక్ష యుద్ధంలాంటి ప్రతిష్ఠంభన పూర్తిగా నిరోధించటం అవసరం. అందునా న్యాయమూర్తులకి రాజ్యాంగం ఇవ్వని అధికారాల్ని గూర్చిన విచారణలో న్యాయస్థానం నియంత్రణకపాటించి ఉండాల్సిన సందర్భం. కోర్టు అటువంటి నియంత్రణను పాటించటంలో విఫలమైంది కాబట్టి, మనకు ఇప్పుడు రాజ్యాంగ ప్రతిష్ఠంభన ఏర్పడకుండా సంయమనంతో, దూరదృష్టితో వ్యవహరించటం అవసరం.

ఇలాంటి పరిస్థితి తలెత్తవచ్చనే ఆందోళనతోనే ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా పార్టీలకతీతంగా, నిష్పాక్షికత, పరిణతితో రాజ్యాంగబద్ధంగా స్పందించాలని పార్లమెంటరీ నాయకులకు, ఎంపీలకు లేఖ రాసింది. ఎన్‌జేఏసీకి మద్దతు కొనసాగిస్తామని సెప్టెంబర్ 23, 2015న సోనియా గాంధీ సమాధానం పంపారు. పార్టీలకు, చౌకబారు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అంశమిది. మీడియా, పౌరసమాజ నేతలు, పౌర పెద్దలు కలసికట్టుగా ఈ అంశాన్ని ప్రజాస్వామిక సూత్రాలు, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి, రాజకీయ ఏకాభిప్రాయానికి అనుగుణంగా శాంతియుతంగా పరిష్కరించేందుకు ముందుకు రావాలి. న్యాయ నియామకాలకు మరో పద్ధతిని రూపొందించాలని పార్లమెంటు భావిస్తే, పార్టీ రాజకీయాలకు అతీతంగా సమష్టిగా అందుకు చర్యలు తీసుకోవాలి. ఎన్‌జేఏసీకి సంబంధించి విమర్శకులు లేవనెత్తిన అంశాల్ని అటువంటి కొత్త నమూనాలో పరిగణలోకి తీసుకోవాలి. పార్లమెంటులో ఏకాభిప్రాయం సాధ్యంకానప్పుడు, కొలీజియంపై కోర్టులో వాదనలు వినిపించే సందర్భాన్నే సంస్కరణకు అవకాశంగా ఉపయోగించుకోవాలి. కనీసంలో కనీసంగా, ఇప్పుడున్న అనధికార, రహస్య పద్ధతిని మార్చి క్రోడీకరించిన పారదర్శక పద్ధతిని ఆ స్థానంలో తీసుకురావాలి. అర్హులైన పేర్లను సూచించేందుకు ఒక సెర్చ్ కమిటీని కూడా ఏర్పాటుచేయవచ్చు. మెజారిటీ అభిప్రాయం కన్నా ఏకాభిప్రాయ సూత్రాన్ని అనుసరించాలి. నిజాయతీ, సమర్థత, నిష్పాక్షికతకు సంబంధించి ప్రామాణికత గల అనుమానాల్ని సభ్యుల్లో ఎవరైనా లేదా ప్రభుత్వం లిఖితపూర్వక అభ్యంతరంగా లేవనెత్తితే, అటువంటి వ్యక్తి పేరును నియామకానికి పరిగణలోకి తీసుకోకూడదు.

సుప్రీంకోర్టు కూడా తన పనితీరులోని ఇతర అంశాలను సంస్కరించుకోవాలి. ఆర్టికల్ 136 కింద అన్ని రకాల దరఖాస్తులనూ అనుమతిస్తూ న్యాయస్థానం ట్రయల్ కోర్టులాగా పనిచేస్తోందని పలువురు నిష్ణాతులైన న్యాయకోవిదులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ కారణంగానే, కోర్టులో నియామకాలు 7 నుంచి 28కి పెరిగి న్యాయ ప్రామాణికతను నీరుగార్చాయి. సుప్రీంకోర్టు ఫెడరల్ కోర్టుకు కొనసాగింపు. కేంద్రం-రాష్ట్రాల మధ్య, అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించటం ఈ కోర్టు ప్రధాన బాధ్యత. కానీ అలాంటి కేసులు కొన్ని దశాబ్దాలుగా అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. లెక్కలేనన్ని ఇద్దరు జడ్జీల బెంచీలు కోకొల్లలుగా కేసులను విచారిస్తూ రాజ్యాంగానికి భాష్యం చెబుతూండటం పరస్పర విరుద్ధ

రూలింగ్‌లకు, అరాచక గందరగోళానికి దారితీస్తోంది. అత్యంత సీనియర్లతో ఐదు లేదా ఏడుగురు జడ్జీల శాశ్వత రాజ్యాంగ బెంచ్‌ని ఏర్పాటు చేయాల్సిన సమయమిది.

రాజకీయాల్ని ప్రక్షాళన చేసి ప్రజాస్వామిక వ్యవస్థల విశ్వసనీయతను పెంపొందించాల్సిన ఆవశ్యకత సుప్రీంకోర్టు తీర్పుతో ప్రస్ఫుటమైంది. మనందరం రాజకీయ నాయకులను ద్వేషించటానికి ఉత్సాహపడతాం. మన ఎన్నికల విధానం, పాలన తీవ్ర లోపభూయిష్టమైనవి. ప్రజాస్వామిక వ్యవస్థల విలువను కాలరాశాయవి. కానీ భ్రష్టుపట్టిన రాజకీయాలకు సమాధానం దైవదూతల వ్యవస్థో, ఫ్యూడల్ వంశపారంపర్య వ్యవస్థో కాదు, రాజకీయ సంస్కరణలే. రాజకీయ పార్టీలు, ఎన్నికైన చట్టసభ సభ్యులు తమ విధానాలు, విశ్వాసాలు, ప్రజాప్రయోజనాలతో సంబంధం లేకుండా అధికారాన్ని దుర్వినియోగం చేయటం, ఒకరినొకరు అత్యంత బాధ్యతారహితంగా వ్యతిరేకిస్తుండటంతోనే ప్రజల్లో రాజకీయాల పట్ల తిరస్కారం పెరిగిపోయింది. ఈ వాతావరణం రాజకీయాల పట్ల చిన్నచూపునకు, ఎన్నికలతో సంబంధం లేని ఇతర వ్యవస్థలు, వ్యక్తుల మీద మితిమీరి ఆధారపడటానికి దారితీసింది. కానీ దురదృష్టవశాత్తూ, ప్రజాస్వామ్యంలో ఎన్నికైన వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేదు. రాజ్యాంగబద్ధతను తిరస్కరించి, ప్రజాస్వామిక ప్రక్రియను లెక్కచేయకుండా ఉంటే చివరికి అది అరాచకానికి, నియంతృత్వానికి దారితీస్తుంది. రాజ్యవ్యవస్థలోని అన్ని విభాగాలనూ సునిశితంగా, హేతుబద్ధంగా సంస్కరించాల్సుంది. 'ఇతర విభాగాలకు సంస్కరణలు, మాకు మాత్రం యధాస్థితి' అంటే కుదరదు. మన రాజకీయాలను, పాలనను, అన్ని రాజ్యవ్యవస్థలనూ ప్రక్షాళన చేసుకోవాల్సిన సమయమిది.

**(2015 అక్టోబర్‌లో ఎన్‌జేఏసీ రాజ్యాంగ సవరణను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన సమయంలో జేపీ రాసిన వ్యాసం ఇది. ఇటీవలికాలంలో కొలీజియం వర్సెస్ ఎన్‌జేఏసీ పరిణామాల నేపథ్యంలో జేపీ అభిప్రాయాలను "JP Loksatta " యూట్యూబ్ ఛానల్‌లో చూడండి)**

# గవర్నర్ ప్రసంగాన్ని ఆక్షేపించిన లోక్‌సత్తా

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ మాట్లాడుతూ 43 నెలల్లోనే వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం తెచ్చామని చెప్పటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, సర్పంచ్‌ల వ్యవస్థని అవమానించటమని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రాష్ట్రంలో స్థానిక ప్రభుత్వాలను డమ్మీలుగా, సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా చేస్తూ పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంటే ప్రశ్నించకుండా, వలంటీర్లతో గ్రామ స్వరాజ్యం తెస్తామనటం విచిత్రమన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని లోక్‌సత్తా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలోని పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం డమ్మీలుగా మార్చిందని, ఈ పరిణామాలపై యూనియన్ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలు, జిల్లా పరిషత్‌ల నిధులను నవరత్న పథకాలకు మళ్లిస్తున్నారన్నారు. యూనియన్ ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖాళీ చేస్తుండటంతో సర్పంచ్‌లు ప్రజలకు కనిపించకుండా తిరుగుతున్నారన్నారు. రోజువారీ సేవలు అధ్వాన్నంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అలుపెరగకుండా పోరాడుతున్నారని, ప్రభుత్వం కాస్త తెలివి తెచ్చుకుని స్థానిక ప్రభుత్వాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో లోక్‌సత్తా




ఉద్యమ సంస్థ నేత నాయుడు వేణుగోపాల్, దండా గణేష్ పాల్గొన్నారు.

**ఘనంగా గణతంత్ర దినోత్సవం**

దేశ గణతంత్ర ఉత్సవాన్ని విజయనగరంలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగాన్ని సక్రమంగా అమలు చేయకపోవటమే దేశంలోని అనేక సమస్యలకు కారణమని, ప్రజల్లోనూ రాజ్యాంగం పట్ల చైతన్యం పెరగాలని బాబ్జీ అన్నారు. పార్టీ నాయకులు అల్లంశెట్టి నాగభూషణం, పి.ఎల్.ఎన్ రాజు, పొలుపర్తి అప్పారావు, రాజారావు, సిమ్మ శ్రీను, రమేష్, చంద్రరావు, ఆదేశ్వరావు, రఘు, మహిళా సంఘాల ప్రతినిధి ప్రవల్లిక, డాక్టర్ బాల భార్గవి, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి గోపి తదితరులు హాజరయ్యారు.

# అప్పులతో ఉచితాలు - భావితరాలు

భారత్ అభివృద్ధి చెందిన దేశం కావటానికి వచ్చే పాతికేళ్లు గొప్ప అవకాశమని, ఇందులో ఆర్థిక వృద్ధిని సాధించటం ఎంతో కీలకమైన అంశమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తాత్కాలిక పథకాలు, జీతాలు, వడ్డీలు వంటి రోజువారీ ఖర్చులకు కూడా ప్రభుత్వాలు అప్పులు చేస్తుంటే అభివృద్ధికి అది తీవ్ర విఘాతమవుతుందన్నారు. రోజువారీ అవసరాలకు కూడా అప్పులు చేసే కుటుంబాలు ఎలాగైతే పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడతాయో, అలాగే అలాంటి ప్రభుత్వాలు కూడా భవిష్యత్ తరాల జీవితాల్ని దెబ్బతీస్తాయన్నారు. ఈవేళ్టి తమ అవసరాల కోసం రేపటి తరాన్ని నిర్లక్ష్యం చేసే తల్లిదండ్రులు మన దేశంలో ఏ కులంలో, మతంలో, ప్రాంతంలో ఉండరని, అలా ఎవరైనా ఉంటే వారిని సమాజం తిట్టిపోస్తుందని.. కానీ ఈవేళ మన



ప్రభుత్వాలు అదే రకమైన బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తుంటే మనం గుర్తించటం లేదన్నారు. భారతీయ సంప్రదాయానికి విరుద్ధంగా, బిడ్డల భవిష్యత్తుతో చెలగాటమాడే అధికారం ప్రభుత్వాలకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఆర్థిక వృద్ధే లేకపోతే సుపరిపాలన, అమృతకాలం వంటి వాటి గురించి మాట్లాడుకోవటమే అనవసరమన్నారు. భారత్ వంటి పేద దేశంలో కొంతమేర ప్రజలకు సాయమందించే పథకాలు అవసరమని, అయితే వాటి కోసం అప్పులు చేస్తుంటే, అప్పులు తెచ్చిన డబ్బును ఆస్తులు పెంచటానికి వినియోగించకుంటే, ఓట్ల వేటలో పోటాపోటీగా ఉచితాల్ని, తాత్కాలిక పథకాల్ని అమలు చేస్తుంటే దివాలా తథ్యమన్నారు. ఈవేళ దేశంలోని పలు రాష్ట్రాలు ఆ రకంగా అప్పుల్లో కూరుకుపోయాయని, శ్రీలంక తరహాలో ప్రమాదకర బాటలో ప్రయాణిస్తున్నాయని అన్నారు. భారతదేశంలో రాష్ట్రాలు అమెరికా తరహాలోనివి కావని, రాష్ట్రాలు దివాలా తీస్తే మొత్తం దేశం దివాలా తీస్తుందని అన్నారు. కాబట్టి యూనియన్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ బాధ్యతను నెరవేర్చాలని, రోజువారీ ఖర్చులకు ప్రభుత్వాలు అప్పులు చేయకుండా, ఉచితాలు–అభివృద్ధి మధ్య సమతూకం ఉండేలా, స్వతంత్ర



ప్రతిపత్తిగల సంస్థ ఈ మొత్తాన్నీ పర్యవేక్షించేలా పటిష్ఠ చట్టబద్ధ ఏర్పాటు చేయాలని, ఈ ఏర్పాటు రాష్ట్రాలకే కాకుండా యూనియన్ ప్రభుత్వానికి కూడా వర్తించాలని అన్నారు. ఇందుకు సంబంధించి ఇటీవల ఒక ఛానల్‌కి జేపీ ఇచ్చిన ఇంటర్వ్యూలోని కొన్ని అంశాలు..

**ప్రశ్న: తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. ఎందుకీ పరిస్థితి ఉంది. కేవలం ఉచితాల వల్లా? అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ పరిస్థితి తలెత్తిందా?**

**జేపీ:** ఒక కుటుంబం అయినా ఒక దేశం అయినా ఒకటే సూత్రం. ఎవరు బాగా ధనికుడు అంటే.. వంద రూపాయలు ఆదాయం వస్తే తొంభై ఖర్చు పెట్టి పది రూపాయలు ఆదా చేసేవాడు! వెయ్యి రూపాయలు ఆదాయం వస్తే పదకొండు వందలు ఖర్చు పెట్టి అప్పులు చేసేవాడు బీదవాడు. ఇది వ్యక్తికీ వర్తిస్తుంది.. జాతికీ వర్తిస్తుంది.

పాత కథ ఒకటి చెబుతాను.

రెండు బర్రెలు ఉన్న అమ్మ దగ్గర నాలుగు బర్రెలు ఉన్న తల్లి అప్పు చేసిందంట. కొంతకాలం తర్వాత.. నాకు నాలుగు బర్రెలు ఉన్నాయి, నీ వద్ద రెండే ఉన్నాయి, నేను నీ దగ్గర అప్పు చేయటం ఏంటని బుకాయించిందంట. ఈ తగవు రాజుగారి దగ్గరకు వెళ్లింది. అప్పుడు రాజుగారు ఇద్దర్నీ బురదలో నడవమన్నారంట. తర్వాత చెరో చెంబుడు నీళ్లు ఇచ్చి కాళ్లు కడుక్కోమని చెప్పారంట. ఆ చెంబుడు నీళ్లను రెండు బర్రెలు ఉన్న మహిళ జాగ్రత్తగా వాడుకుంటూ కాళ్లకు అంటుకున్న బురదను కడుక్కుంది. రెండో మహిళ ఒక్కసారిగా చెంబుడు నీళ్లూ కాళ్ల మీద పోసుకుంది. కాళ్లకు ఉన్న అడుసు మాత్రం పోలేదు. రాజుగారికి వెంటనే అర్థమైంది. రెండు బర్రెలు ఉన్నా కూడా పొదుపరితనం, జాగ్రత్త, ముందుచూపు ఉన్నాయి కాబట్టి ఈమె అప్పు ఇచ్చిందని రాజుగారు గ్రహించారు.. ఈ కథ చిన్నప్పుడు నేర్చుకున్నాం. మూడో తరగతి పాఠం. కానీ మనల్ని పాలించేవాళ్లు, మనకు మార్గం చూపేవాళ్లు, అధికారంలో ఉన్నవాళ్లు ఇది మర్చిపోయారు. ప్రభుత్వం ఏం చేయాలనే విషయాన్ని పట్టించుకోవటం లేదు.

మౌలిక సదుపాయాలు, చట్టబద్ధపాలన, మంచినీళ్లు, మురుగునీటి పారుదల వంటి జీవన

అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. మంచి ప్రమాణాల ఆరోగ్యం, విద్య అందించాలి. అవి పక్కన పెట్టేసి తాత్కాలికంగా ఓట్లు ఆకర్షించేందుకు డబ్బులు ఖర్చు పెడుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ దీనికి గొప్ప ఉదాహరణ. ఒక కుటుంబానికి సంక్షేమ పథకం కింద రూ.10 లక్షలు ఇవ్వటం ప్రపంచ చరిత్రలో ఇంతవరకూ జరగలేదు. అమెరికా కాస్తో కూస్తో మనకన్నా డబ్బు ఉన్న దేశమే కదా! అమెరికాలో కొవిడ్ నేపథ్యంలో మొదట 1400 డాలర్లు ఇచ్చారు.. 600 డాలర్లు కొత్త అధ్యక్షుడు వచ్చాక ఇచ్చారు. మొత్తం 2,000 డాలర్లు. చరిత్రలో ఇంత డబ్బు ఎప్పుడూ ఇవ్వలేదన్నారు. మన దేశంలో తలసరి ఆదాయం రూ.1,40,000 ఉంది. తెలంగాణ తలసరి ఆదాయం రూ.2,75,000 అనుకుందాం. అమెరికా తలసరి ఆదాయంతో పోలిస్తే 30వ వంతు, అంటే తొమ్మిది వేల రూపాయలు రావాలి. అదెక్కడ, రూ.10 లక్షలు ఎక్కడ?.. ఇదొక ఉదాహరణ మాత్రమే. అంటే తాత్కాలికమైన తాయిలాలే పరిపాలన అనే స్థాయికి తీసుకెళ్లారు. దీర్ఘకాలంగా ప్రజల జీవితాల్ని బాగుచేయటం, విద్య, ఆరోగ్యాన్ని ఇవ్వటం, ఆదాయాలు పెంచటం, ఉపాధి కల్పించటం, బీదరికాన్ని తొలగించటం మన లక్ష్యం కాకుండా పోయింది.

వంద రూపాయలకు అయ్యే పనులు వంద రూపాయలకు కావాలి. వీలుంటే తొంభై రూపాయలకు కావాలి. తక్కువ డబ్బుతో ఎక్కువ ఫలితం రావాలి. కానీ మనం చాలా ఎక్కువ డబ్బుతో కొద్దిపాటి ఫలితాలు చూపించటంలో ఆరితేరాం. అవినీతి కారణంగానో, అసమర్థత కారణంగానో, నిర్లక్ష్యం కారణంగా గానీ రూ.10ల పనికి రూ.100 ఖర్చు పెడితే చివరికి ఏమవుతుంది?.. ఒక కుటుంబం లాగా దేశం కూడా దివాలా తీస్తుంది. మన దగ్గర జరుగుతున్నది అదే. కొత్త విషయం ఏమీ లేదు.

**సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం అప్పుల పాలైపోతోందని చెప్పటానికి ఏ నాయకుడూ సాహసించటం లేదు. అధికారులు కూడా పాలకులు ఏం చెబితే అది చెయ్యటం పరిపాటి అయిపోయింది. దీనిపై మీ స్పందన?**

**జేపీ:** సంక్షేమం వద్దని నేను అనటం లేదు. డబ్బున్న దేశాల్లో కూడా ఈ సమస్య ఉంది. మనది బీద దేశం కాబట్టి ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి సంక్షేమం వద్దని ఎవరూ అనరు. ఎన్.టి రామారావు గారు ఎప్పుడూ అనేవారు 'ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టకపోతే ఏం పరిపాలన?' అని.

కచ్చితంగా ఆకలితో ఉన్న మనిషికి ఆ క్షణం అన్నం పెట్టాలి. కానీ నేను చెప్పేది.. మౌలికంగా ప్రభుత్వం ఎందుకు ఉందో మీరు అర్థం చేసుకోండి.

ఈ ప్రజలు, సమాజం ఉమ్మడిగా ప్రభుత్వం అనే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానమంత్రిగా, ముఖ్యమంత్రులుగా దేవుడు పంపిస్తే వచ్చినవాళ్లు కాదు మీరు. కృత్రిమంగా మానవ సమాజం ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది. ఆ ప్రభుత్వం నడపటం కోసం రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకుని మిమ్మల్ని అక్కడ పెట్టుకున్నాం. మిమ్మల్ని మేం జీతాలు ఇచ్చి పోషిస్తున్నాం, మేం ఓట్లేసి మిమ్మల్ని అక్కడ కూర్చోబెట్టాం.. మీరు ఈ విషయం మర్చిపోకండి. ఎందుకు? మేం సొంతంగా చేసుకోలేని ఉమ్మడి ప్రయోజనాలను నెరవేర్చడం కోసం! మాలో ఎంత గొప్పవాళ్లు ఉన్నా, ఎంత డబ్బు గలవాళ్లు ఉన్నా, సొంతంగా అన్నీ చేసుకోలేరు కాబట్టి, కొన్ని ఉమ్మడిగా మాత్రమే సాధ్యం. ఉమ్మడిగా ఉన్న పనులు చేయండి, ప్రభుత్వం ఎందుకో గుర్తించండి. కానీ ప్రభుత్వం తన బాధ్యతగా నెరవేర్చాల్సిన రంగాల్లో పరిస్థితి ఎలా ఉంది?.. కోర్టులకు పోతే సత్వర న్యాయం జరగదు. జనమంతా కూడా విసిగిపోయి ఆడపిల్ల మీద అత్యాచారం జరిగితే చంపేయండి, కాల్చేయండి అంటున్నారు. జనం చెడ్డవాళ్లు కాబట్టి కాదు. శాంతిభద్రతలను కాపాడటం, న్యాయం అందరికీ సమానంగా, వేగంగా అందేలా ఏర్పాటు చేయటం వంటివి ప్రభుత్వాల మొట్టమొదటి బాధ్యత. ఈ పనులు చేయకపోతే ప్రభుత్వం అనవసరం. మౌలిక సదుపాయాలు ఈమధ్య కొన్ని బాగుపడుతున్నాయి. కానీ ఇప్పటికీ మంచినీళ్లు దొరకటం చాలా కష్టంగా ఉంది. హైదరాబాద్‌లో ఎంతమందికి మంచినీళ్లు అందుతున్నాయి? మురుగునీటి పారుదల ఉందా? నూటికి 28 టాయిలెట్లకే సివరేజి సదుపాయం ఉంది. గట్టిగా వర్షం కురిస్తే వరదలు వస్తున్నాయి. ఇవన్నీ ఏంటి? ప్రభుత్వాల వైఫల్యాలు కాదా? విద్య పరమ అధ్వాన్నంగా ఉంది. 14-18 ఏళ్ల వయసు మధ్య పిల్లల్లో తెలంగాణలో గడియారం చూసి టైమ్ చెప్పటం నూటికి 50 మందికి తెలియదు. ఇదేం చదువు! మీరు విద్యకు అధికంగా ఖర్చు చేస్తున్నామని చెబుతున్నారు. కేజీ టూ పీజీ అంటున్నారు. మాటలు బాగున్నాయి. బిల్డింగ్‌లకు, జీతాలకు ఖర్చు పెడుతున్నారు. చివరికి కావాల్సింది ఏంటి? పిల్లలకు చదువు అబ్బటం కదా! ఎలాగైతే దేశ రక్షణకు పెట్టే ఖర్చు వల్ల రక్షణ కావాలనుకుంటున్నామో.. విద్యకు పెట్టే ఖర్చు వల్ల పిల్లలకు విద్య అబ్బాలి కదా! నూటికి 50 మందికి గడియారం చూసి టైమ్ చెప్పటం చేతకాకపోతే, మార్కెట్‌లో కూరగాయలు కొని తూకం వేయించటం చేతకాకపోతే ఏం చదువు పట్టుబడుతుంది? ప్రభుత్వం ఏం చేస్తుందంట? ఆరోగ్య రంగం గురించి చెప్పనక్కర్లేదు. మన దేశంలో ఐదున్నర కోట్ల మంది ప్రతి ఏడాదీ అనారోగ్యం వల్ల బీదలవుతున్నారు. ఇవి ప్రభుత్వం చేయాల్సిన పనులు. అవి విస్మరించి.. ఎవరు చేయమన్నారు? అవి చేస్తూ దీన్ని కూడా చేయండి. సమన్వయం చేయండి. సమతూకం పాటించండి. ఇవన్నీ పక్కన పెట్టేసి లేదా చేస్తున్నట్టు నటించి లేదా ఖర్చు చేసినా ఫలితం రాకుండా పిచ్చిపిచ్చిగా చేసి తాత్కాలిక తాయిలాలు మాత్రం అద్భుతంగా ప్రతీ ఇంటికి అందిస్తుంది.

**ప్రజలు అడుగుతుండబట్టే కదా తాయిలాల్ని ఇస్తున్నది?**

**జేపీ:** ప్రజలు వాటిని కోరుకోవటం లేదు. తాత్కాలికంగా డబ్బు ఇస్తే నేను కాదంటానా? పన్నులు ఇంత కడుతున్నారు

కదా? నాకు 10 వేలో, 20 వేలో వస్తే నేను కూడా తీసుకుంటాను. దాన్ని ఆసరాగా చూపించి జనాల్ని మీరు విలన్లుగా చిత్రీకరించటం తప్పు. జనం ఇది కోరటం లేదు. జనం తమకు నిజంగా ఏది అవసరమో అది కోరుతున్నారు. కానీ అది మీరు ఇస్తారనే నమ్మకం పోయింది. మీ నిర్వాకం వల్ల అవి అందుతాయన్న నమ్మకం పోయింది. కాబట్టి చచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నం అన్నట్టు కావాల్సింది జరుగుతుందో లేదో తెలియదు, ఇది గ్యారంటీగా వస్తుంది కదా.. బ్యాంకులో పడుతోంది కదా.. నా చేతిలోకి వస్తుంది కదా.. అని జనం ఒప్పుకుంటున్నారు. అంతేగానీ జనం దీనికోసం ఆరాటపడటం లేదు. ఆత్మగౌరవం ఉన్నవాళ్లు ఈ దేశ ప్రజలు. భారతీయ సంప్రదాయంలో ఏనాడూ కూడా ప్రజలు బిచ్చగాళ్లు కాదు. భిక్షాటన వృత్తిగా కొంతమంది ఉండేవాళ్లు. అది వేరు. కానీ ప్రజలు తినటానికి తిండి లేకపోయినా కూడా గుంభనంగా ఉండటం మనకు అలవాటు. మంచినీళ్లు తాగి పడుకోవటం అలవాటు. పిల్లలు ఆకలితో నకనకలాడుతుంటే తమ ఆకలిని చంపుకుని పిల్లలకు తిండి పెట్టటం తల్లిదండ్రులకు అలవాటు. ఇది మన సంప్రదాయం. మన బిడ్డల కోసం బతకటం మన అలవాటు. ఆత్మగౌరవంతో బతకటం మన అలవాటు. అలాంటి సమాజాన్ని భీరువులుగా మార్చింది ఈ రాజకీయం. ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు. మీరు చేస్తుందంతా కూడా.. పిల్లల భవిష్యత్తుని తాకట్టు పెట్టి ఇవాళ మీ రాజకీయ ప్రాబల్యం కోసమో, తాత్కాలిక తాయిలాల కోసమో ప్రజల్ని, సమాజాన్ని ఏమారుస్తున్నారు. ఎవరికి నష్టం?.. పిల్లలకి నష్టం.

మన ప్రతీ కుటుంబం కులం, మతం, ప్రాంతం, వర్గంతో సంబంధం లేకుండా అందరూ బతికేది పిల్లల కోసం. అవసరమైతే ప్రాణం ఇవ్వటానికి సిద్ధపడతారు. అలాంటి సమాజంలో పిల్లల భవిష్యత్తును విస్మరించి, రేపటి సమాజాన్ని విస్మరించి ఇవాళ మొత్తం మీ అధికారం కోసం తాకట్టు పెట్టమని ఎవరు చెప్పారు? అప్పులు ఇలా ధారాళంగా చేయమని ఎవరు చెప్పారు?

అప్పు చేస్తే అప్పు వల్ల ఎక్కువ లాభం రావాలి. ఇవాళ్టి సాదర ఖర్చుల కోసం అప్పులు చేసి ఈ భారం అంతా పిల్లల మీద నెడితే పిల్లలు ఏమవుతారు? మన తరం పెట్టిన ఖర్చులకు పిల్లలు బాధ్యత తీసుకోవాలా? ఏ తల్లిదండ్రులూ అలా చేయరే! బాధ్యత గల తల్లిదండ్రులు చేస్తారా? ఓ తల్లో లేదా తండ్రో అప్పులు చేసి ఆ భారం పిల్లల మీద వదిలేస్తే వారి గురించి మనం ఏం అనుకుంటాం? మనం పుట్టిన నాటి కంటే పోయిన నాటికి పిల్లల భవిష్యత్తు బాగుండాలి, ఆస్తులు పెరగాలి. దాని కోసం తాపత్రయ పడుతున్నాం. మన ప్రభుత్వం ఆ విషయం మర్చిపోయింది. సంక్షేమం వద్దని ఎవరూ అనరు. అందులోనూ బీదదేశంలో సంక్షేమం లేకుండా సమాజాన్ని కలపడం సాధ్యం కాదు. కానీ ఒక సమతూకాన్ని పాటించాలి. వైఎస్ రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఆ పనిచేశారు. ఆయన సంక్షేమం చేయలేదా? సంక్షేమం విషయంలో అందరి కంటే ఎక్కువ కీర్తి పొందాడే ఆయన. ఎన్నో పథకాలు పెట్టారే కానీ ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారు. అలాగే ఎన్.టి.ఆర్ గారు సంక్షేమం అమలు చేస్తూనే తెలుగుగంగ తీసుకొచ్చారు. పోలవరం చేపట్టాలని గట్టిగా ఆనాడు ప్రయత్నం చేశారు. వంశధార రెండో ఫేజ్ తీసుకొచ్చిందీ ఆయనే. గ్రామాలు, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కోసం ఆయన నానాతంటాలు పడ్డారు. కాబట్టి వాళ్లు సమతూకం పాటించారు. అది నేడు పూర్తిగా దెబ్బతినిపోయి తాత్కాలికమైన సంక్షేమం. దానితో ఓట్లు రాలతాయి. రేపొద్దున భవిష్యత్తు మాకనవసరం. అప్పుల భారం మాత్రం పిల్లల మీద పెడతాం అంటే, అది సమాజానికి మంచిది కాదు. సమాజం కళ్లు తెరుచుకోవాలి. మనం ఒక సంకేతాన్ని ఈ రాజకీయ వ్యవస్థకు ఇవ్వాలి.

**సంక్షేమ పథకాల ద్వారా వ్యవస్థలో మార్పు రాదంటారా?**

**జేపీ:** మీ ప్రశ్నలోనే సమాధానం ఉంది. ఏ కుటుంబం అయినా, దేశం అయినా తాత్కాలికంగా ఉన్న బాధకు ఉపశమనాన్ని ఇస్తూనే సంపాదనా శక్తిని పెంచాలి. సంపాదనా శక్తిని పెంచగలగటానికి ఒక్కటే రూటు ఉంది. అది కాకుండా ఏం చెప్పినా కూడా పచ్చి అబద్ధాలు.

లాటరీ రూటు కాదు, గుర్రపు పందేలు రూటు కాదు. ఒకటే రూటు.. అదే మంచి ప్రమాణాల విద్య. దాంతో ప్రతిభ వికసించాలి. నైపుణ్యం పెరగాలి. సంపాదించే శక్తి రావాలి. మంచి ఆరోగ్యం, దాంతో ఉత్పాదక శక్తి పెరగాలి. ఏడాదికి ఆరు నెలలు మంచంలోనే పడుకుంటే, డబ్బు, శక్తి అంతా ఆరోగ్యానికే ఖర్చు పెడితే పని ఏం చేస్తాడు? కాబట్టి మంచి ప్రమాణాల ఆరోగ్యం.

అలాగే పెద్ద ఎత్తున పెట్టుబడులు ప్రోత్సహించే వాతావరణం అవసరం. పెట్టుబడులు పెట్టి చేతనైతే పది రూపాయలు సంపాదించుకుందాం.. పదిమందిని పోషిద్దామని ఉత్సాహభరితంగా ముందుకొచ్చే వాతావరణం అవసరం. పెట్టుబడులు పెట్టి చేతనైతే పది రూపాయలు సంపాదించుకుందాం. పెట్టుబడి పెట్టే వాళ్ల తలకాయ తినకుండా, అవినీతికి వాళ్లందరినీ బలి చేయకుండా, గూండాలమయం చేయకుండా ఆర్థిక స్వేచ్ఛ, మౌలిక సదుపాయాలు కల్పించాలి. పరిశ్రమల నుంచి వచ్చే ఉపాధి, ఉపాధి నుంచి వచ్చే ఆదాయం.. ఇది తప్ప బీదరికం పోవటానికి ఇంకో రూటు లేదు. ప్రభుత్వం రూ.10 లక్షలు ఇస్తే మార్పు వస్తోందా? ఆ పది లక్షలు కూడా ఎంతమందికి ఇచ్చారు? ఎంతమందికి ఇవ్వగలరు? మిగతావాళ్లందరి సంగతి ఏమిటి? కాబట్టి ఇది మార్గం కానే కాదు. ఒక్కటే మార్గం. సొంతంగా నా కాళ్ల మీద నిలబడే శక్తిసామర్థ్యాలు పెంచడం ఎలా? గాంధీజీ అందుకే చెప్పారు, 'ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఈ పని చేయాలా? వద్దా? అనే సందేహం నీకు ఎప్పుడైనా కలిగితే వెంటనే మారుమూల పూరి గుడిసెలో ఉన్న సామాన్యుడి గురించి ఆలోచించు. నువ్వు చేసే పని వల్ల అతను తన కాళ్ల మీద నిలబడగలిగేట్లయితే, అతనికి ఆత్మగౌరవం పెరిగితే,

అతని స్వావలంబన పెరిగితే.. అది చేయదగ్గది. అతడ్ని మరింత పరాధీనుడ్ని చేస్తే.. అది చేయదగినింది కాదు.'

**ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న నవరత్నాలపై మీ కామెంట్?**

**జేపీ:** సమర్థంగా అమలు చేస్తున్నారు. చివరి మనిషి దాకా వెళ్తున్నాయి. సంతృప్త స్థాయి పథకాలు అమలు చేస్తున్నారు. నాకు అర్థమైనంత వరకు, 60 నుంచి 70 శాతం కుటుంబాలకు పథకాలను బట్టి నెలకు కొన్ని వేల రూపాయలు అందుతున్నాయి. సమర్థంగా చేస్తున్నారు. అవినీతి కూడా లేదు. పూర్వకాలంలో మధ్య దళారులు ఉండేవారు. వారికి లంచాలు ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడు నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయి. కానీ దీనిలో నెగెటివ్ ఏమిటంటే.. 'ప్రజలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో డబ్బులు ఎలా అందించాలనే తపనే తప్ప వాళ్ల బతుకుని శాశ్వతంగా బాగు చేద్దాము.. వారి ఆదాయాలు పెంచుదాము.. వారికి పనికొచ్చే విద్య ద్వారా ప్రతిభాపాటవాలు వికసించే ఏర్పాటు చేద్దామనే ఆలోచన' కొరవడింది. విద్య కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక్కో బిడ్డ మీద రూ.91 వేలు ఖర్చు చేస్తోంది. కానీ వీటిలో బిల్డింగ్‌ల కోసం ఎక్కువగా ఖర్చు చేస్తోంది. అయితే బిల్డింగ్‌ల వల్ల విద్య రాదు. అవి వద్దని అనటం లేదు. విద్యార్థి మేధస్సు వికసిస్తోందా?.. దాని కోసం తంటాలు పడాలి. ఆ తంటాలు పడటం లేదు. దేశంలో ఎక్కడా జరగటం లేదు.

ఆరోగ్యం కోసం ఏపీలో చాలా ఖర్చు పెడుతున్నారు. ఈ మధ్యకాలంలో పీహెచ్‌సీల్లో ఇద్దరో, ముగ్గురో డాక్టర్లను పెట్టి ప్రతీ ఇంటికి వెళ్లే ఏర్పాటు చేశారు. అయితే ఇది జరిగే పని కాదు. జరిగేది అయితే ఎప్పుడో జరిగేది. దానికి చాలా లోతుగా ఆలోచించి, పోటీతత్వాన్ని కల్పించి, ప్రజలకు ఛాయిస్‌ని, ఎవరి దగ్గరకైనా వెళ్లే వెసులుబాటును కల్పించి, పని జరగకపోతే అక్కడికక్కడే ప్రజలు దాన్ని మార్చేలా ప్రజల చేతుల్లో అధికారం పెట్టే రీతిలో చేయాలి. అవి పక్కన పెట్టేసి మొత్తం మీద ఏం జరుగుతోందీ.. ఆర్థికాభివృద్ధి, ఆదాయాలు పెరగటం, పెట్టుబడులు రావటం దాని మీద దృష్టి పూర్తిగా సన్నగిల్లిపోయి, తాత్కాలికమైన తాయిలాలకు ప్రభుత్వం చాలామేర పరిమితం అవుతోంది. కచ్చితంగా రానున్న కాలంలో మూల్యాన్ని చెల్లిస్తాం. కానీ ఒక ప్రజాస్వామ్య సమాజంలో అది ఒకరకంగా అనివార్యం.

ఫ్రాన్స్ లాంటి దేశాల్లోనే అలా జరుగుతుంటే, అమెరికాలోనే అడపాదడపా మాకు ఉచితంగా కావాలని ప్రజలు కోరుతుంటే మరి దాని ప్రభావం రాజకీయం మీద ఉంటే.. మన లాంటి బీద దేశంలో మరింత ఎక్కువగా ఉంటుంది. కానీ సమతూకం పాటించకపోతే సమాజం నష్టపోతుంది. రాజకీయంలో ఉన్నవాళ్లు ఈ రెంటినీ కలపాలి.

**ఈ రెంటినీ కలిపే నాయకులు మీకు తారసపడ్డారా?**

**జేపీ:** ఇందాక ప్రస్తావించాను. రాజశేఖరరెడ్డి గారు విజయవంతంగా చేశారు. ఎన్.టి రామారావు గారి కాలంలో ఆర్థిక సంస్కరణలు రాలేదు. ఆర్థికాభివృద్ధికి కూడా మార్గాలు ఆనాడు లేవు. దేశమంతా అప్పట్లో ఆర్థికంగా అస్తవ్యస్తత. ఒక ముఖ్యమంత్రి విదేశాలకు వెళ్లి మా దేశానికి పెట్టుబడులు కావాలని ఎవరూ అడగలేదు. ఆ పని ఎన్.టి.ఆర్ చేశారు. ఆ కారణంగానే కాకర్ల సుబ్బారావు గారు ఇండియాకు వచ్చారు. నిమ్స్ పెరగటానికి కారణం అదే. కొన్ని పరిశ్రమలు ఈ రాష్ట్రానికి వచ్చాయి. కానీ ఆనాడు ఎన్.టి.ఆర్ ఏటికి ఎదురీదారు. రాజశేఖరరెడ్డి గారు అధికారంలోకి వచ్చేటప్పటికి దేశంలో సంస్కరణలు వేగం పుంజుకున్నాయి. ఆ కాలంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి సమతూకానికి మరింత అవకాశం లభించింది. కొన్ని సందర్భాల్లో మీ ముందుచూపు మీ సామర్థ్యం ఒకపక్కన, సందర్భం మరోపక్కన కలిసిరావాలి. ఇవాళ ఆ సందర్భం ఈ దేశంలో ఉంది. అన్ని రాష్ట్రాల్లో కూడా ఆర్థికాభివృద్ధికి ఓ మంచి మార్గం ఉంది. పదునైన అవకాశం ఉంది. ఇది జారవిడుచుకుంటే మనం మన ప్రజలకు హానిచేసినట్టే.

**ఏపీ, తెలంగాణ అప్పుల నుంచి బయటపడాలంటే ప్రభుత్వాలకు మీరు ఇచ్చే సలహా, ప్రజలకు మీరు చేసే సూచన ఏంటి?**

**జేపీ:** ముందు సమస్యను గుర్తిద్దాం. అయ్యో మునిగిపోయిందని నిరాశ పడిపోవద్దు. పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో ఆలస్యంగానైనా జాగ్రత్తలు తీసుకుంటే పరిస్థితి కుదుటపడుతుంది. ఆదాయం ఇవాళ రూ.100 ఉంది, రేపొద్దున రూ.200 అవుతుంది. ఒక అంచనా ప్రకారం రెండు రాష్ట్రాల్లో అప్పుల వాటా 43 శాతానికి వచ్చేసింది. వంద రెండొందలు అయినప్పుడు అప్పుల భారం మరీ పెరగకుండా ఉన్నట్టయితే ఇప్పటి నుంచి అయినా జాగ్రత్తగా ఖర్చు పెట్టినట్లయితే క్రమక్రమంగా దాని వాటా తగ్గుతుంది. కానీ క్రమశిక్షణ కావాలి. దీర్ఘకాలిక దృక్పథం కావాలి.

మనకు అదృష్టంకొద్దీ ఈ దేశంలో బలమైన ఫెడరల్ వ్యవస్థ ఉంది. రాజ్యాంగంలోని 293 వ అధికరణ ప్రకారం యూనియన్ ప్రభుత్వానికి బాధ్యత ఉంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి చక్కదిద్దే బాధ్యత యూనియన్ ప్రభుత్వంపై ఉంది. కొన్ని పొరపాట్లను అరికట్టే బాధ్యత ఉంది. ముందుజాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు రాష్ట్రం అప్పులు చేయాలంటే యూనియన్ ప్రభుత్వ అనుమతి కావాలి. అది ఊరికే పెట్టలేదు. రాష్ట్రాలు విశృంఖలంగా అప్పులు చేస్తూ కూర్చుంటే బాధ్యత చివరికి కేంద్రానిదే అవుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ యూనియన్ ప్రభుత్వ బాధ్యత అవుతుంది. కాబట్టి ఆ బాధ్యత తీసుకోవాలి అనుకుంటే కేంద్రం గట్టిగా పట్టుకోవాలి. ఇది యూనియన్, రాష్ట్రాల మధ్య యుద్ధం అని భావించకుండా, సామరస్య వాతావరణంలో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను బాగు చేసేందుకు ఇప్పటికైనా కృషి సలపండి. ఖర్చు తగ్గించటంతోపాటు పెట్టే ఖర్చు ఉత్పాదక పథకాలకు, దీర్ఘకాలికంగా మన ప్రజల ఆదాయాలు పెంచే పథకాలకి పెట్టాలి. కచ్చితంగా బయటపడతాం. ఇప్పుడు మేలుకోండి, లేకపోతే పరిస్థితి శ్రీలంకలాగా తయారవుతుంది. ✦

# సం'పన్నుల'తో ఆరోగ్య రంగ బడ్జెట్ పెంచండి

భారతదేశంలో ఆర్థిక అసమానతలు మితిమీరి పెరుగుతున్నాయని హక్కుల సంఘం ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ తన తాజా వార్షిక నివేదికలో తెలిపింది. వస్తువులు, సేవల కోసం సంపన్నుల కంటే పేదలే అధిక పన్నులు చెల్లిస్తున్నారని పేర్కొంది. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశంలో 'సర్వైవల్ ఆఫ్ ద రిచెస్ట్: ఇండియా స్టోరీ' పేరిట నివేదికను సంస్థ విడుదల చేసింది. ఈ నివేదిక ప్రాతిపదికలు, రూపకల్పనకు తీసుకున్న సమాచారం సమగ్రంగా లేవన్న సహేతుక విమర్శలున్నా.. ఇందులో లేవనెత్తిన సమస్యలు మౌలికమైనవని, వీటికి భారత్ నిర్మాణాత్మక పరిష్కారాలు వెతకాలని దాదాపు అందరూ అంగీకరిస్తున్నారు.




**ముఖ్యాంశాలు:**

- దేశంలోని మొత్తం సంపదలో 40 శాతం కంటే ఎక్కువ.. 1 శాతం జనాభాకు సమానమైన కుబేరుల చేతిలో ఉంది
- పేదరికంలోని 50 శాతం మంది దగ్గర అంతా కలిపి.. మొత్తం సంపదలో మూడు శాతం మాత్రమే ఉంది
- అయిదు శాతం భారతీయుల చేతుల్లో 60 శాతం దేశ సంపద ఉంటే, సమాజంలో దిగువన ఉన్న యాభై శాతం జనాభా దగ్గర మూడు శాతం మాత్రమే ఉంది
- 2020లో భారత బిలియనీర్ల సంఖ్య 102గా ఉండగా, 2022 కల్లా 166కు పెరిగింది
- నిరుపేదల సంఖ్య నాలుగేళ్ల కాలంలో 19 కోట్ల నుంచి 35 కోట్లకు పెరిగింది
- కొవిడ్ ప్రారంభమైనప్పటి నాటి నుంచి 2022 నాటికి దేశంలో బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగింది
- మొత్తం అగ్రగామి 100 మంది కుబేరుల సంపద 660 బిలియన్ డాలర్ల (రూ.54.12 లక్షల కోట్ల)కు చేరుకుంది.. ఈ మొత్తంతో యూనియన్ బడ్జెట్‌కు 18 నెలల పాటు నిధులు కేటాయించవచ్చు
- భారత్‌లోని అగ్రగామి 10 మంది కుబేరుల సంపదపై 5 శాతం పన్ను లేదా 100 మందికకుబేరులపై 2.5% పన్ను విధించటం ద్వారా, లభించే మొత్తంతో దేశంలో విద్యకు దూరమైన పిల్లలందరినీ తిరిగి పాఠశాలలకు పంపొచ్చు
- 2017–2021 మధ్య గౌతమ్ అదానీ పొందిన లాభాలపై (అన్‌రియలయిజ్డ్ గెయిన్స్) ఒకే ఒక్కసారి పన్ను విధించినా.. రూ.1.79 లక్షల కోట్లు వస్తాయి. భారతీయ ప్రాథమిక పాఠశాలల్లో 50 లక్షల మంది ఉపాధ్యాయులను ఏడాది పాటు నియమించుకోవడానికి ఈ మొత్తం సరిపోతుంది
- దేశంలోని కుబేరుల మొత్తం సంపదపై ఒక్కసారి 2 శాతం పన్ను (వన్‌టైం ట్యాక్స్) విధిస్తే.. వచ్చే మూడేళ్ల పాటు దేశంలో పోషకాహారలోపం లేకుండా చేయటానికి అవసరమైన రూ.40,423 కోట్లు లభిస్తాయి
- దేశంలోని అగ్రగామి 10 మంది కుబేరులపై 5 శాతం పన్ను విధిస్తే రూ.1.37 లక్షల కోట్లు వస్తాయి. ఇది వార్షిక ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ (రూ.86,200 కోట్లు), ఆయుష్ శాఖ

## పరోక్ష పన్నులతో సామాన్యుల నడ్డి విరిచారు

**2019లో ప్రభుత్వం ముప్పై శాతం కార్పొరేట్ పన్నును 22 శాతానికి తగ్గించడం, కొత్తగా నమోదైన కంపెనీలు పదిహేను శాతం పన్ను మాత్రమే కడితే సరిపోతుంది వంటి నిర్ణయాలు తీసుకున్నందున సుమారు రూ.2 లక్షల కోట్లు నష్టపోయిందని, దీన్ని భర్తీ చేసుకోవటానికి జీఎస్‌టీ పరిధిలోకి కొత్త ఉత్పత్తులు చేర్చటం, పన్ను రేట్లు పెంచటం, చమురు మీద అధిక సుంకాలు విధించటం, అప్పటికే ఉన్న మినహాయింపులను ఎత్తివేయటం వంటి చర్యలు ప్రధానంగా సామాన్యుల నడ్డివిరిచాయన్నది నివేదిక సారాంశం. కార్పొరేట్లకు ఇచ్చిన ప్రోత్సాహకాలు, మినహాయింపుల వల్ల 2020-21 ఆర్థిక సంవత్సరంలోనే ప్రభుత్వం దాదాపు లక్ష కోట్లు నష్టపోయింది. సామాన్యులను, పేదలనూ పీల్చిపిప్పి చేస్తున్న పరోక్ష పన్నుల మీద ప్రభుత్వం దృష్టి పెట్టటాన్ని ఆక్స్‌ఫామ్ ఆక్షేపించింది.**

## ప్రపంచవ్యాప్తంగా..

**గత రెండేళ్లలో ప్రపంచంలోని 1% జనాభాకు సమానమైన కుబేరులు సంపాదించిన సంపద.. మిగతా ప్రపంచ జనాభా మొత్తం సంపాదన కంటే రెండింతలు ఎక్కువ. కుబేరుల సంపద రోజుకు 2.7 బిలియన్ డాలర్ల చొప్పున పెరిగింది. వేతనాల పెంపు కంటే ద్రవ్యోల్బణమే అధికంగా పెరుగుతున్న దేశాల్లో కనీసం 170 కోట్ల మంది కార్మికులు గత రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. బిలియనీర్లపై 5% పన్ను విధించినా, ఏడాదికి 1.7 లక్షల కోట్ల డాలర్లు వస్తాయి. ఈ సంపదతో 200 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయట పడేయొచ్చు. ప్రపంచంలో ఆకలితో అలమటిస్తున్న జనాభాలో 60 శాతం మంది మహిళలు, బాలికలే ఉన్నారు. అనేక దేశాల్లో బిలియనీర్ల కన్నా పేదలే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నారు. ఈ అసమానతలకు ధనవంతులు, కార్పొరేట్లకు దశాబ్దాలుగా ఇస్తున్న పన్ను తగ్గింపులే కారణం.**

(రూ.3,050 కోట్లు)ల 2022-23 వార్షిక బడ్జెట్ కంటే ఎంతో అధికం కావటం గమనార్హం

- 2021-22లో జీఎస్టీలో వసూలైన మొత్తం (రూ.14.83 లక్షల కోట్లు)లో 64 శాతం (దాదాపు మూడింట రెండు వంతులు) దిగువన ఉన్న 50 శాతం మంది పేదలు కట్టిందే.. మధ్యలోని 40 శాతం మంది 1/3 వంతు కట్టగా, టాప్ 10 సంపన్నులు కట్టిన జీఎస్టీ 4 శాతమే
- పురుష కార్మికులు పొందే ప్రతి రూపాయితో పోలిస్తే అదే వృత్తి చేస్తున్న మహిళా కార్మికులు 63 పైసలే సంపాదిస్తున్నారు
- అగ్రవర్ణాలు సంపాదించిన దానిలో షెడ్యూల్ కులాలవారు 55% మాత్రమే పొందుతున్నారు
- 2018-19 మధ్య పట్టణ ప్రాంతాలతో పోల్చితే గ్రామీణ కార్మికులు సగం ఆదాయాన్ని మాత్రమే పొందారు

.. అత్యంత సంపన్నులపై వెల్త్ ట్యాక్స్, అప్పనంగా లాభాలపై, వారసత్వ సంపదపై ట్యాక్స్ తదితర పన్నులు విధించాలని, క్యాపిటల్ గెయిన్స్ పన్ను పెంచాలని, దేశ ఆరోగ్య రంగానికి జీడీపీలో 2.5% కేటాయించి ప్రజలందరికీ ఆరోగ్య భద్రత కల్పించాలని (భారత్‌లో పేదరికం కొనసాగటానికి, ఉత్పాదకత తక్కువగా ఉండటానికి అనారోగ్య ఖర్చుల్ని ప్రజలు వ్యక్తిగతంగా భరించలేకపోవటం పెద్ద కారణం) యూనియన్ ప్రభుత్వానికి ఆక్స్‌ఫామ్ సూచించింది. దేశంలోని ఆర్థిక అసమానతలు, బిలియనీర్ల సంపద వంటి అంశాల కోసం ఫోర్బ్స్ వంటి సెకండరీ సోర్సులను, డేటా అన్వయానికి సంబంధించి ఎన్ఎస్ఎస్, యూనియన్ బడ్జెట్ పత్రాలు, పార్లమెంటులో ప్రశ్నలు వగైరాలను ఉపయోగించుకున్నారు.

## ఈ ఏడాదీ పెరగనున్న అపర కుబేరుల సంపద

ఈ ఏడాదీ దేశంలోని అపర కుబేరుల సంపద పైపైకి పెరగవచ్చని ఓ గ్లోబల్ సర్వేలో తేలింది. గత ఏడాది ప్రతీ 10 మంది భారతీయ కుబేరుల్లో 9 మంది సంపద పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుత సంవత్సరం కూడా వీరి సంపద మరింత పెరగవచ్చని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ సర్వే వెల్లడించింది. 'ది వెల్త్ రిపోర్ట్: ఔట్‌లుక్ 2023' పేరుతో సర్వే వివరాలను నైట్ ఫ్రాంక్ తాజాగా విడుదల చేసింది. 2022లో 88 శాతం భారతీయ అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంపదలో వృద్ధి కనిపించిందని, ఇందులో 35 శాతం మంది సంపద 10 శాతం పైనే పెరిగిందని నైట్ ఫ్రాంక్ తెలిపింది. అభద్రత, అస్థిరత ఎక్కువగా ఉన్నప్పటికీ ఈ స్థాయిలో సంపద పెరగటం గొప్పేనని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా సంపద పెరిగే అవకాశాలే ఉన్నట్టు చెప్పింది. సర్వేలో 47 శాతం భారతీయ కుబేరుల్లో తమ సంపద నిరుడుతో పోల్చితే ఈ సంవత్సరం 10 శాతానికిపైనే పెరుగుతుందన్న విశ్వాసం కనిపించిందని, మిగతా 53 శాతం మందిలో కూడా కనీసం 10 శాతమైనా పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తమైందని నైట్ ఫ్రాంక్ వెల్లడించింది.

మరికొన్ని అంశాలు:

- దేశంలోని కుబేరుల్లో ఒక్కొక్కరికి నివాస గృహాలు 5కి పైనే ఉన్నాయి. తొలి రెండు ఇళ్లకే 37 శాతం సంపదని కేటాయిస్తున్నారు. విదేశాల్లో నివాసం కోసం తమ సంపదలో 15 శాతం ఖర్చు చేస్తున్నారు.
- గత ఏడాది యూహెచ్ఎన్‌డబ్ల్యూఐల్లో 14 శాతం మంది కొత్తగా ఇళ్లను కొన్నారు. ఈ ఏడాదీ దాదాపు 10 శాతం మంది ఇంటి కొనుగోళ్లు చేపట్టే సంకేతాలున్నాయి.
- బ్రిటన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికాల్లో ఇళ్ల కొనుగోళ్లకు భారతీయ కుబేరులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. బ్రిటన్‌కి మొగ్గు చూపుతున్న 47 శాతం మంది. తర్వాతి స్థానాల్లో యూఏఈ (41 శాతం), అమెరికా (29 శాతం), కెనడా (18 శాతం) ఉన్నాయి.
- ఈ ఏడాది పెట్టుబడుల తర్వాత.. ఆర్ట్స్, వాచీలు, లగ్జరీ హ్యాండ్‌బ్యాగుల కొనుగోళ్లకు 53 శాతం భారతీయ కుబేరులు ఆసక్తి చూపిస్తున్నారు.

# నమోదు పెరిగింది.. నాణ్యత తగ్గింది




కరోనా మహమ్మారి కారణంగా పిల్లల అభ్యాసనా సామర్థ్యాలు గణనీయంగా పడిపోయాయని అసర్ - 2022 నివేదిక వెల్లడించింది. అసర్ - 2022 ను న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ అజయ్ పిరామిల్ జనవరి 18 న విడుదల చేశారు. దేశంలో పాఠశాల విద్యారంగంలో విభిన్నధోరణులు వ్యక్తం అవుతున్నాయని అసర్ నివేదిక వివరించింది. యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్ (అసర్) పేరుతో ప్రథమ్ సంస్థ 2005 నుండి క్రమం తప్పకుండా ప్రతిఏటా దేశవ్యాప్తంగా విద్యాస్థితిగతులపై సర్వే నిర్వహించి నివేదికలను విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ వరుసలోని 17 వ నివేదిక ఇది. 2022 సంవత్సరపు అసర్ సర్వే దేశంలోని 616 జిల్లాలలోని 19,060 గ్రామాలలో జరిగింది.దాదాపు 30 వేలమంది వలంటీర్లు సర్వేలో పాలుపంచుకున్నారు. సర్వేలో భాగంగా 7లక్షలమంది పిల్లల అభ్యాసనా సామర్థ్యాలను పిల్లల ఇళ్ళ దగ్గరే వారు పరీక్షించారు. దాదాపు 17 వేల ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. వాటిలోని మౌలిక సదుపాయాలను , పిల్లల, ఉపాధ్యాయుల హాజరును, బోధనాభ్యసన పద్ధతులను కూడా వారు పరిశీలించారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి ఆసర్ -2022 నివేదికను రూపొందించారు. 2015 వరకూ ప్రతిఏటా అసర్ సర్వేను నిర్వహించారు. ఆ తర్వాత రెండేళ్ళకు ఒకసారి చొప్పున 2016 లోనూ ,2018 లోనూ సర్వే నిర్వహించారు. 2020 ,2021 సంవత్సరాలలో కరోనా కారణంగా పూర్తిస్థాయి సర్వే సాధ్యం కాలేదు. ఆన్ లైన్ లో పరిమితస్థాయి సర్వేలను మాత్రమే చేపట్టారు. 2022 లో తిరిగి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించారు. 2018 నాటి పూర్తిస్థాయి సర్వేనివేదిక తర్వాత ప్రస్తుతనివేదిక వెలువడింది. దాంతో నాలుగేళ్ళ నాటి స్థితిగతులను ప్రస్తుత పరిస్థితులను తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి అవకాశం కుదిరింది. పైగా ఈ కాలంలోనే కరోనా మహమ్మారి విరుచుకుపడి విద్యా వాతావరణాన్ని అతలాకుతలం చేసింది. ఇదే సమయంలో నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చింది. బాలవిద్య ,పూర్వ ప్రాథమిక విద్యపై వీటి ప్రభావాన్ని గమనించడానికి కూడా తాజా నివేదిక తోడ్పడుతుంది.

**మెరుగుపడిన పాఠశాల నమోదు:**

కరోనా కారణంగా రెండేళ్లపాటు పాఠశాలలు సక్రమంగా పనిచేయలేదనే సంగతి తెలిసిందే. దాంతో దేశవ్యాప్తంగా అన్నిరకాల పాఠశాలల్లోనూ నమోదు పడిపోయింది. కరోనా తగ్గుముఖం పట్టడంతో పాఠశాలలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి. 6 -14 వయోవర్గం పిల్లల (ప్రభుత్వ ,ప్రైవేటు కలిపి) పాఠశాల నమోదు 2020 నాటికి జాతీయ స్థాయిలో 97. 2 శాతంగా ఉండగా, 2022 కి 98. 4 శాతానికి పెరిగింది. గత 15 సంవత్సరాలలో పాఠశాల నమోదు ఇంత పెద్ద స్థాయిలో ఉండటం ఇదే తొలిసారని అసర్ నివేదిక పేర్కొన్నది. ప్రభుత్వపాఠశాలల్లో నమోదు 2014 వరకూ ప్రతిఏటా

పడిపోతూ వచ్చిన విషయాన్ని గత అసర్ నివేదికలు చూస్తే అవగతం అవుతుంది. జాతీయస్థాయిలో ప్రభుత్వపాఠశాలల్లో 6-14 వయోవర్గం పిల్లలనమోదు 2014 నాటికి 64. 9 శాతంగా ఉంది. ఆసంఖ్య 2018 లో 65. 6 శాతం కాగా 2022 లో 72. 9 శాతానికి పెరిగింది. కరోనా తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెరిగిన ధోరణి అన్ని రాష్ట్రాలలోనూ కనిపించిందని అసర్ నివేదిక పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ లో 6-14 వయోవర్గం పిల్లలు ప్రభుత్వపాఠశాలల్లో చేరినవారు 2018 లో 63. 2 శాతం కాగా, 2022లో ఈసంఖ్య 70. 8 శాతానికి పెరిగింది. మనసమాజంలో బాలికా విద్యపై ఉన్న ప్రతికూల భావనలు మెల్లిగా తగ్గుముఖం పట్టాయని అసర్ - 2022 నివేదిక తెలియచేసింది. వారి డ్రాప్ ఔట్ రేటు గణనీయంగా తగ్గుముఖం పట్టిందని తాజా గణాంకాలు చెబుతున్నాయి. జాతీయస్థాయిలో 11-14 వయోవర్గం బాలికల్లో బడిబైట ఉన్నవారి శాతం గతంలో 10. 3 శాతం కాగా ప్రస్తుతం ఈ సంఖ్య 2 శాతానికి తగ్గింది. తెలుగురాష్ట్రాల్లో బాలికావిద్య కు మంచి ప్రాధాన్యం ఇస్తున్నట్లు స్పష్టంగా కనిపించింది. బడిబైటి బాలికల సంఖ్య తెలంగాణలో 0. 5 శాతం కాగా , ఆంధ్రప్రదేశ్ లో 1 శాతంగా ఉంది. జాతీయస్థాయిలో 15-16 వయోవర్గంలో బడిబైటి బాలికల సంఖ్య 2014 వరకూ 20 శాతం వరకూ ఉండేది.



2018 లో ఈసంఖ్య 13. 5 శాతంగా ఉండగా 2022లో 7. 9 శాతానికి తగ్గింది. అదే వయోవర్గం బాలికల్లో తెలంగాణలో ఇంకా బడిబైట ఉన్నవారు 3 శాతం కాగా ఆంధ్రప్రదేశ్ లో 2 శాతంగా ఉన్నారు. ప్రీప్రైమరీ పిల్లలనమోదు సైతం గణనీయంగా పెరిగిందని అసర్ - 2022 నివేదిక వెల్లడించింది.

3 వ ఏట బాల్యవిద్య కోసం ఏదో ఒక ప్రీ ప్రైమరీ సంస్థలో నమోదు అవుతున్న పిల్లలసంఖ్య జాతీయస్థాయిలో గతంలో 71. 2 శాతం కాగా తాజాగా ఈసంఖ్య 78. 3 శాతానికి పెరిగింది. జాతీయస్థాయిలో అంగన్ వాడీలలో చేరిన మూడేళ్ళపిల్లలు 2018 లో 57. 1 శాతం ఉండగా 2022 లో 66. 8 శాతానికి పెరిగింది. జాతీయస్థాయిలో ఆంగన్ వాడీలలో చేరిన నాలుగేళ్ళపిల్లలు 2018 లో 50. 5 శాతం ఉండగా 2022 లో 61. 2 శాతం ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ఆంగన్ వాడీలో చేరిన మూడేళ్ల పిల్లల సంఖ్య గతంలో 71. 3 శాతంగా ఉండగా తాజాగా సంఖ్య 80. 7 శాతానికి పెరిగింది. అలాగే ఆంగన్ వాడీలలో చేరిన నాలుగేళ్ళ పిల్లలు గతంలో 53. 4 శాతం ఉండగా తాజాగా ఈ సంఖ్య 68. 3 శాతానికి పెరిగింది. డబ్బుచెల్లించి ప్రైవేటు ట్యూషన్లు చెప్పించుకుంటున్న ధోరణి దేశవ్యాప్తంగా పెరుగుతున్నది. పిల్లల చదువులకోసం ఎంతోకొంత సొమ్ము ఖర్చు చేయడానికి తల్లి తండ్రులు వెనకాడటం లేదని అసర్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వ , ప్రైవేటు తేడాలేకుండా అన్ని రకాల పాఠశాలల పిల్లల్లోనూ ట్యూషన్లు చెప్పించుకునే వారి సంఖ్య జాతీయస్థాయిలో గతంలో 26. 4 శాతం ఉండగా తాజాగా ఆసంఖ్య 30. 5 శాతానికి పెరిగింది. ఆంధ్రప్రదేశ్ లో సైతం ట్యూషన్లు చెప్పించుకునే పిల్లలసంఖ్య 14. 9 శాతం నుండి 17. 9 శాతానికి పెరిగింది. మొత్తం మీద పాఠశాల నమోదు పెరగడం , తల్లితండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపడం, బడిబైటి బాలికల సంఖ్య బాగా తగ్గడం , చిన్నపిల్లలను ఏదో ఒక ప్రీ ప్రైమరీ స్కూల్ లో చేర్చడం వంటి ధోరణులు దేశవ్యాప్తంగా కన్పిస్తున్నాయని అసర్ -2022 నివేదిక పేర్కొన్నది.

**అటకెక్కిన అభ్యసనం:**

కరోనా పుణ్యాన పిల్లల చదువులు అటకెక్కాయని , దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ పిల్లల పఠనసామర్థ్యాలు గణనీయంగా పడిపోయాయని అసర్ - 2022 నివేదిక పేర్కొన్నది. మూడవ తరగతి చదువుతూ 2 వ తరగతి పాఠ్యాంశాన్ని చదవగలిగే పిల్లలసంఖ్య జాతీయస్థాయిలో 2018 లో 27. 3 శాతంగా ఉండగా 2022 లో 20. 5 శాతానికి పడిపోయింది. గతంతో పోలిస్తే పదిశాతపు పాయింట్ల కంటే తగ్గిపోయిన రాష్ట్రాలలో కేరళ ,హిమాచల్ ప్రదేశ్, హర్యానా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ లో 2018లోనే ఆసంఖ్య 22. 6 శాతంగా ఉండగా 2022లో 10. 3 శాతానికి పడిపోయింది. తెలంగాణలో కూడా 2018 లో 18. 1 శాతంగా ఉన్న ఈసంఖ్య 2022 లో 5. 2 శాతానికి పడిపోయింది. 5 వ తరగతి చదువుతూ 2 వ తరగతి పాఠ్యాంశాన్ని చదవగలిగే పిల్లల సంఖ్య కూడా తగ్గిపోయింది. జాతీయస్థాయిలో ఈపిల్లల సంఖ్య 50. 5 శాతం నుండి 42. 8 శాతానికి తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్ లో ఈ సంఖ్య 59. 7 శాతం నుండి 36. 4 శాతానికి , గుజరాత్ లో 53. 8 శాతం నుండి 34. 2 శాతానికి , హిమాచల్ప్రదేశ్ లో 76. 9 శాతం నుండి 61. 3 శాతానికి పడిపోయింది. తెలంగాణాలో ఈ సంఖ్య 43. 6



శాతం నుండి 31. 7 శాతానికి పడిపోయింది.  8 వ తరగతి చదువుతూ 5 వ తరగతి పాఠ్యాంశాన్ని చదవగలిగే విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది.  జాతీయస్థాయిలో 2018 లో ఈ సంఖ్య 73 శాతం ఉండగా 2022 లో 69. 6 శాతానికి తగ్గింది. ఆంధ్రప్రదేశ్ లో ఈసంఖ్య 78. 2 శాతం నుండి 66. 4 శాతానికి తగ్గిపోయింది. తెలంగాణలో ఈ సంఖ్య 69. 5 శాతం నుండి 61. 9 శాతానికి తగ్గింది.

**లెక్కల చిక్కులు :**

పిల్లల గణిత సామర్థ్యాల పరిస్థితి కూడా అంతంత మాత్రమేనని  అసర్ 2022 నివేదిక పేర్కొన్నది.  మూడవతరగతి చదువుతూ రెండంకెల తీసివేత చేయగలిగే పిల్లల సంఖ్య జాతీయస్థాయిలో 28. 2 శాతం  నుండి 25. 9 శాతానికి పడిపోయింది.  తమిళనాడు ,మిజోరాం , హర్యానా వంటి రాష్ట్రాల్లో ఈతగ్గుదల పది శాతపు పాయింట్ల కంటే ఎక్కువే ఉంది. తెలంగాణాలో ఈసంఖ్య 34. 5 శాతం నుండి 28. 7 కు తగ్గిపోగా ఆంధ్ర ప్రదేశ్ లో 38. 4శాతం నుండి 33. 7 శాతానికి




పడిపోయింది. 5 వ తరగతి చదువుతూ చిన్నపాటి భాగహారం చేయగలిగె  పిల్లల సంఖ్య కూడా  జాతీయస్థాయిలో 28 శాతం నుండి 25. 6 శాతానికి తగ్గింది. ఆంధ్రప్రదేశ్ లో ఈసంఖ్య 39. 3 శాతం నుండి 29. 6 శాతానికి , తెలంగాణా లో 27. 3 శాతం నుండి 22. 7 శాతానికి తగ్గిపోయింది. 8 వ తరగతి చదువుతూ చిన్న భాగహారం చేయగలిగే విద్యార్థుల సంఖ్య 44. 1 శాతం నుండి 44. 7 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్ లో కూడా 47. 6 శాతం నుండి 51. 7 శాతానికి పెరగ్గా, తెలంగాణాలో మాత్రం  ఈసంఖ్య 48. 7 శాతం నుండి 44. 6 శాతానికి తగ్గింది. ఇంగ్లీషు మీడియం గురించి ప్రభుత్వాలకూ , తల్లి తండ్రులకు ఎంత మోజు ఉన్నప్పటికీ పిల్లల  ఆంగ్ల భాషా సామర్థ్యాలు కూడా అంతంత మాత్రంగా ఉన్నాయనీ అసర్ నివేదిక పేర్కొన్నది. మూడవతరగతి చదువుతూ చిన్నచిన్న పదాలు చదవలేని పిల్లలు జాతీయస్థాయిలో 61. 3 శాతం ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ లో వీరి సంఖ్య 57. 5 శాతం కాగా తెలంగాణా లో వీరు 61 శాతం ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ లో తెలుగును బోధనా మాధ్యమంగా తొలగించి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. 8 వ తరగతి చదువుతూ ఆంగ్లంలో చిన్నపాటి వాక్యాలు చదవలేని విద్యార్థులు ఆంధ్ర ప్రదేశ్ లో 30. 2 శాతం ఉండగా తెలంగాణలో వీరి సంఖ్య 36. 8 శాతంగా ఉంది. పాఠశాలల్లో మరో ప్రధానమైన సమస్య పిల్లల గైరుహాజరు అని అసర్ పేర్కొన్నది. ఇప్పటికీ జాతీయస్థాయిలో పిల్లల హాజరు  72. 9 శాతంగానే కొనసాగుతున్నది. అలాగే 60 మంది కంటే తక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు దేశంలో  దాదాపు 30 శాతంగా ఉన్నాయి. అక్కడ ఒక్కరే ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారు. దేశంలో మల్టీ గ్రేడ్ తరగతులు ఇంకా పెద్దఎత్తున కొనసాగుతున్నాయి.  2 వ తరగతి పిల్లల్నీ ఇతర తరగతుల పిల్లలతో కలిపి కూచోబెట్టి క్లాసులు నిర్వహించే పాఠశాలలు 65. 6 శాతంగా ఉన్నాయి. 4 వ తరగతి పిల్లల్ని ఇతర తరగతి పిల్లలతో కలిపి కూచోబెట్టి క్లాసులు నిర్వహించే పాఠశాలలు 58 శాతంగా ఉన్నాయి. మల్టీగ్రేడ్ తరగతుల వల్ల బోధనాభ్యసన ప్రక్రియ తీవ్రంగా దెబ్బతింటుందని తెలిసిన విషయమే. నిజానికీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు గతంతో పోలిస్తే బాగా మెరుగుపడ్డాయని అసర్ –2022 నివేదిక పేర్కొన్నది. విద్యుత్ సరఫరా ఉన్న పాఠశాలల సంఖ్య 75 శాతం నుండి 93 శాతానికి , మరుగుదొడ్లు ఉన్న పాఠశాలలు 74 శాతం నుండి 77 శాతానికి, మధ్యాహ్న భోజనం సరఫరా చేసే పాఠశాలల సంఖ్య 87 శాతం నుండి 89. 5 శాతానికి పెరిగాయి. కానీ మల్టీ గ్రేడ్ తరగతులు, పిల్లల గైరు హాజరు , పెరుగుతున్న చిన్న పాఠశాలల సంఖ్య వంటి  సమస్యలు పరిష్కారం జరిగితే తప్ప విద్యా ప్రమాణాలు నాసిగానే ఉంటాయని అసర్ నివేదిక పేర్కొన్నది.

పాఠశాల నమోదులో దేశం సాధించిన విజయం చిన్నదేమీ కాదు. అలాగే గత 15 ఏళ్ళలో అభ్యసనా ప్రమాణాల మెరుగుదల మీద కొంత దృష్టి పెరిగింది.

అది నిలకడగా కొనసాగే క్రమంలో కరోనా వచ్చి ప్రయత్నాన్ని దెబ్బతీసింది.  బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే ప్రయత్నం మొదలైనా అనేక పరిమితుల కారణంగా పూర్తిస్థాయిలో అది అమలు జరగడంలేదు.  కరోనా అనంతర కాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెరగడం ఒక తాత్కాలిక పరిణామం మాత్రమేనని నిపుణులు అంటున్నారు.

అసర్– 2022  నివేదిక విడుదల కార్యక్రమంలో "ప్రథమ్" సహ వ్యవస్థాపకులు డా. మాధవ్ చవాన్, ప్రథమ్ సి. ఇ. వో. డా.  రుక్మిణి బెనర్జీ , అసర్ సంచాలకురాలు డా. విల్లిమా వాధ్వ , కేంద్ర విద్యాశాఖ పూర్వకార్యదర్శి  బృందా స్వరూప్ , ప్రముఖ సామాజిక కార్యకర్తలు  శంకర్ మారువాడ్ , వీరేందర్ , వినీత్ నాయర్ , రుక్మిణీ నిలేకనీ  తదితరులు మాట్లాడారు.  ప్యానల్ చర్చలో పాల్గొన్న ప్రముఖులు అసర్ ప్రయత్నాన్ని అభినందించారు.

# రాష్ట్రాలూ ఇదే తరహా బాధ్యతాయుత బడ్జెట్‌లు ప్రవేశపెట్టాలి: జేపీ





యూనియన్ బడ్జెట్ 2023-24 సామాన్యులను ఆర్థిక స్రవంతిలో భాగస్వాముల్ని చేస్తూ ప్రగతిశీలంగా, విశ్వసనీయంగా, పన్నుల భారం లేకుండా దీర్ఘకాలిక అభివృద్ధికి బాటలు వేసేలా ఉందని, ఆర్థిక మంత్రికి మంచి మార్కులు ఇవ్వొచ్చని ప్రజాస్వామ్యం పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జేపీ స్పందనలోని ముఖ్యాంశాలు:

యూనియన్ ఆర్థిక మంత్రి ఒక కీలక ఘట్టంలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. చాలా పెద్ద రాష్ట్రాల్లో ఈ సంవత్సరం ఎన్నికలు జరుగుతున్నాయి. ఆపైన వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు, దాంతోపాటు మరిన్ని రాష్ట్రాలకూ ఎన్నికలు జరుగుతాయి. అలాంటి సందర్భంలో ఏ ప్రభుత్వానికైనా ఎన్నికల్లో గెలవాలి అన్న కోర్కె ఉంటుంది. అది రాజకీయాల్లో, ప్రజాస్వామ్యంలో సహజం. ఇదేసమయంలో, తాత్కాలికంగా ఓటర్లను తృప్తి పరచటం, దాని ద్వారా ఓట్లు పొందటం, దాని కోసం దేశ ఆర్థిక ప్రగతిని కుంటుపడేట్టు చేయటం మనకు ఆనవాయితీ అయిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

బడ్జెట్ అంటే. . ప్రభుత్వానికి పన్నుల రూపంలో, ఇతరత్రా వచ్చే ఆదాయం. . ప్రభుత్వం పెట్టే ఖర్చులు. ఏ రంగాల్లో ఆ ఖర్చు పెడుతున్నారు, ప్రాధాన్యాలేంటి, ఎలాంటి సంకేతాన్నిస్తున్నారు అనేవి బడ్జెట్ తెలియచేస్తుంది. యూనియన్ బడ్జెట్‌ను మనం నాలుగు కోణాల నుంచి విశ్లేషిద్దాం. మొట్టమొదటిది, ఈ బడ్జెట్ మన దేశంలో సామాన్యుల్ని, నిరుపేదల్ని, గ్రామీణుల్ని, అసంఘటిత రంగంలో ఉన్నవారిని, రెక్కాడితేగానీ డొక్కాడని వాళ్లని పట్టించుకుంటోందా? వాళ్లని మన ఆర్థిక జీవన స్రవంతిలో భాగస్వాముల్ని చేస్తోందా? రెండోది, ప్రగతిశీలంగా ఉందా? ఆర్థికాభివృద్ధికి, పెట్టుబడులకి పెద్దపీట వేసి, పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పన, ఆదాయాల పెంపు, బీదరిక నిర్మూలనల కోసం దారి తీస్తోందా? మూడోది, ఈ మొత్తం ఏర్పాట్లు కూడా అప్పుల భారాన్ని పెంచి మన పిల్లల మీద భారం పెట్టేట్లయితే లాభం లేదు. కాబట్టి, బాధ్యతతో, ఆచరణసాధ్యమయ్యే రీతిలో చేస్తున్నారా? దొంగలెక్కలతో లేదా అప్పుల భారాన్ని పెంచి భవిష్యత్తు నరకం చేస్తున్నారా? నాలుగోది, మనమందరం కోరుకునేది- మన మీద పన్నుల భారం లేకుండా చేస్తున్నారా. ఆదాయపు పన్ను భారం లేకుండా చేస్తున్నారా?. . ఈ నాలుగు రీత్యా చూద్దాం.

మొదటిది, సామాన్యుల్ని జీవన స్రవంతిలో భాగస్వాముల్ని చేయటం, అవకాశాలు కల్పించటం. ఈ బడ్జెట్‌లో పుష్కలంగా ఆ ఏర్పాట్లు ఉన్నాయి. నిరుపేదలందరినీ కూడా అభివృద్ధిలో భాగస్వాముల్ని చేయటం కోసం చాలా ఏర్పాట్లు బడ్జెట్‌లో కనిపిస్తున్నాయి. వ్యవసాయ రంగంలో కేవలం పాత పంటలే కాకుండా, సామాన్య రైతులకు ఆదాయం పెరగటం, ఊరట కలగటం కోసం హైవాల్యూ హార్టికల్చర్ కావచ్చు, పండ్ల తోటలు కావచ్చు, ఫిషరీస్ కావచ్చు, ఇతర రంగాలు కావచ్చు. . వీటిల్లో ఏర్పాట్లు చేశారు. అలాగే నేత, ఇతర చేతి వృత్తుల్లో మన దేశంలో అత్యధిక సంఖ్యలో పనిచేయటం సాంప్రదాయంగా వస్తోంది. వీరికి తగిన ఆదాయం ఉండటం లేదు. వారి ఆదాయం పెరిగేందుకు ఏర్పాట్లు కావచ్చు, సహకార సంఘాలను సంఘటితం చేసి వారందరికీ కూడా ఆదాయాలు ఇచ్చేందుకు కొన్ని ఏర్పాట్లు కావచ్చు బడ్జెట్‌లో చేశారు. అలాగే ఆరోగ్య రంగంలో కావచ్చు, విద్యలో కావచ్చు. . వివిధ రూపాల్లో సామాన్యులకి జీవితంలో బతుకుభారం తగ్గటానికి, భవిష్యత్తు ఆర్థికంగా బాగుండటానికి ఏర్పాట్లు జరిగాయి. కాబట్టి ఇంక్లూజివ్ గ్రోత్ అనే విషయంలో మనం ఆర్థిక మంత్రికి మంచి మార్కులివ్వొచ్చు.

ఇక రెండోది, ప్రగతిశీలంగా ఉందా? పెట్టుబడులు, అభివృద్ధికి దోహదం చేస్తోందా? అందరూ ఆశ్చర్యపోయేది, సంతోషపడేది ఏంటంటే- గత సంవత్సరంలో పెట్టుబడులకు కేటాయించిన ఏడున్నర లక్షల కోట్ల రూపాయల భారీ మొత్తాన్ని ఈ సంవత్సరం 33% పెంచారు. ఎవ్వరూ ఊహించలా. పది లక్షల కోట్ల రూపాయలు ప్రత్యక్షంగా యూనియన్ ప్రభుత్వం నుంచి పెట్టుబడులు పెడుతుండగా, ఇంకా రైల్వే రంగంలో గానీ, రాష్ట్రాలకు పెట్టుబడులను గానీ చూస్తే ఇది రూ. 13 లక్షల 70 వేల రూపాయలు. ఈ మొత్తం కలిపితే మన జాతీయాదాయంలో 4. 5%. జాతీయస్థాయి ప్రభుత్వం నుంచే అదనపు పెట్టుబడులకి డబ్బులు వస్తున్నాయి. మూడేళ్లలో మూడు రెట్లు పెంచారు. మూడేళ్ల క్రితం ఇది కేవలం 1. 5%. దీన్ని మనం పూర్తిగా ఆహ్వానించి, సంతోషపడాలి. అలాగే, ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెంచటం కోసం ప్రోత్సాహకాలు ఇచ్చే ఏర్పాటు జరుగుతున్నది. ముఖ్యంగా పర్యాటకం, డైమండ్స్, ఎలక్ట్రానిక్స్, ఇంధన సెక్టార్‌లో సౌర శక్తి, బ్యాటరీ టెక్నాలజీ, స్టోరేజి టెక్నాలజీ. .

ఇలా భవిష్యత్తులో ఏ రకంగా మనకి ఉపాధి కల్పన, పెట్టుబడులకు అవకాశం ఉంటుందో చూసి దానికి పెద్దపీట వేయటం జరుగుతోంది. ఉపాధితోపాటు దీర్ఘకాలిక అభివృద్ధి కోసం ఏర్పాట్లు చేశారు. పెట్టుబడుల విషయంలో ఇది బ్రహ్మాండమైన బడ్జెట్. అందుకే మార్కెట్ కూడా వేగంగా స్పందించింది. దేశమంతా కూడా పారిశ్రామికవేత్తలు గానీ, స్టాక్ మార్కెట్ గానీ, మిగతావాళ్లు గానీ చాలా మంచి బడ్జెట్ అని ప్రశంసిస్తున్నారు. ఇక మూడోది, బాధ్యతతో చేశారా, లేకపోతే భవిష్యత్తుపై భారం పెట్టారా? మనకు మూడేళ్ల క్రితం కేవలం నాలుగున్నర, నాలుగు శాతం ఉన్న ద్రవ్యలోటు- అంటే అప్పులు, రెండేళ్ల క్రితం కొవిడ్ నేపథ్యంలో 9. 5 శాతానికి పెరిగింది. ఆదాయాలు తగ్గాయి, ఖర్చు పెరిగింది. గత సంవత్సరం చాలా కష్టపడి ఆర్థికమంత్రి 6. 4 శాతానికి పరిమితం చేసే ప్రతిపాదన చేశారు, దాన్ని అమలు చేశారు. మామూలుగా బడ్జెట్‌లో అంచనాలు బ్రహ్మాండంగా వేయటం, దాన్ని అందుకోలేకపోవటం ఆనవాయితీ. అలాకాకుండా, 6. 4 శాతానికి మించి అప్పులు చేయమని, అందుకు పరిమితం చేయగలిగారు. వచ్చే సంవత్సరానికి 5. 9 శాతానికి చేయాలని, రాబోయే మూడేళ్లలో 4. 5 శాతానికి తగ్గించాలని ఏర్పాటు జరుగుతోంది. అది నమ్మశక్యమైనది. ఎందుకంటే, క్రమక్రమంగా ప్రతి సంవత్సరం తగ్గించే ఏర్పాటు చేస్తున్నారు. అనుత్పాదక ఖర్చు తగ్గించి, ఉత్పాదకతకు డబ్బులు వినియోగించి పొదుపరితనాన్ని పాటిస్తున్నారు. అందుకు అభినందించాలి. దాంతోపాటు, ఇందాక అనుకున్నట్లుగా, మూల పెట్టుబడులు బాగా పెరుగుతున్నాయి. రెవెన్యూ లోటు- అంటే, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితులు కూడా ఈ దేశంలో వచ్చాయి. దాన్ని కూడా ఈ సంవత్సరం ఎఫెక్టివ్ రెవెన్యూ లోటు- అంటే నిజమైన రెవెన్యూ లోటును 1. 4 శాతానికి తగ్గించారు. చాలా సంతోషకరం. ఇది ఇంకా తగ్గి రెవెన్యూ లోటు పూర్తిగా పోతుందని మనం ఆశించవచ్చు. కాబట్టి ఈ మూడు రకాలుగా కూడా బడ్జెట్ బాగున్నట్టు లెక్క.

బడ్జెట్ అంచనాల్లో కూడా మోసం చేయలా. వచ్చే ఏడాది, ఉదాహరణకి, నామినల్ గ్రోత్ రేట్- అంటే, నిజమైన అభివృద్ధి, దాంతోపాటు ద్రవ్యోల్బణం రెండూ కలిపినా కూడా పదిన్నర శాతం అని చెప్పారు. ద్రవ్యోల్బణం సహజంగా ఈ దేశంలో 5-6 శాతం ఉంటుంది. అంటే, 5-5. 5 శాతం ప్రగతి వచ్చినా కూడా మనం కచ్చితంగా ఈ బడ్జెట్ అంచనాలను దాటతాం. ఈ సంవత్సరం 7 శాతం, వచ్చే ఏడాది 6. 5-6. 8 శాతం ప్రగతి సాధ్యం అని నమ్ముతున్నారు. 6. 5+5 కలిపితే 12 శాతం ఉంటుంది, కానీ పదిన్నర శాతం చూపెట్టారు. ఆదాయాన్ని తక్కువ అంచనా వేస్తూ, ఖర్చును సరిగా అంచనా వేస్తున్నారు తప్ప మోసం చేయటం లేదు. ఇక చివరిగా మనం చూడాల్సింది, పన్నులు కట్టే వారికి ఏవైనా రాయితీలు వస్తున్నాయా? బహుశా నెల జీతం పొందేవారికి, మధ్యతరగతి వర్గాల వారికి చాలా ఊరట కలిగిస్తోంది ఈ బడ్జెట్. ఏడు లక్షల రూపాయల దాకా ఆదాయపు పన్ను ఉండదు. అంటే తలసరి ఆదాయంతో పోలిస్తే మూడున్నర రెట్లు ఎక్కువ ఆదాయం వచ్చేవారి దాకా ఆదాయపు పన్ను ఒక్క రూపాయి కూడా కట్టనక్కర్లేదు. ప్రపంచంలో ఏ కీలకమైన దేశంలో కూడా అంత తక్కువ పన్నుతో

**మొత్తం బడ్జెట్ (రూ. కోట్లలో)**

**45,03,097**

**రెవెన్యూ వసూళ్లు - 26,32,281**

**మూలధన వసూళ్లు - 18,70,816**

**రెవెన్యూ వ్యయం - 35,02,136**

**మూలధన వ్యయం -10,00,961**

సామాన్యులపై భారం లేకుండా లేదు. అలాగే ఇతరత్రా కూడా పన్ను రాయితీలిచ్చారు. అలాగే, అధికాదాయం ఉన్నవాళ్లకు ఆధునిక యుగంలో పెద్ద దేశాల్లో కూడా లేనంతగా విధించిన 43 శాతం పన్నుల భారాన్ని 39కి తగ్గించి కొంత ఉపశమనం కలిగించే ప్రయత్నం చేశారు. అత్యధిక ఆదాయం ఉన్నవాళ్లు పన్నులు కట్టలేరని కాదు. అధికంగా పన్నులు వేస్తే, పన్నులు కట్టనవసరంలేని చోటికి పెట్టుబడులు తరలిపోతాయి. మన దేశమే నష్టపోతుంది. ఒకప్పుడు అత్యధికంగా పన్నులు వేసి 97% దాకా వసూలు చేసి దేశ ఆర్థిక వ్యవస్థను భ్రష్టుపట్టించి, నల్లడబ్బుని పెంచాం, ఉపాధి కల్పన లేకుండా చేశాం, బీదరికాన్ని కొనసాగించాం. కాబట్టి పన్నులు అవసరమైన మేరకే వేయాలి తప్ప అధిక భారం పడేట్టు వేసినట్లయితే, దేశంలో పెట్టుబడులు ఆగిపోతాయి. అందునా ఆధునిక యుగంలో ఎక్కడ అవకాశముంటే అక్కడ పెట్టుబడులు పెడతారు. ఆ దేశాలకు ఉపాధి వస్తుంది, అక్కడ ఆర్థిక వ్యవస్థ పెరుగుతుంది. అందుచేత, తగిన జాగ్రత్తలతో ఆ మార్గాల్లో కూడా ప్రయత్నం చేస్తున్నారు. నాలుగు రకాలుగా కూడా చాలా హర్షించదగ్గ బడ్జెట్. ఆర్థిక మంత్రికి మంచి మార్కులు మనం వేయవచ్చు అన్ని రకాలుగా కూడా. ఇక కార్యాచరణ మన చేతుల్లో ఉన్నది. పౌరులుగా, పెట్టుబడి పెట్టే పారిశ్రామికవేత్తలుగా చొరవ చూపాల్సి ఉంది. అలాగే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు చాలా పని చేయాల్సి ఉంది. పరిపాలన అంతా చివరికి జరిగేది రాష్ట్రాల్లో. ఈ బాధ్యత రాష్ట్రాల్లో కూడా ఉన్నట్టయితే, అనవసరమైన ఖర్చుల్ని తగ్గించి ఉత్పాదక రంగాల్లో ఖర్చు పెట్టి భవిష్యత్తుకి బాటలు వేసినట్లయితే, బహుశా వచ్చే 25 ఏళ్ల పాటు 7-8 శాతం ప్రగతికి ఈ దేశంలో ఉన్న అవకాశం సాకారమవుతుంది. దీనికి మనం ఎన్నో ప్రయత్నాలు చేయాలి. విద్యని, ఆరోగ్యాన్ని బాగు చేయాలి, మౌలిక సదుపాయాలు పెరగాలి, చట్టబద్ధపాలనని మరింతగా, సమర్థంగా అమలు చేయాలి. ఈ దేశంలో పెట్టుబడి పెడితే అన్యాయం జరగదన్న భరోసా ఉండాలి. సామాన్యుడికి న్యాయం జరగటం కోసం మంచి విద్య, మంచి ఆరోగ్యం కావాలి. నైపుణ్యం రాకపోతే సామాన్యులకి ఆదాయం పెరగదు. అంచేత, ఈ ప్రయత్నాలు చేస్తూ రాష్ట్రాలు కూడా ఇదే తరహాలో దీర్ఘకాలిక అవసరాలకు బాటలు వేస్తే 25 ఏళ్లలో దేశ ఆదాయం ఎనిమిది రెట్లు పెరగటం సాధ్యం. ఎనిమిది రెట్లు పెరిగితే, మనం కచ్చితంగా అభివృద్ధి చెందిన దేశమవుతాం, సంపన్న దేశాలతో పోటీపడగలుగుతాం.



## అక్రమార్జనని సమర్థించడాన్ని మించిన

# దేశ ద్రోహం ఉందా?

-శిరమని నరేష్


మనదేశం ఎన్నో స్కాములు చూసింది. . అయినా మన ఆర్థిక వ్యవస్థ తట్టుకుని నిలబడింది. .
కానీ, 'ఎవరు అవినీతి చేయలేదు' అంటూ ఆ స్కాములను సమర్థించడానికి తమ మేధస్సును ఉపయోగించే మేధావులు, బాబాలు,జర్నలిస్టుల వల్లే తీరని నష్టం జరుగుతోంది.
(ఇదే మేధావులు అన్నాహజారే వెనకాల చేరి అవినీతి వ్యతిరేక ఉద్యమాలు చేసారు. )
ఎదిగిన వాళ్ళంతా అడ్డదారుల్లో ఎదిగిన వారే అనే అభిప్రాయం ప్రజల్లో బలపడడం వల్ల,' ఏదో రకంగా డబ్బు సంపాదించడమే' జీవిత లక్ష్యం అయిపోతుంది. ఈజీ మనీ కోసం వెంపర్లాట పెరుగుతుంది. బలిసినవాళ్ళు వేలకోట్లు దోచుకుంటుంటే, మనం ఈ చిన్న దోపిడీ/మోసం చేయడం తప్పే కాదు అనే సమర్థన మొదలవుతుంది. లంచాలు తీసుకోవడం తప్పే కాదు అని ఉద్యోగులు భావిస్తుంటారు.
కేజీఎఫ్, పుష్ప లాంటి సినిమాలు సూపర్ హిట్ అవడం. . యువత ఆలోచనల్లో వచ్చిన మార్పుకి నిదర్శనం. ప్రజల్లో కష్టపడి ఎదగాలనే తపన, ఆలోచన తగ్గిపోతే, పరిశ్రమలు, వ్యాపారాలకు నమ్మకమైన నాణ్యమైన మానవవనరులు దొరక్క యంత్రాలపై ఆధారపడడం ఎక్కువ అవుతుంది. దీనితో నిరుద్యోగం పెరుగుతుంది. . నిరుద్యోగులని ఆదుకునే పేరుతో ప్రభుత్వాలు ఉచితాలు ప్రకటిస్తాయి. ఈ ఉచితాల భారం నిజాయితీగా పన్ను చెల్లించే ఉద్యోగులు, వ్యాపారాలపై పడుతుంది. దానితో వ్యాపారులు విదేశీ కంపెనీలతో పోటీ పడే శక్తి కోల్పోతారు. ఇది మరింత నిరుద్యోగాన్ని పెంచుతుంది. ఇది ఒక విషవలయంలా కొనసాగుతూనే ఉంటుంది.
అమెరికాలో కార్పోరేట్ మోసాలు లేవా, అమెరికా ఎదగలేదా. . అని ప్రశ్నించేవాళ్ళు గుర్తించాల్సింది ఏమిటంటే. . అమెరికాలో ఒక మోసం బయటపడితే ఎంత పెద్ద పలుకుబడి ఉన్నవారికైనా శిక్ష తప్పదు అనే భయం ఉంటుంది. అంటే, అమెరికాలో 'రూల్ ఆఫ్ లా' మన కన్నా ఎన్నో రెట్లు మెరుగు. (అక్కడ కూడా కొందరు తప్పించుకోవచ్చు). సో, అవినీతిపరుడి కన్నా, ఆ అవినీతిని సమర్థించేవారు దేశానికి ఎక్కువ ద్రోహం చేస్తున్నట్లు. మతం కోసమో, కులం కోసమో, పార్టీ కోసమో, అవినీతిని సమర్థించేవారిని మించిన దేశద్రోహులు ఎవరూ ఉండరు.

# సామాజిక సేవకు చిరునామా లోక్‌సత్తా శ్రీనివాస్

- పందిల్ల శంకర్

ఒకవైపు లోక్‌సత్తా ఉద్యమం, ఇంకొకవైపు వినియోగదారుల హక్కుల ఉద్యమాన్ని రెండున్నర దశాబ్దాలుగా కరీంనగర్ కేంద్రంగా. . సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యేలా, ఉపయోగపడేలా తీర్చిదిద్దిన నిరాడంబర, నిజాయతీపరుడైన కీర్తిశేషులు నరెడ్ల శ్రీనివాస్ జీవితం. . ఆదర్శప్రాయం. . అనుసరణీయం.

విద్యార్థి దశ నుండే హుజూరాబాద్‌లో అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి తన ఆలోచనలతో చాలామందిని ప్రభావితం చేసిన వ్యక్తి అని, శ్రీనివాస్ లాంటి వ్యక్తి తనకు బాల్యం నుండి. . మరణించే వరకు సన్నిహిత మిత్రునిగా ఉండటం తన అదృష్టమని అంటాడు హుజూరాబాద్‌కు చెందిన మరో సామాజిక సేవకుడు ఆవునూరి సమ్మయ్య. శ్రీనివాస్ అకాల మరణం. . సమాజానికే తీరని కష్టంగా మిగిలింది అంటారు సమ్మయ్య సార్.



శీనన్నగా కరీంనగర్‌లో చాలామందికి స్ఫూర్తినిచ్చి ఒక మేధావి వర్గాన్ని తయారుచేసిన ఘనత శ్రీనివాస్‌ది. ఫిలిం సొసైటీ ద్వారా 40 సంవత్సరాల క్రితమే అనేకమందికి చిరపరిచితులైన శ్రీనివాస్ 'ఫిలింభవన్' నిర్మించటంలో కీలకమైన వ్యక్తి.

శీనన్న గొప్ప ప్రజాస్వామికవాది. ప్రజలంటే ప్రాణం. నష్టపోయిన వాడికి, మోసపోయినవాడికి, సామాన్యులకు అండగా ఉంటూ తన జీవితాన్ని వారి సమస్యల పరిష్కారం కోసం వెచ్చించిన వ్యక్తి శ్రీనివాస్ అని, పాలనలో అవినీతిని సహించేవారు కాదని, తన కుటుంబం కన్నా సొసైటీకి ఎక్కువ సమయం, డబ్బు, శ్రమ. . కేటాయించిన గొప్ప మానవతావాది శీనన్న అని కరీంనగర్‌లో వారి అత్యంత సన్నిహితులు ప్రకాష్ హోల్లా పేర్కొన్నారు. శీనన్న లాంటి వాడిని తాను చూడబోనని. . జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ తెలిపారు. ఏనాడూ ఎవరినీ విసుక్కున్నట్లు, కోపగించినట్లు చూడలేదని మరో అత్యంత సన్నిహితులు చంద్రప్రభాకర్ తెలిపారు.

రాజకీయ నాయకులకు చాలామందికి శ్రీనివాస్ ఆదర్శంగా నిలిచేవారు. నాటి పార్లమెంటు సభ్యులు చొక్కారావు అనేక విషయాలపై శ్రీనివాస్‌తో చర్చించేవారు.

దశాబ్దం క్రితం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఏఎస్ఐ మోహన్‌రెడ్డి కేసును శ్రీనివాస్ సవాలుగా తీసుకున్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ, అనేకమందితో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ అతి కిరాతకంగా వసూళ్లు, జప్తులు చేసే మోహన్‌రెడ్డి చేష్టలు భరించరానివిగా మారిన నేపథ్యంలో, బాధితులకు అండగా నిలిచారు శ్రీనివాస్. మోహన్‌రెడ్డి బాధితుల సంఘం ఏర్పాటు. . దానికి లోక్‌సత్తా తోడ్పడటం. . అనేక సమావేశాలు. . జేపీ గారిని కూడా కొన్నిసార్లు పాల్గొనేలా చేయటం. . తద్వారా ప్రభుత్వం, ప్రజల దృష్టికి తీసుకెళ్లటంతోపాటు హైకోర్టులో కేసులు బనాయించి. . మరణించేవరకు బాధితుల పక్షాన పోరాటం చేశాడని, హైకోర్టులో శ్రీనివాస్ సార్ తెలివితేటలతోనే కేసు గెలవగలిగామని, 30 కోట్ల వరకు సొమ్ము రికవరి చేశారని, శ్రీనివాస్ మరణించిన తర్వాత ఇటీవల మోహన్‌రెడ్డిని ఉద్యోగం నుంచి తొలగించారని, శ్రీనివాస్‌లాంటి గొప్పవ్యక్తిని తాను చూడలేదని. . బాధితుల సంఘం అధ్యక్షులు మహేందర్ రెడ్డి తెలిపారు.

శ్రీనివాస్ సార్ సామాజిక సేవలో ఒక శిఖరం. ఆయనతో మూడు దశాబ్దాలు అనేక కార్యక్రమాలలో పాల్గొనటం. . నిర్వహించడం నా అదృష్టం. లోక్‌సత్తా శ్రీనివాస్‌గా పిలువబడి. . పాలనలో లోపాలను, జవాబుదారీతనాన్ని. . అవినీతిని ప్రశ్నించిన ఆయన. . ఇక్కడ సామాన్య ప్రజలను ప్రభావితం చేయగలిగాడు. డాక్టర్ జేపీ గార్కి సన్నిహితుడుగా నిలిచారు. ఇక్కడ లోక్‌సత్తా విస్తరించటంలో ఆయనది కీలక పాత్ర అంటాడు కోల రాంచంద్రారెడ్డి.

లోక్‌సత్తా శ్రీనివాస్ ఫిబ్రవరి, 2022లో కరీంనగర్‌లో మరణించిన తర్వాత ఈ ప్రాంతమంతా విషాదం ఆవరించింది. ప్రశ్నించే గొంతు మూగపోవటం పట్ల ప్రజలు గుండె లోతుల్లో నుంచి బాధ వ్యక్తం చేశారు.

శీనన్నా. .

మీరుంటే వందలమంది ఉన్నట్లు,

వేలమంది అన్నట్లు- అవినీతిని ప్రశ్నించేది మీ కలం, సమాజాన్ని చైతన్యపరచింది మీ గళం,


ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం, ధైర్యం, శౌర్యం, సహకరించటం, సమీకరించటం, ఖర్చు చేయటం, శ్రమించటం, నిరాడంబర జీవితం, నిరాశపడకపోవటం, విషయ పరిజ్ఞానం. . ఇవీ మాకు తెలిసిన మీ లక్షణాలు. క్రమశిక్షణకు మరో పేరు, నిజాయతీకి మారుపేరు శీనన్నకి వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తూ ఆయన జీవితం యువతకు స్ఫూర్తినివ్వాలని ఆశిస్తున్నాం.

(డిసెంబర్ సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జులై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

**6. 3. ప్రభుత్వ రంగ ఆధ్వర్యంలో, ఆచరణసాధ్యమైన తృతీయ స్థాయి వైద్య నమూనా**

ఒక ఆచరణసాధ్యమైన, మనగలిగే తృతీయ స్థాయి వైద్య సేవల నమూనాను అమల్లోకి తెచ్చే క్రమంలో మన ప్రభుత్వ రంగ తృతీయ స్థాయి ఆస్పత్రుల్ని పట్టి పీడిస్తున్న నాలుగు ప్రధాన సమస్యలని మనం పరిష్కరించాలి. మొదటిది, అరకొర నిధులు. పైన వివరించినట్లు, బోధనాస్పత్రులు కూడా ఒక్కో పడకపై ఏడాదికి కేవలం సుమారు పది లక్షల రూపాయలు మాత్రమే ఖర్చు చేస్తున్నాయి. ఇందులోనే అన్ని ఆస్పత్రి సేవలు, నిర్వహణ, జీతాలు, వైద్య, నర్సింగ్ కళాశాలలు నడపటం. నిష్పాక్షికంగా విశ్లేషిస్తే, నాణ్యమైన తృతీయ స్థాయి వైద్యానికి ఒక్కో పడకకి రోజుకి సుమారు రూ. 2500 అంటే, ఏమూలకూ సరిపోదు. 'పెట్' స్కానర్, ఎం. ఆర్. ఐ యంత్రం, సి. టి స్కానర్ వగైరా ఆధునిక డయాగ్నొస్టిక్‌ల కొనుగోలు, నిర్వహణ ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. స్టెరియోటాక్టిక్ రేడియోథెరపీ వంటి అత్యాధునిక థెరపాటిక్ చికిత్సలకి కొన్ని యంత్రాల ఖరీదు దాదాపు ఒక మధ్యస్థాయి పరిశ్రమ స్థాపనతో సమానంగా ఉంటుంది. ఈ మొత్తానికీ డబ్బు ఖర్చవుతుంది. అదేవిధంగా, వైద్య వినియోగ వస్తువులు, మందులు, రక్తానికి సంబంధించిన ఉత్పత్తులకు డబ్బు అవుతుంది. ఒక్కసారి రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు ప్రభుత్వాస్పత్రిలో అందుబాటులో లేకుంటే. . తాము ప్రభుత్వాస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా ఉన్నా సరే, రోగులు ప్రయివేటు రంగం నుండి వాటిని పొందేందుకు సొంతంగా జేబులో నుండి డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇది వారి ఆర్థిక భారాన్ని పెద్దఎత్తున పెంచుతుంది. ప్రభుత్వ ఆస్పత్రి పట్ల విశ్వసనీయతను, నమ్మకాన్ని సడలిస్తుంది. ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రులతో సమానంగా మనం ఒక్కో పడకకు ఏడాదికి ఒక కోటి రూపాయలు ఖర్చు చేయలేకపోయినా, సముచిత రీతిలో వనరుల్ని కేటాయించి, వాటిని వివేకవంతంగా, పొదుపుగా వినియోగిస్తే ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో వైద్యం గణనీయంగా మెరుగవుతుంది. పైన వివరించినట్లు, చేసే ఖర్చుకు ప్రభుత్వాస్పత్రులు ఎన్నో రెట్లు ఎక్కువ విలువను చేకూరుస్తున్నాయి. తృతీయ స్థాయి రంగంలో ఒక్కో పడకకు కేటాయింపుని రెట్టింపు చేసినా, వైద్య, నర్సింగ్ విద్య వ్యయాన్ని జోడించినా కూడా ఖర్చు చాలా ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రుల వ్యయంలో మూడో వంతు నుండి అయిదో వంతు మాత్రమే అవుతుంది. అయితే, ఒక్కో పడకపై ఏడాదికి సగటు కేటాయింపుని రూ. 20–25 లక్షలకి పెంచితే, వ్యయాలు ఆదా అవటం, డయాగ్నొస్టిక్‌ల

ఉమ్మడి వినియోగం, ఇతర వనరులతో ప్రభుత్వాస్పత్రుల్లో తృతీయ స్థాయి వైద్యం విస్తృత స్థాయిలో మెరుగవుతుంది. తగినన్ని నిధులు లేకపోవటం వల్ల అధ్వాన్నంగా మారిన అనేక సేవలు – సిబ్బంది, పారిశుద్ధ్యం, క్లినికల్ ల్యాబొరేటరీలు, నర్సింగ్, డయాగ్నొస్టిక్‌లు, మందుల సరఫరాలు, వైద్య వినియోగ వస్తువులు, ఆపరేషన్ థియేటర్ నిర్వహణ మొదలైనవన్నీ ఈ పెంపు పరిధిలోనే వస్తాయి.

ప్రభుత్వ రంగ తృతీయ స్థాయి ఆస్పత్రులు ఎదుర్కొంటున్న రెండో సవాలు, తగినన్ని పరికరాల, యంత్రాల కొరత, అధ్వాన్న నిర్వహణ. పెట్టుబడి కొరత, అరకొర బడ్జెట్‌లు, ప్రయోజనకరంగా లేని అద్దె పద్ధతులు, జవాబుదారీతనం కొరవడటం. . మొత్తంగా ఏళ్ల తరబడి రోగ నిర్ధారణలు, చికిత్సలకు కావలసిన పరికరాల కొరతకు, ఒకవేళ ఉన్నా నిర్వహణ వైఫల్యానికి, వాటిని నిరుపయోగంగా వదిలేయటానికి కారణమయ్యాయి. మన ప్రజల తృతీయ స్థాయి వైద్య అవసరాలను సమర్థవంతంగా తీర్చేలా బోధనాస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో పరికరాలు, యంత్రాలను మనం ఆధునీకరించటం అవసరం. ఈ ఆధునీకరణకు గణనీయ మొత్తంలో ఏకతూరి పెట్టుబడి అవసరం. యంత్రాలు, పరికరాలను సమకూర్చుకోవటం, వాటి నిర్వహణకు నిపుణులైన సిబ్బందిని నియమించుకోవటం, వాటి వినియోగానికి ప్రక్రియలు, పద్ధతుల్ని ఏర్పరచటానికి సమయం పడుతుంది. ఈ సవాలుని వేగంగా, సమర్థవంతంగా ఎదుర్కోవటానికి వినూత్న నమూనాల్ని వెలువరించి అమలు చేయాల్సి ఉంది. కొన్ని రాష్ట్రాల్లో డయాలసిస్ సేవలను ప్రభుత్వాస్పత్రుల్లో ఔట్‌సోర్స్ చేశారు. యంత్రాలు, పరికరాలు సహా అధునాతన సదుపాయాల్ని ప్రయివేటు ఔత్సాహికులు నిర్మించి, నిర్వహిస్తారు. ప్రభుత్వంలోని స్పెషలిస్టు డాక్టర్ల పర్యవేక్షణలో సేవను అందిస్తారు. ప్రతి డయాలసిస్‌కి ఒప్పందం మేరకు ప్రభుత్వం ధరను చెల్లిస్తుంది. అటువంటి నమూనా ఒక మోస్తరు ధరలోనే విలువైన సేవను అందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన పరిమాణంలో ప్రత్యేకించిన (క్యాప్టివ్) వ్యాపారం ఉంటుంది కాబట్టి, సదరు సదుపాయాన్ని ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేయటం ఖర్చును గణనీయంగా తగ్గిస్తుంది కాబట్టి, ఔత్సాహికులు పెట్టుబడికి పెద్దఎత్తున ఉత్సాహం చూపుతున్నారు. ఆమె/అతనికి ప్రోత్సాహకం ఉంటుంది కాబట్టి. . యంత్ర నిర్వహణ కూడా సదరు ఔత్సాహికునికి అప్పచెప్పవచ్చు. అటువంటి ప్రయివేటు పెట్టుబడుల చొరవ (పి. ఎఫ్. ఐ)ని ప్రభుత్వాస్పత్రుల్లో– డయాలసిస్, ఎంఆర్ఐ, సి. టిస్కాన్, 'పెట్' స్కాన్, రక్తం, రక్తానికి సంబంధించిన ఉత్పత్తులు, క్లినికల్ ల్యాబొరేటరీలు మొదలైన వివిధ డయాగ్నొస్టిక్‌లు, సేవలకు సమర్థవంతంగా అమలు చేయవచ్చు. అదే విధంగా, పారిశుద్ధ్య నిర్వహణ, రోగులకు ఆహార సరఫరా, పరికరాలను శుద్ధి చేయటం వంటి సేవలను ఔట్‌సోర్స్ చేసి, నాణ్యత కోసం పర్యవేక్షణ చేయవచ్చు. దీనివల్ల అత్యున్నత శిక్షణ, నైపుణ్యం కలిగిన ఆరోగ్య సిబ్బంది ఎక్కువ సమయాన్ని రోగికి సేవలు అందించటానికి కేటాయించేందుకు అవకాశం లభిస్తుంది. తృతీయ వైద్య సేవల్లో మెరుగుదలకు పి. ఎఫ్. ఐలకు బ్యాంకు రుణాలిప్పించటం, అటువంటి పెట్టుబడులపై పన్ను రాయితీలు కల్పించటం ప్రభుత్వానికి సులువైన పని. ఒక్కసారి 8–10% నికర ఆదాయాన్ని గ్యారంటీగా ఇచ్చే కచ్చితమైన ఆదాయ అవకాశాన్ని సృష్టిస్తే, అది అనేకమందికి ఆకర్షణీయమైన, సురక్షితమైన పెట్టుబడి మార్గంగా మారుతుంది. పి.ఎఫ్.ఐ నమూనా భారత్‌లో అనుసరించదగ్గ సరైన నమూనాగా రూపుదిద్దుకోవచ్చు. కొన్ని దశాబ్దాలపాటు వరుసగా అధిక ఆర్థిక వృద్ధి శాతాలు నమోదవుతాయన్న సహేతుక అంచనాలున్న ఒక అభివృద్ధి చెందుతున్న దేశంలో.. పి.ఎఫ్.ఐ నమూనా ద్వారా సృష్టించిన పరికరాలు/సదుపాయాలపై రుణాల చెల్లింపు పెద్ద సవాలుగా పరిణమించదు.

తృతీయ స్థాయి ఆస్పత్రులు ఎదుర్కొంటున్న మూడవ సవాలు, అత్యంత నిపుణులు, అత్యున్నత స్థాయి శిక్షణ ఉన్న వైద్య స్పెషలిస్టులను ఆకర్షించలేకపోవటం. ఎనభైల వరకు, అత్యుత్తమ వైద్యుల ఎంపిక ప్రభుత్వ తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో పనిచేయటమే. గత మూడు దశాబ్దాలుగా, అత్యంత నిపుణులైన వైద్యుల్లో ఎక్కువమంది ప్రభుత్వాస్పత్రుల్ని వీడి, అధునాతన ప్రయివేటు తృతీయ స్థాయి ఆస్పత్రులను ఎంచుకుంటున్నారు. వనరుల్ని ఎక్కువగా కేటాయించటం, మెరుగైన పరికరాలు ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితుల్ని కాలక్రమంలో మెరుగుపరుస్తాయి. కానీ అత్యుత్తమ నైపుణ్యాన్ని ఆకర్షించటానికి అవి సరిపోవు. అత్యుత్తమ డాక్టర్లను నియమించటానికి సంకల్పంతో కూడిన ప్రయత్నం ఉన్నప్పటికీ, ప్రభుత్వంలోని నగదు ప్రోత్సాహకం ప్రయివేటు ఆస్పత్రులిచ్చే ప్రతిఫలాలకు సరితూగవు. ఆస్పత్రుల్లో నియమించుకున్న కొత్త, యువ డాక్టర్లు నైపుణ్యాలు, అనుభవాన్ని సంపాదించటానికి, రోగులను ఆకట్టుకుని, ఆస్పత్రి సేవల పట్ల విశ్వసనీయత పెంచే పేరు సంపాదించటానికి కొన్నేళ్లు పడుతుంది. అత్యుత్తమ

ప్రయత్నాలు చేసినా అత్యుత్తమ ప్రతిభకి ప్రభుత్వ అమరికలో పనిచేయటం ఎంతో కష్టమవుతుంది. అత్యున్నత నైపుణ్యాలు, ఎంతో కృషి ఉన్న వైద్య నిపుణులు ప్రాక్టీస్ కోసం స్వేచ్ఛను, వెసులుబాటును, పైస్థాయిలో పెత్తనం ఉండని, ఫలితాలకు ప్రాధాన్యతనిచ్చేటువంటి వాతావరణాన్ని కోరుకుంటారు.

అయితే, యువ అండర్ గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్లకు బోధించటం, శిక్షణనివ్వటం చాలామంది పేరున్న డాక్టర్లకు ఎంతో నచ్చే పని. కాబట్టి, బోధనాస్పత్రుల్లో బోధన, ప్రాక్టీస్ కోసం పేరున్న డాక్టర్లను ఆకర్షించటానికి. . విధులకు హాజరుకావటంలో వెసులుబాటు కల్పించటం, బోధనాస్పత్రుల్లో పార్ట్-టైమ్ ప్రాక్టీస్ అవకాశం, సేవకు తగ్గ ఫీజు నమూనాలో పారితోషికం, అత్యున్నత స్థాయి నిపుణుల విషయంలో ప్రభుత్వ, ప్రయివేటు భేదాన్ని చెరిపేయటం వంటి ఏర్పాట్లతో సరళమైన నమూనాలను రూపొందించాలి. దీనివల్ల ప్రభుత్వ తృతీయ ఆస్పత్రులు గొప్ప విశ్వసనీయత, ఉన్నత ప్రమాణాల సేవలు, వైద్య విద్యార్థులకు మెరుగైన విద్య వంటి రూపాల్లో లాభపడతాయి.

ప్రభుత్వాస్పత్రుల్లో సేవల నాణ్యతను గణనీయంగా మెరుగుపరిచేందుకు అమలు చేయదగిన మరో పి. పి. పి నమూనా స్వతంత్ర నిపుణుల వ్యవస్థను సృష్టించటం. వీళ్లు ఈ ఆస్పత్రుల్లో రొటేషన్ పద్ధతిలో నాయకత్వ బాధ్యతల్ని నిర్వహిస్తారు. చురుకైన, అత్యుత్తమ నైపుణ్యాలున్నవారిని ఈ ఆస్పత్రుల్లో చేరేలా ఆకర్షించేందుకు, బలమైన ప్రోత్సాహకాన్ని అందించేందుకు.. ప్రయివేటు రోగుల నుండి ఆస్పత్రి ఆదాయాన్ని ఆర్జించే ఎయిమ్స్, పోస్టు గ్రాడ్యుయేట్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ & రీసెర్చి (పి. జి. ఎం. ఇ. ఆర్) నమూనాల తరహాలో ఈ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెద్ద ప్రయివేటు వైద్య బ్లాకుల్ని నిర్మిస్తారు. నివాస సౌకర్యాలు (ప్రయివేటు గది, ఆహారం ఇతర సదుపాయాలు) ప్రయివేటు బ్లాకులో భిన్నంగా ఉంటాయి. చికిత్సలు (క్లినిక్‌లు, దయాగ్నొస్టిక్ సేవలు, ఆపరేటింగ్ థియేటర్) ఉచిత రోగుల తరహాలోనే ఉంటాయి. స్వతంత్ర డాక్టర్లు కొన్ని పడకల మేర, కొన్ని రోజుల మేర ప్రయివేటు ప్రాక్టీసు చేయవచ్చు. ఆపరేషన్ ఫీజు, సంప్రదింపు ఫీజు మొదలైనవి సహా నిర్దేశిత ప్రమాణాలకనుగుణంగా బిల్లుల రూపకల్పన ఉంటుంది. సముచిత పారితోషికంతోపాటు బోధనా సౌకర్యం, స్వతంత్రంగా పని, నాయకత్వ అవకాశాలు, ప్రోత్సాహకాలున్న ప్రయివేటు పనితో కూడిన అటువంటి వ్యవస్థ. . ఆ తరహా సంస్థల్లో చేరి వాటిని సుస్థిరం చేసేలా అనేకమంది స్పెషలిస్టులను ప్రయివేటు నుండి, దేశం బయటి నుండి కూడా ఆకర్షిస్తుంది. వాళ్లు ఆస్పత్రులకు ఆదాయం తెచ్చి, అవి పోటీ పడేలా చేయటంతోపాటు సేవల నాణ్యతను కూడా మెరుగుపరుస్తారు.

చివరిగా, ఒక ఆధునిక తృతీయ స్థాయి ఆస్పత్రిని కేంద్రీకృత, బ్యూరోక్రాటిక్ అమరికతో సమర్థవంతంగా నడపటం లేదా అందులో నాణ్యమైన సేవలను నిలకడగా అందించటం సాధ్యం కాదు. ఆస్పత్రి స్థాయిలో స్వతంత్ర ప్రతిపత్తి, నియామకాల్లో వెసులుబాటు, రోజువారీ సవాళ్లను ఎదుర్కోవటానికి వేగంగా నిర్ణయాలు, ఆస్పత్రికి లక్ష్యాల్ని నిర్ణయించి సాధించటంలో స్వేచ్ఛ, రోగి సంరక్షణకు విభిన్నంగా, వృత్తి నైపుణ్యంతో ఆస్పత్రి నిర్వహణ, క్లినికల్ పరిశోధన, అధ్యయనంపై కేంద్రీకరణ, సేవల నాణ్యత పెంచేందుకు నిరంతరం నూతన పోకడలు. . తృతీయ స్థాయి ఆస్పత్రిలో అందుబాటు వ్యయంలో సామర్థ్యం, విశ్వసనీయతల్ని పెంపొందించేందుకు కీలకం. కాబట్టి ప్రస్తుతమున్న రాష్ట్ర స్థాయిలో కేంద్రీకరణ, కాలం చెల్లిన నిర్ణయాల పద్ధతి నమూనాను పూర్తిగా పునర్నిర్మించాలి. సమర్థవంతమైన జవాబుదారీ వ్యవస్థల ఏర్పాటు, ఫలితాలను నిష్పాక్షికంగా బేరీజు వేయటం, పనితీరు పర్యవేక్షణలతో స్వతంత్ర ప్రతిపత్తి, స్థానిక నిర్ణయాధికారం, నూతన పోకడలకు నమూనాలో అవకాశం కల్పించాల్సిన అవసరముంది.

మార్కెట్ ఆధారిత ప్రయివేటు తృతీయ స్థాయి నమూనా ఆర్థికంగా ఆచరణసాధ్యం కాకపోయినా.. ప్రభుత్వ తృతీయ సేవల ఆస్పత్రుల మధ్య సామర్థ్యాన్ని మెరుగుపరచటానికి, మెరుగైన వ్యయ నియంత్రణకు, స్పెషలైజేషన్‌ని పెంపొందించేందుకు ఎంపిక, పోటీలాంటి కొన్ని మార్కెట్ అంశాలను ప్రభుత్వరంగం పరిధిలోనే ఎంపిక చేసిన చికిత్సల్లో ప్రవేశపెట్టవచ్చు. ఎంపిక చేసిన చికిత్సలు, శస్త్ర చికిత్సలకు సేవలకు తగ్గ ఫీజు నమూనాను ప్రవేశపెట్టి, ఆస్పత్రులకు ఆదాయ మార్గాన్ని సృష్టించవచ్చు. అటువంటి నమూనా.. నైపుణ్యాన్ని సంపాదించుకోవటానికి, పేరు గడించటానికి, సేవల నాణ్యత నిబంధనను మెరుగుపరచటానికి ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా పనిచేస్తుంది. ఆస్పత్రులకొచ్చే తృతీయ స్థాయి సేవల నిధుల్లో 20 శాతాన్ని సేవకు-ఫీజు నమూనాలో ఇటువంటి చికిత్సల కోసం పక్కన పెట్టవచ్చు. ఈ నమూనా ప్రతిభను ఆకర్షిస్తుంది, పనితీరుకు ప్రోత్సాహకాన్నిస్తుంది, ఆస్పత్రులు వాటికి బలాలు, సాపేక్షంగా సానుకూలతలు ఉన్న విభాగాల్లో ప్రత్యేకీకరించిన వైద్య సేవలను అందించటాన్ని ప్రోత్సహిస్తుంది.

(ఇంకా ఉంది. . . )




## ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు @

# youtube.com/JP Loksatta

స్వతంత్ర భారతం 75 - లోక్‌సత్తా 25 కలిసి వచ్చిన అపురూప సందర్భంలో భవిష్యత్ భారత కార్యాచరణపై ఆబాలగోపాలం తప్పక చూడాల్సిన, భద్రపరచుకోవాల్సిన 5 అద్భుత ఇంటర్వ్యూలు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో..

1) **సామాజిక, రాజకీయ విశ్లేషకురాలు, యువ జర్నో స్వాతి ఇంటర్వ్యూ :**
   ఎన్నికల్లో ముక్కుమూసుకుని ఓట్లు వేయటం, ఎవర్ని గెలిపించినా ఏమున్నది గర్వకారణం అని నిట్టూర్చటం, మార్పు కోసం ఏదైనా చేయగల సత్తా ఉన్న యువత రోజువారీ జీవితంలోనే అలసిపోతుండటం.. ఏమిటి చేయటం?.. ఇంకా పలు ప్రశ్నలు.
2) **లైఫ్‌లో ఇంతవరకూ ఎవరినీ ఇంటర్వ్యూ చేయని సామాజిక, పాలనా అంశాల ఉద్యమకారులు, ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి పద్మనాభరెడ్డి ఎక్స్‌క్లూజివ్ :**
   రాజకీయాల్లోకి వస్తే చెప్పుతో కొట్టండి.. అన్న వారిని అధికారంలోకి తేవటం తప్ప లోక్‌పాల్ ఉద్యమం సాధించింది ఏమిటి? దేశంలో అవినీతి ఎందుకు అంతం కావటం లేదు?.. & మోర్.
3) **సామాజిక, రాజకీయ ఉద్యమకారులు, మీడియా విశ్లేషకులు కటారి శ్రీనివాసరావు ఇంటర్వ్యూ:**
   మోదీ, కేసీఆర్, జగన్‌ల బాకాలే తప్ప ఉద్యమకారులు, పౌర సమాజం గొంతు ఈవేళ బలంగా ఎందుకు వినిపించటం లేదు? ఏవి ఉచితాలు, ఏవి అనుచితాలు.. సంక్షేమం అంటే ఏమిటి?.. ఇంకా అనేక అంశాలు (రెండు భాగాలు).
4) **విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర ఎక్స్‌క్లూజివ్:**
   ట్యాక్స్ ఎగ్గొడితే అది నల్లడబ్బు. మరి సరిగా సేవలు అందించని ప్రభుత్వాలకు పన్ను సరిగా కట్టనక్కర్లేదనుకునే పౌరులు కూడా బ్లాక్‌మనీగాళ్లే అవుతారా? ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు ఎలా ఉండాలి?.. & మోర్ (రెండు భాగాలు).
5) **పబ్లిక్ పాలసీ యువ రీసెర్చర్ సుమేధ ఇంటర్వ్యూ (ఇందులో జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీవీ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు):**
   మోదీ ఈడీని ప్రయోగిస్తున్నాడని ఆరోపిస్తున్నారు గానీ.. ఒక్క పార్టీ కూడా చట్టబద్ధపాలనని సంస్కరించాలని ఎందుకు డిమాండ్ చేయటం లేదు? డ్రగ్స్‌ని నిషేధించినా ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?.. ఇంకా పలు ప్రశ్నలు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th Febraury, 2023 Posting Date 15 &16th of every month



# పార్టీలు, నేతలు ఆలోచించుకోవాలి

ఆరోగ్య వ్యయాల్ని సొంతంగా భరించాల్సి రావటం వల్ల.. తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో పేద, మధ్యతరగతి ప్రజలు నిరంతరం నలిగిపోతున్నారు. ఫలితంగా, పేదరికం, అనారోగ్యం వల్ల ఆదాయాన్ని కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతోంది. దీని పర్యవసానాలు రెండు రకాలుగా ఉన్నాయి. మొదటిది, పేదరిక రేఖకు కాస్త ఎగువకు చేర్చగలిగాం అనుకునేలోపే కోట్లాదిమంది పేదరికంలోకి జారిపోతున్నారు. కేవలం అనారోగ్య సమస్యల ఖర్చుల వల్ల ఏటా 5.5 కోట్ల మంది ప్రజలు పేదలుగా మారిపోతున్నారని జాతీయ స్థాయి ప్రభుత్వం అంచనా వేస్తోంది. రెండోది, అప్పటికే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి పేదరికాన్ని చికిత్సల ఖర్చు మరింత దుర్భరం చేస్తోంది. దేశవ్యాప్త సగటును కాకుండా.. కేసుల వారీగా పరిశీలిస్తే ఈ భారం అనేక రెట్లు ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఇంకా డాక్టర్ల నియామకం, జీతాలు అనే విఫల పద్ధతినే అనుసరిస్తే ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేయటం సాధ్యం కాదు. ప్రాథమిక వైద్యం పటిష్ఠం కాకుండా ఆస్పత్రుల స్థాయిలో ఎన్ని పథకాల్ని ప్రవేశపెట్టినా ప్రజలకు ఆరోగ్యం అందదు. వైద్యుల మధ్య పోటీ, ప్రజలకు ఎంపిక స్వేచ్ఛతో ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను ప్రవేశపెట్టి, ఒక్కో పేషెంట్‌కి ఇంతని చెల్లించే నమూనాను ప్రభుత్వం అమలుచేయటం, తృతీయ స్థాయిలో ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేసి ప్రయివేటు నిపుణులు కూడా కొంతసమయం సేవలందించే ఏర్పాటు చేయటం వంటి వినూత్న పరిష్కారాలు ఇప్పుడు అవసరం. ఈ రకమైన ఏర్పాట్లతో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయటానికి పెద్ద ఖర్చు అక్కర్లేదు, ఓట్లు కూడా వస్తాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీలు, నేతలు ఆలోచించుకోవాలి.

– డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**